Rni Title Code No. TELTEL02115

# గరుడ వార్త

తెలుగు దినపత్రిక

www.garudavarthanews.com
www.garudavarthanews.in

సంపుటి : 1 సంచిక : 244 మేడ్చల్ మల్కాజ్‌గిరి 23 సెప్టెంబర్ 2023 శనివారం పేజీలు : 4

## పాక్‌లో జనవరిలో ఎన్నికలు.. షెడ్యూల్ విడుదల

ఇస్లామాబాద్: సంక్షోభ పాకిస్థాన్‌లో వచ్చే ఏడాది జనవరి చివరి వారంలో సాధారణ ఎన్నికలు జరగనున్నాయి. ఈ మేరకు ఆ దేశ ఎన్నికల సంఘం (ఈసీపీ) షెడ్యూల్ విడుదల చేసింది. పాకిస్థాన్‌లో జాతీయ అసెంబ్లీ ముందస్తుగా ఆగస్టు 9న రద్దయింది. సాధారణంగా అసెంబ్లీ రద్దయిన 90 రోజుల్లో ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే గత ప్రభుత్వం తన పదవీకాలం ముగియడానికి కొన్ని రోజుల ముందు.. జనాభా లెక్కలు పూర్తిచేసి నియోజకవర్గాలను పునర్విభ జించిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని నిర్ణయం తీసుకుంది. డీలిమిటేషన్ ప్రక్రియకు కనీసం నాలుగు నెలల సమయం పట్టే అవకాశం ఉన్నందున ఎన్నికలు వచ్చే ఏడాదికి వాయిదా పడ్డాయి.

# ‘ఎర్రన్న’ లవి గొంతెమ్మ కోర్కెలేనా!?

## కాంగ్రెస్ - కామ్రేడ్స్ పొత్తులో

# కొత్త టెన్షన్!



హైదరాబాద్ : తెలంగాణలో అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న కొద్దీ రాజకీయ ఎత్తులు పై ఎత్తులు జోరందుకుంటున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా కొద్దికాలం క్రితం వరకూ లెఫ్ట్ పార్టీలతో దోస్తీ కట్టిన బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ సీఎం కేసీఆర్... హఠాత్తుగా వారిని సైడ్ చేసేశారు. కామ్రెడ్లకు బలం ఉందని వారు చెప్పుకొనే నియోజకవర్గాల్లో కూడా తన పార్టీ అభ్యర్థులను అనౌన్స్ చేసేసి దిమ్మతిరిగే షాక్ ఇచ్చారు. దీంతో కస్సుమన్న కామ్రెడ్లు.. కాంగ్రెస్ పార్టీకి చేరువయ్యే పనిలో పడ్డారు. అయితే ఇప్పుడు హస్తం పార్టీ అవాక్కయ్యే ప్రతిపాదనలు వారి ముందు ఉంచినట్లు ప్రచారం జరుగుతోంది. బీఆర్ఎస్ తో పొత్తుకు బ్రేక్ వేస్తూ గులాబీ దళపతి కేసీఆర్ అవాక్కయ్యే అంతటి షాక్ ఇవ్వడంతో కామ్రేడ్ పార్టీ నేతలు కాంగ్రెస్ వైపు చూస్తున్నారు. జాతీయ స్థాయిలో ఇండియా కూటమిలో వామపక్షాలు, కాంగ్రెస్ కలిసే కొనసాగుతుండటంతో తెలంగాణ రాష్ట్రంలో పొత్తు పెట్టుకోవడం ఆ పార్టీలకు సులభమైపోయింది. దీంతో ఇప్పటికే ప్రాథమిక చర్చలు జరిపినట్లు సమాచారం. అయితే, కామ్రెడ్ పార్టీ నేతలు అడుగుతున్న సీట్ల విషయంలోనే కాంగ్రెస్ నేతలకు షాక్ అవుతున్నారట. కొత్తగూడెం, మునుగోడు, హుస్నాబాద్, బెల్లంపల్లి, దేవరకొండ స్థానాలను సీపీఐ ఆశిస్తుండగా మధిర, ఖమ్మం, భద్రాచలం, పాలేరు, మిర్యాలగూడ, ఇబ్రహీంపట్నంలో తమకు అవకాశం ఇవ్వాలని సీపీఎం ప్రతిపాదించినట్లు సమాచారం. అయితే, కాంగ్రెస్ కీలక నేతల నియోజకవర్గాలు ఇవే కావడంతో హస్తం పార్టీలో టెన్షన్ మొదలైందని తెలుస్తోంది. సీఎల్పీ నేత భట్టి విక్రమార్క నియోజకవర్గమైన మధిర స్థానం కోసం సీపీఎం పట్టుబడుతుండటం కాంగ్రెస్ నేతలకు ఊహించని షాక్ గా మారిందని అంటున్నారు.

దీంతోపాటుగా ఉమ్మడి ఖమ్మంలో జిల్లాలో ముఖ్యమైన నేతగా గుర్తింపు పొంది కాంగ్రెస్ లో ఇటీవలే చేరిన తుమ్మల నాగేశ్వరరావు పాలేరు నుంచి పోటీ చేస్తారని ప్రచారం జరుగుతుండగా సీపీఎం తమకే ఇక్కడ చాన్స్ ఇవ్వాలని డిమాండ్ పెట్టిందట. ఖమ్మం సీటునూ కామ్రేడ్లు అడుగుతున్నారని సమాచారం. ఇక గ్రేటర్ హైదరాబాద్‌లోని కీలకమైన ఇబ్రహీంపట్నం టికెట్ ను మల్ రెడ్డి రంగారెడ్డి ఆశిస్తుండగా సీపీఎం తమకు ఈ సీటు ఇవ్వాలని ప్రతిపాదించిందని సమాచారం. దీంతో కాంగ్రెస్ నేతలే స్వయంగా కామ్రెడ్లతో పొత్తు విషయంలో డైలమాలో పడ్డారని సమాచారం. దీంతో అసలు కాంగ్రెస్ తో కమ్యూనిస్టులకు పొత్తు కుదురుతుందా..? చర్చల ద్వారా కొన్ని నియోజకవర్గాలను వదులుకునేందుకు ఆ పార్టీ నేతలు ఒప్పుకొంటారా అనేది చర్చనీయాంశంగా మారింది. అయితే, చివరి నిమిషంలో కమ్యూనిస్టు నేతలే తమ డిమాండ్ల విషయంలో వెనక్కు తగ్గుతారని కాంగ్రెస్ నేతలు నమ్ముతున్నట్లు చెప్తున్నారు.

## షర్మిలకు నీడనివ్వని కాంగ్రెస్...... ఊరిస్తున్న పాలేరు సీటు...!

ఖమ్మం : కాంగ్రెస్ పార్టీలో వైఎస్సాటీపీని విలీనం చేయడానికి ఇప్పటిదాకా ఎదురుచూసిన వైఎస్సార్టీపీ ప్రెసిడెంట్ వైఎస్ షర్మిల ఇపుడు వేరే ఆలోచనలలో పడినట్లుగా తెలుస్తోంది. తన పార్టీని విలీనం చేయకుండా వచ్చే ఎన్నికల్లో సొంతంగా పోటీకి సిద్ధం అవుతున్నట్లుగా చెబుతున్నారు. దానికి కారణం తెలిసిందే. కాంగ్రెస్ పార్టీ కొన్ని షరతులు పెడుతుంది. షర్మిలకు కొన్ని షరతులు ఉన్నాయి. ఈ రెండింటినీ పొసగడం లేదు అంటున్నారు. వైఎస్ షర్మిల సేవలను ఏపీకే ఎక్కువగా వాడుకోవాలని కాంగ్రెస్ హై కమాండ్ చూస్తోంది అని అంటున్నారు. ఆమె వైఎస్సార్ కుమార్తె కావడం, అక్కడ ఆమె సోదరుడు వైఎస్ జగన్ కాంగ్రెస్ ఓటు బ్యాంక్ ని కొల్లగొట్టడంతో దాన్ని తిరిగి సాధించాలన్న ఆలోచనలలో కాంగ్రెస్ పెద్దలు ఉన్నారు. అది జరగాలీ అంటే వైఎస్సార్ కుటుంబం నుంచి ఒక చీలిక రావాలని షర్మిల అయితే ఎంతో కొంత ఓటు బ్యాంక్ ని వెనక్కి రప్పించగలరని ఆ పార్టీ యోచిస్తోంది. కాంగ్రెస్ లో షర్మిల చేరితే కర్నాటక నుంచి రాజ్యసభ ఎంపీ పదవి ఇస్తామని కూడా చెబుతున్నారని తెలుస్తోంది. అయితే తాను తెలంగాణాలో రాజకీయాలకే పరిమితం అవుతానని షర్మిల చెప్పినట్లుగా ప్రచారం జరిగింది. అంతే కాదు ఖమ్మం జిల్లా పాలేరు నుంచి పోటీకి కూడా షర్మిల పట్టుబడుతున్నారు. అయితే అక్కడ నుంచి మాజీ మంత్రి బీయారెస్ నుంచి వచ్చిన తుమ్మల నాగేశ్వరరావు కి టికెట్ కన్ ఫర్మ్ అయింది అని అంటున్నారు. ఆయన



ఆ సీటు మీద కన్ను వేసి కాంగ్రెస్ లో చేరారు అని తెలుస్తోంది. ఇక కాంగ్రెస్ లో చేరాక ఆయన పాలేరులోని తన అనుచరులతో సమావేశాలు జరిపారు అని అంటున్నారు. వచ్చే ఎన్నికల్లో తుమ్మల కాంగ్రెస్ నుంచి పాలేరు సీటులో పోటీ పడడం ఖాయమని తెలుస్తోంది. దీంతో షర్మిల ఆశలు పూర్తిగా నీరుకారాయని అంటున్నారు. ఇక కాంగ్రెస్ పెద్దలు మూడు రోజుల పాటు హైదరాబాద్ లో ఉన్నా కూడా షర్మిల పార్టీ విలీనం విషయం ఎక్కడా ప్రస్తావనకు రాలేదు. ఒక విధంగా చెప్పాలీ అంటే కాంగ్రెస్ లైట్ తీసుకుందని అంటున్నారు. దీంతో షర్మిలకు ఆప్షన్లు లేవని అంటున్నారు. ఆమె చేరితే కాంగ్రెస్ కండిషన్లకు అంగీకరించి పార్టీలో చేరాలి. ఒక డిసెంబర్ లో తెలంగాణాలో జరిగే ఎన్నికల్లో ఆమె ప్రచారం చేయాలి. ఆ మీదట అంటే 2024 ఏప్రిల్ లో జరిగే రాజ్యసభ ఎన్నికల్లో ఆమెకు టికెట్ ఇస్తారు. ఒకవేళ కాంగ్రెస్ తెలంగాణాలో గెలవకపోయినా మరే ఇతర కారణాలు ఉన్నా కూడా ఆ హామీ కూడా ఏమవుతుంది ఎవరూ చెప్పలేరు. మొత్తానికి షర్మిల విషయంలో కర్ణాటక మంత్రి డీకే శివకుమార్ ఎంతో చెప్పి కేంద్ర నాయకత్వాన్ని కన్వీన్స్ చేసినా కూడా హస్తం పార్టీ నీడకు షర్మిల చేరుకోలేకపోయారు అంటున్నారు. దాంతో ఆమె రెండేళ్ల క్రితమే తాను పాలేరులో పోటీ చేయనున్నట్లుగా ప్రకటించారు. అక్కడ జెండా ఆవిష్కరించారు. పార్టీ ఆఫీసు తెరిచారు. ఇపుడు కూడా ఆమె లేటెస్ట్ గా చూస్తే తన పార్టీ క్యాడర్ తో సమావేశం అవుతున్నారు. తన సొంత పార్టీ తరఫునే పాలేరు నుంచి పోటీ చేసి గెలిచి అసెంబ్లీలో అడుగుపెట్టాలని షర్మిల పట్టుదల మీద ఉన్నారని అంటున్నారు. అయితే అదంత ఈజీ కాదని అంటున్నారు.

తుమ్మల నాగేశ్వరరావు బిగ్ షాట్. ఆయనకు కాంగ్రెస్ అండగా ఉంటుంది. దాంతో ఆయన వేవ్ కనుక ఉంటే దూసుకునిపోతారు. మరో వైపు చూస్తే బీయారెస్ కూడా పోటీకి దిగుతుంది, బీజేపీ ఎటూ ఉంటుంది. ఇన్ని పార్టీలను తట్టుకుని షర్మిల విజయం సాధ్యమేనా అంటే ఆమెకు అదే అసలైన ఆప్షన్ అంటున్నారు. సో పాలేరు నుంచి షర్మిల పోటీ ఖాయమని అంటున్నారు.




## కొత్తగూడెంలో చంద్రబాబు అభిమానుల భారీ ర్యాలీ.. పాల్గొన్న సీపీఐ నేత కూనంనేని

తెదేపా అధినేత చంద్రబాబు అరెస్టును ఖండిస్తూ తెలంగాణలోని కొత్తగూడెంలో భారీ ర్యాలీ నిర్వహించారు. చంద్రబాబు అభిమానులు, తెదేపా కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొని ఆయనకు మద్దతుగా ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. ఈ ర్యాలీలో సీపీఐ నేత కూనంనేని సాంబశివరావు పాల్గొన్నారు. ఏపీ సీఎం జగన్ రాక్షస పాలనను ప్రజలు గుర్తిస్తున్నారన్నారు.



# సంచలనాల మోడీ...

## భాగ్యనగరాన్ని యూటీ చేస్తారా!?

## సోషల్ మీడియా మొత్తం ఇదే రచ్చ!!

హైదరాబాద్ : కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం సంచలన నిర్ణయాల దిశగా సాగుతున్న సంగతి తెలిసిందే. చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్, జమిలి ఎన్నికలు, దేశం పేరు మార్పు, ఉమ్మడి పౌరస్మృతి.. ఇలా వివిధ అంశాలపై సంచలన నిర్ణయాలు తీసుకుంటుందని చెబుతున్నారు. ఇప్పటికే చట్ట సభల్లో మహిళలకు రిజర్వేషన్ బిల్లు పార్లమెంటులో రెండు సభల్లో ఆమోదం పొందింది. ఈ నేపథ్యంలో మరొక అంశంపై కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకునే చాన్సు ఉందని గాసిప్స్ వెలువడుతున్నాయి. హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతంగా ప్రకటిస్తారని ఒక పుకారు బయలుదేరింది. ఇప్పటికే మహారాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు నానా పటోలే ముంబైను కేంద్రపాలిత ప్రాంతంగా చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఇటీవల సంచలన వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. అయితే కేంద్రపాలిత ప్రాంతమంటూ ముంబై, కోల్ కతా, బెంగళూరు, చెన్నై, హైదరాబాద్ ఇలా వివిధ నగరాల పేర్లపై గాసిప్స్ వినిపిస్తున్నాయి. వాస్తవానికి దేశ రాజ్యాంగంలోనే దేశానికి రెండో రాజధాని ఉండాలని.. అది దక్షిణ భారతదేశంలో ఉండాలని ఉందని అంటున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్ ను కేంద్రపాలిత ప్రాంతం చేయాలని గతంలోనే డిమాండ్లు వినిపించాయి. ముఖ్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ను విభజించి తెలంగాణను విడగొట్టాక హైదరాబాద్ ను కోల్పోయిన ఆంధ్రులు హైదరాబాద్ ను యూటీ (కేంద్రపాలిత ప్రాంతం) చేయాలని డిమాండ్ వినిపించారు. కొంతమంది రాజకీయ నేతలు దీనికి స్వరం కలిపారు. దేశానికి రెండో రాజధానిగా హైదరాబాద్ ఉండాలని, రెండో రాజధానిగా ఉండటానికి హైదరాబాద్ కు అన్ని హంగులు ఉన్నాయన్నారు. దక్షిణ భారతదేశానికి మధ్యలో ఉందని, అన్ని రాష్ట్రాలకు సమాన దూరంలో ఉందనే అభిప్రాయాలు వినిపించాయి. అయితే అప్పట్లో తెలంగాణను ఏర్పాటు చేసిన యూపీయే ప్రభుత్వం హైదరాబాద్ ను యూటీగా ప్రకటించలేదు. ఇప్పుడు హైదరాబాద్ ను యూటీ చేస్తారని గాసిప్స్ వినిపిస్తున్నాయి. మరోవైపు ముంబై, బెంగళూరు, కోల్ కతా, చెన్నై తదితర నగరాల పేర్లు వెలుగులోకి వస్తున్నాయి. అలాగే దేశంలో అన్ని మెట్రోపాలిటన్ నగరాలు (చెన్నై, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, కోల్ కతా తదితరాలు)ను కేంద్రపాలిత ప్రాంతాలుగా ప్రకటిస్తారనే గాసిప్స్ వినిపిస్తున్నాయి. ఒక్క ముంబై (మహారాష్ట్ర)లో తప్ప మెట్రోపాలిటన్ నగరాలు ఉన్న రాష్ట్రాల్లో ఎక్కడా బీజేపీ అధికారంలో లేదు. చెన్నై (తమిళనాడు)లో డీఎంకే, కోల్ కతా (పశ్చిమ బెంగాల్)లో తృణమూల్ కాంగ్రెస్, హైదరాబాద్ (తెలంగాణ) లో బీఆర్ఎస్, బెంగళూరు (కర్ణాటక)లో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నాయి.

ఒకవేళ వీటిలో ఏ నగరాన్ని అయినా యూటీని చేయడానికి కేంద్రం ప్రయత్నిస్తే ఈ ప్రాంతీయ పార్టీలు భారీ నిరసనకు దిగడం ఖాయం. ప్రాంతీయ ఉద్వేగాలను రెచ్చగొట్టి ఎన్నికల్లో లాభపడే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో బీజేపీ తేనెతుట్టెలాంటి వ్యవహారమైన అయిన ఈ విషయం జోలికి పోదనే గట్టిగా అంతా నమ్ముతున్నారు. అయితే కేంద్రం ప్రస్తుతం సంచలన నిర్ణయాలు తీసుకుంటుండటంతో గాసిప్స్ అయితే ఆగడం లేదు. హైదరాబాద్ యూటీ అవుతుందని అంటున్నారు.

# సంపాదకీయం

## భవనం మారింది..

## 'భావన' మారుతుందా మోడీ సర్!!

పార్లమెంటు పాత భవనం మారింది. కొత్త పార్లమెంటు భవనం ప్రారంభించిన దాదాపు రెండు మాసాల తర్వాత.. ఇక్కడ ఉభయ సభలు కొలువు దీరాయి. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలకు ప్రధాన మంత్రి నరేంద్ర మోడీ సర్కారు పిలుపు నిచ్చిన తర్వాత.. అందరూ అనుకున్నట్టుగానే ఈ 'మార్పు' చోటు చేసుకుంది. ఇక, పాత పార్లమెంటు భవనానికి వీడ్కోలు పలుకుతూ.. ప్రధాని నరేంద్ర మోడీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఇందిరా గాంధీ పేరు ఎత్తకుండా.. ఇతర ప్రధానుల పేర్లు చెబుతూ.. ఎంతో మంది ఈ పార్లమెంటు నుంచి ఎన్నో వేల చట్టాలు చేశారని అన్నారు. దాదాపు 48 నిమిషాల పాటు పాత పార్లమెంటు భవనం సెంట్రల్ హాల్‌లో ఉభయ సభల సభ్యులను ఉద్దేశించి ప్రధాని మోడీ సుదీర్ఘ ప్రసంగం చేశారు. ఇక, ఆ తర్వాత..పాత పార్లమెంటు భవనం నుంచి పాదయాత్రగా ఎంపీలతో కలిసి.. ఆయన కొత్త పార్లమెంటు భవనంలోకి అడుగు పెట్టారు. అక్కడ కూడా ఇదే తరహాలో 40 నిమిషాలకు పైగానే సుదీర్ఘంగా ప్రసంగించారు. పాత, కొత్త భవితవ్యాలను ఉటంకించారు. జీ-20 సదస్సుల విజయం సహా భారత ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటోందని, ప్రపంచంలోనే బలమైన ఆర్థిక వ్యవస్థగా అంకురిస్తోందని చెప్పుకొచ్చారు. ఇక, పనిలో పనిగా..పార్లమెంటు వ్యవహారాలను కూడా ప్రధాని ఉటంకించారు. పార్లమెంటు ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. "ఇప్పటి వరకు పార్లమెంటు సభలు ఎలా జరుగుతున్నాయో.. యావత్ భారత్ వీక్షించింది. ఈ సభల్లో మరిన్ని మార్పులు రావాల్సిన అవసరం ఉంది. సభ్యులపై గురుతర బాధ్యత మరింత పెరుగుతుంది. ప్రజల సమస్యల పరిష్కారానికి.. ఈ వేదిక సమున్నతంగా వినియోగించుకోవాలి. వినియోగపడాలి!" అని కూడా మోడీ పిలుపునిచ్చారు. అయితే.. మోడీ చేసిన ఈ వ్యాఖ్యల తర్వాత.. దేశవ్యాప్తంగా ఆయన వ్యవహార శైలిపై ఆసక్తికర చర్చ తెరమీదకి వచ్చింది. భవనం మారింది సరే.. భావన మారుతుందా? అని పార్లమెంటు గురించి.. సీనియర్లు వ్యాఖ్యలు చేస్తున్నారు. ఎందుకంటే.. సహజ రాజకీయాలు పార్లమెంటును కుదిపేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. తమకు నచ్చిన వారికి ఒకరకంగా.. నచ్చనివారిని మరో రకంగా పార్లమెంటులోనే ట్రీట్ చేస్తున్న పరిస్థితి కనిపిస్తోంది. ప్రజాస్వామ్యానికి పార్లమెంటు పట్టుగొమ్మగా మారాలని అభిలషిస్తున్న ప్రధాని.. ప్రతిపక్షాలకు మాట్లాడే సమయమే ఇవ్వడం లేదన్న విమర్శలు ఉండనే ఉన్నాయి. ఇక, ప్రతిపక్షాలు లేవనెత్తుతున్న అంశాలకు ఆయన ఇప్పటికీ.. అనేకం(ఉదాహరణకు గౌతం అదానీ-హిండెన్ బర్గ్ అంశం, మణిపూర్ అల్లర్లు, బీబీసీ గుజరాత్ డాక్యుమెంటరీ, ద్రవ్యోల్బణం, నిరుద్యోగం, పేదరికం, కరోనా మృతులు .. ఇలా చాలా అంశాలు) ఉన్నాయి. దీంతో భవనం మార్చిన ప్రధాన మంత్రి తన భావనను కూడా మార్చుకోవాలనేది సీనియర్లు, పరిశీలకుల మాట. నిజమైన ప్రజాస్వామ్యం అంటే.. ప్రతిపక్షాలకు కూడా(వీరిని కూడా ప్రజలే ఎన్నుకున్నారు) పార్లమెంటులో సమ భాగస్వామ్యం ఇవ్వాలనేది వారి ఉద్దేశం. కానీ, ఇప్పుడు ఇదే అసలు సమస్యగా మారిపోయింది. పార్లమెంటులో ప్రతిపక్షాలకు సరైన సమయం ఇవ్వడం లేదని, తమపై విమర్శలు చేసిన వారిని అడ్డగోలుగా సస్పెండ్ చేస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. మరి భవనం మార్చిన ప్రధాని ఈ భావనను కూడా మార్చినప్పుడే.. నిజమైన ప్రజాస్వామ్యం పరిఢవిల్లుతుందని అంటున్నారు.

# కొలువుల కేంద్రాలు లైబ్రరీలు

ఆదిలాబాద్ : గ్రంథాలయాలు.. కొలువుల కేంద్రాలుగా మారాయి. ఉమ్మడి రాష్ట్రంలో శిథిలావస్థలో ఉన్న లైబ్రరీలు స్వరాష్ట్రంలో ఆధునిక తను సంతరిం చుకున్నాయి. డిజిటల్ హంగులతో దర్శనమిస్తున్నాయి. సీఎం కేసీఆర్ ప్రత్యేక చొరవ తీసుకొని కొట్లాది రూపాయలతో సకల సౌకర్యాలు కల్పించ డంతోపాటు లక్షలాది బుక్స్‌ను అందుబాటులో పెట్టారు. గ్రంథాలయాల్లో ప్రిపరేషన్ అయిన వందలాది మంది ఉద్యోగాలు సాధించారు. తాజాగా.. ఎన్నడూ లేని విధంగా సీఎం కేసీఆర్ ఉద్యోగాలు ప్రకటించారు. దీంతో ఉద్యోగార్థులు పుస్తకశాలలకు క్యూ కడు తున్నారు. కొలువు కొట్టాలనే లక్ష్యంతో గంటల తరబడి పుస్తకా లతో కుస్తీ పడుతున్నారు. ప్రత్యేక రీడింగ్ రూమ్స్ ఉండడంతో మహిళలూ అధికంగా వస్తున్నారు. ఇంకా.. 'ఆన్ డిమాండ్ బుక్ సిస్టం' ద్వారా ఉద్యోగ అభ్యర్థులు కోరుకున్న బుక్స్‌ను సిబ్బంది అందుబాటులో పెడుతున్నారు. ఆల్ ది బెస్ట్ అభ్యర్థులు..

ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో గ్రంథాలయాల రూపురేఖలు మారిపోయాయి. రాష్ట్రం ఏర్పడిన తర్వాత సీఎం కేసీఆర్ లైబ్రరీల ప్రక్షాళనపై దృష్టిసారించారు. ప్రధానంగా శిథిలావస్థలో ఉన్న భవనాల స్థానంలో కొత్తవి నిర్మించడం, ఆధునిక సౌకర్యాలతో మౌలిక వసతులు కల్పించడం, అవసరమైన ఫర్నిచర్ కొనుగోలు చేశారు. ఫలితంగా పాఠకుల సంఖ్య పెరగడంతో విస్తృతంగా పేపర్లు, బుక్స్ కొన్నారు. ఉద్యోగార్థుల కోసం స్పెషల్‌గా పేపర్, బుక్, కంప్యూటర్ సెక్షన్, రీడింగ్ హాల్ వంటి గదులు నిర్మించారు. ఏసీలు, వైఫై వంటి సౌకర్యాలు కల్పించారు. మహిళలకు ప్రత్యేక రీడిం గ్ రూమ్స్ కూడా ఏర్పాటు చేశారు. డిజిటల్ పాఠా లు చదువుకునే అవకాశం కూడా కల్పించారు. ఉమ్మడి రాష్ట్రంలో పాత పుస్తకాలను మాత్రమే చదువుకునే అవకాశం ఉండగా.. ఇప్పుడు లైబ్రరీలకు వచ్చే వారు కోరుకున్న పుస్తకాలను ప్రభుత్వం సమకూరుస్తున్నది. ఇందుకోసం 'ఆన్ డిమాండ్ బుక్ సిస్టం' ప్రవేశపెట్టారు. ఈ పద్ధతి ద్వారా రిజిష్టర్‌లో పాఠకులు, నిరుద్యోగులు తమకు అవసరమైన పుస్తకం పేరు రాస్తే అధికారులు వాటిని మార్కెట్‌లో కొనుగోలు చేసి లైబ్రరీలో అందుబాటులో పెడుతున్నారు. సీఎం కేసీఆర్ ఉద్యోగాల ప్రకటన చేయడంతో రోజూ గ్రంథాలయాలకు వచ్చే వారి సంఖ్య పెరుగుతున్నది. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంచడంతో ఉద్యోగార్థుల సంఖ్య గణనీయంగా పెరుగుతున్నది. అభ్యర్థులు కూడా ఉద్యోగం సాధించాలనే తపనతో కష్టపడి చదువుతున్నారు.

### విద్యార్థుల కోరిన పుస్తకాలు తెప్పిస్తున్నాం..

సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే జోగు రామన్న సహాయ, సహకారాలతో ఆదిలాబాద్ జిల్లా గ్రంథాలయాన్ని రూ.3.70 కోట్లతో అభివృద్ధి చేస్తున్నాం. మహిళల కోసం అన్ని సౌకర్యాలతో ప్రత్యేక గదిని నిర్మించాం. లైబ్రరీలో 52 వేల పుస్తకాలు అందుబాటులో ఉండగా వివిధ పోటీ పరీక్షలు రాసే విద్యార్థుల కోసం అవసరమైన బుక్స్ ఉన్నాయి. విద్యార్థులు తమకు అవసరమైన పుస్తకాలను అడిగితే వెంటనే తీసుకువచ్చి అందిస్తున్నాం. ముఖ్యమంత్రి కేసీఆర్ ఉద్యోగాలు ప్రకటించిన నేపథ్యంలో లైబ్రరీకి చదువుకునేందుకు వచ్చే విద్యార్థులకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. ఏమైన సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తాం. నిరుద్యోగులు గ్రంథాలయానికి వచ్చి కష్టపడి చదువుని ఉద్యోగాలు సంపాదించుకోవాలని కోరుతున్నాం.

%--% రౌతు మనోహర్, ఆదిలాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్

### 18 లైబ్రరీలు.. 1,47,543 పుస్తకాలు

ఆదిలాబాద్ జిల్లాలో 18 గ్రంథాలయాలు ఉండగా.. వీటిలో విద్యార్థులకు అవసరమైన 1,47, 543 పుస్తకాలు ఉన్నాయి. ప్రభుత్వం లైబ్రరీలకు వచ్చే వారికి ప్రత్యేక సౌకర్యాలు కల్పిస్తున్నది. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని గ్రంథాలయంలో 52 వేల పుస్తకాలు ఉండగా.. రీడర్స్ ఆన్ డిమాండ్ విధానంలో విద్యార్థులకు అవసరమైన పుస్తకాలను సిబ్బంది కొనుగోలు చేస్తున్నారు. ఇక్క డ మహిళల కోసం ప్రత్యేకమైన భవనాన్ని నిర్మించారు. సీఎం కేసీఆర్ ప్రకటన చేసిన అనంతరం చాలా మంది లైబ్రరీకి వస్తున్నట్లు సిబ్బంది తెలిపారు.

### 16 లైబ్రరీలు.. 1,32,483 పుస్తకాలు

నిర్మల్ జిల్లాలో 16 గ్రంథాలయాల ఉండగా.. 1,32,483 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని లైబ్రరీలో అన్ని రకాల సౌకర్యాలు కల్పించడంతోపాటు ఆహ్లాదకరంగా తీర్చిదిద్దారు. విద్యార్థులు ఇక్కడికి వచ్చి పోటీ పరీక్షల పుస్తకాలు చదువుకుంటున్నారని సిబ్బంది తెలిపారు. ఇక్కడ చదువుకున్న వారు పోలీసు, జూనియర్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శి ఉద్యోగాలు సంపాదించినట్లు వారు పేర్కొన్నారు. ప్రభు త్వం కల్పించిన సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని ఉద్యోగం సంపాదిస్తామని పలువురు పేర్కొంటున్నారు.

### పోటీ పరీక్షలకు శిక్షణ ఇప్పిస్తాం..

నిర్మల్ గ్రంథాలయంలో విద్యార్థులకు అసరమైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. ఇక్కడ చదువుకున్న విద్యార్థులకు 22 మందికి పోలీస్, జూనియర్ అసిస్టెంట్, ఇతర ఉద్యోగాలు వచ్చాయి. లైబ్రరీలో రూ.20 లక్షలతో విశాలమైన హాల్‌ను నిర్మించాం. వివిధ పోటీ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులు ఇందులో శిక్షణ ఇచ్చేందుకు ప్రణాళికలు తయారు చేస్తున్నాం. భోజనం వసతి కల్పించడానికి చర్యలు తీసుకుంటాం. ప్రభుత్వం కొత్తగా రూ.1.50 కోట్లతో మంజూరు చేసిన ఈ-లైబ్రరీ పనులను త్వరలో ప్రారంభిస్తాం.

%--% ఎర్రవోతు రాజేందర్, నిర్మల్ గ్రంథాలయ సంస్థ చైర్మన్

### 14 లైబ్రరీలు.. 1,26,045 పుస్తకాలు

మంచిర్యాల జిల్లాలో 18 మండలాలు ఉండగా, 14 మండలాల్లో శాఖా గ్రంథాలయాలు ఉన్నా యి. వీటిలో మొత్తం 1,26,045 పుస్తకాలు ఉన్నాయి. ఇందులో పోటీ పరీక్షలకు సంబంధించి 9,702 పుస్తకాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుండడం, గ్రంథాలయాలకు పాఠకుల సంఖ్య పెరగనుండడంతో సరిపడా పుస్తకాలు అందుబాటులో ఉంచేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. జిల్లాలోని ప్రతి శాఖా గ్రంథాలయంలో ఆన్ డిమాండ్ పుస్తకాల రిజిస్టర్ నిర్వహిస్తున్నారు. గ్రంథాలయ పాఠకులు కోరిన పుస్తకం రిజిస్టర్‌లో రాసిన 4, 5 రోజుల్లో అందుబాటులో ఉంచుతున్నట్లు జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ప్రవీణ్ తెలిపారు. సివిల్స్ కం గ్రూప్స్‌కు ఉపయోగపడే ఎన్‌సీఈఆర్టీ, సీబీఎస్‌తో పాటు పోటీ పరీక్షలకు సంబంధించిన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

### 9 లైబ్రరీలు.. 73 వేల పుస్తకాలు

జిల్లాలోని పలు ప్రభుత్వ శాఖల్లో 825 పోస్టులను భర్తీ చేయనున్న నేపథ్యంలో నిరుద్యోగులు పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. ఆసిఫాబాద్ జిల్లా వ్యాప్తంగా 9 లైబ్రరీలు ఉండగా, వీటిలో 73, 360 పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి. దినపత్రికల తోపాటు ఉద్యోగాలు పొందేందుకు కావాల్సిన మెటీరియల్స్ అందుబాటులో ఉంచారు. ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమ్రం భీం స్టడీ సర్కిల్‌లో పేర్లు నమోదు చేసుకొని పోటీ పరీక్షలకు సిద్ధమవుతున్నారు. జిల్లాలోని 9 లైబ్రరీలకు ప్రతిరోజూ 1000 నుంచి 1200 మంది వరకు వస్తూ ప్రిపేర్ అవుతున్నారు. లైబ్రరీలలో తాగునీటితో పాటు అన్ని వసతులు ఉండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు అభ్యర్థులు అక్కడే ఉండి ప్రిపేర్ అవుతున్నారు.

### అభ్యర్థులకు శిక్షణ ఇప్పిస్తాం

వివిధ శాఖల్లో పెద్ద ఎత్తున ఉద్యోగాలు భర్తీ చేయనుండడంతో లైబ్రరీలకు చాలా మంది వస్తున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రకటించిన 80,039 ప్రభుత్వ ఉద్యోగ నోటిఫికేషన్లకు అనుగుణంగా అన్ని గ్రంథాలయాల్లో పోటీ పరీక్షలకు సిద్ధమయ్యే అభ్యర్థులకు ఆన్ డిమాండ్ పుస్తకాలు అందుబాటులో ఉంచుతాం. మౌలిక వసతుల ఏర్పాటుకు సిద్ధం చేస్తున్నాం. ప్రభుత్వ నోటిఫికేషన్లకు అనుగుణంగా ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని చేపట్టాలని నిర్ణయించాం. జిల్లా వ్యాప్తంగా అన్ని శాఖ గ్రంథాలయాల్లోనూ సౌకర్యాలు కల్పించి, కొలువుల కోసం ప్రిపేరయ్యే వారికి ఇబ్బందులు కలగకుండా చూస్తాం. నిపుణులతో శిక్షణ ఇప్పించి జిల్లా నుంచి పెద్ద ఎత్తున ఉద్యోగాలు సాధించేలా ప్రణాళిక చేస్తున్నాం. -రేణికుంట్ల ప్రవీణ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్, మంచిర్యాల

### అవసరమైన పుస్తకాలను తెప్పిస్తాం

ప్రభుత్వం ఉద్యోగాలు భర్తీ చేయనున్న నేపథ్యంలో లైబ్రరీలకు అభ్యర్థులు ఎక్కువగా వస్తున్నారు. జిల్లాలో ప్రస్తుతం 9 లైబ్రరీలు ఉన్నాయి. 73 వేలకు పైగా పుస్త కాలు, అన్ని రకాల దినపత్రికలు అందుబా టులో ఉన్నాయి. ఇంకా అభ్యర్థులు ఏవైనా పుస్తకాలు కావాలని కోరితే తెప్పించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఉదయం 10 నుంచి సాయంత్రం 6 గంటల వరకు తెరిచి ఉంచుతున్నాం. జిల్లా కేంద్రంలో కొత్త లైబ్రరీ నిర్మాణానికి రూ. కోటీ 50 లక్షలు మంజూరయ్యాయి.

%--%కనక యాదవ్‌రావ్, ఆసిఫాబాద్ గ్రంథాలయ సంస్థ చైర్మన్

# శిక్షణకు సై

పాల్వంచ : పోలీసు శాఖలో ఉద్యోగం చేయాలనుకుంటున్నారా.. మీ కోసం హైదరాబాద్ పోలీసులు ఉచితంగా నాణ్యమైన శిక్షణను ఇచ్చేందుకు సిద్దమవుతున్నారు. శిక్షణ పొందాలనుకునే వారి పేర్లు నమోదు చేసుకోవడానికి హైదరాబాద్ పోలీస్ వెబ్‌సైట్‌లో గూగుల్ ఫామ్ లింక్‌ను అందుబాటులో ఉంచనున్నారు. ప్రతి జోన్‌లో వెయ్యి మందికి, ప్రత్యేకంగా ఒక మహిళా సెంటర్‌ను ఏర్పాటు చేస్తున్నారు. ఇంగ్లిష్, తెలుగు మీడియంలో శిక్షణకు వచ్చే వారికి అనుకూలంగా ఉండే విధంగా ఉదయం, సాయంత్రం, పూర్తి రోజంతా తరగతులు నిర్వహించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ శిక్షణ కేంద్రాలపై ప్రత్యేక దృష్టి పెట్టారు. శిక్షణకు వచ్చే వారికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని సౌకర్యాలు ఉండేలా కేంద్రాలను ఏర్పాటు చేయాలని ఆయా జోనల్ డీసీపీలకు ఆదేశాలు జారీ చేశారు. ఇందులో భాగంగా 2019లో నిర్వహించిన శిక్షణ కేంద్రాలను పరిశీలించాలని, అక్కడ ప్రస్తుత పరిస్థితి ఎలా ఉందో ఆరా తీయాలని అధికారులకు సూచనలు చేశారు. మహిళలకు సురక్షితమైన వాతావారణం ఉండే విధంగా శిక్షణ కేంద్రాల ఎంపిక ఉండాలని సీపీ ఆదేశించారు.

### గూగుల్ లింక్‌తో సమాచారం

పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉండే సెక్టార్ ఎస్సై, బ్లూకోల్ట్స్ సిబ్బంది నిరుద్యోగ యువతకు అవగాహన కల్పిస్తారు. క్షేత్ర స్థాయిలో ఉండే ఆయా ఠాణాల సిబ్బంది కాలనీలు, బస్తీలలోని నిరుద్యోగ యువతకు ప్రభుత్వ ఉద్యోగాలకు ప్రయత్నించే వారికి పోలీస్ శాఖ ఇస్తున్న ఉచిత శిక్షణ



గూర్చి వివరిస్తారు. శిక్షణలో చేరేందుకు ముందుకొచ్చే వారు తమ వివరాలను హైదరాబాద్ పోలీస్ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉండే గూగుల్ లింక్‌ను క్లిక్ చేసి ఆ ఫారమ్‌లో తమ వివరాలను పొందుపరుచాలి. ఇదిలాఉండగా ఈ శిక్షణ కోసం కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబులిటీలో భాగంగా మ వంతు సహకారం అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు.

### ఇండోర్.. ఔట్‌డోర్ శిక్షణ

పోలీస్ శాఖలో సుమారు ఎస్సై, కానిస్టేబుళ్లకు సంబంధించిన 18,000 ఉద్యోగాలకు నోటిఫికేషన్ రానుంది. అనుభవజ్ఞులైన బోధన బృందంతో నాణ్యమైన శిక్షణ ఇచ్చే విధంగా ప్రణాళికలు సిద్దం చేస్తున్నారు. రాత పరీక్ష(ఇండోర్)తో పాటు పిజికల్ పరీక్షల(ఔట్ డోర్) లోను శిక్షణ ఇవ్వనున్నారు. ప్రతి కేంద్రంలో అన్ని సౌకర్యాలు ఉండేలా చర్యలు తీసుకుంటున్నారు. ఔట్ డోర్‌లో శిక్షణకు ఆయా జోన్లలో అనువైన గ్రౌండ్లను ఎంచుకొని, స్పోర్ట్స్‌లో అనుభవం ఉన్న కార్(సిటీ ఆర్మ్‌డ్ రిజర్వ్ ఫోర్స్) సిబ్బంది, పోలీస్ శాఖలోని ఇతర అధికారులతో శిక్షణ ఇస్తారు, ఆయా గ్రౌండ్ల వద్ద శిక్షణకు వచ్చే స్త్రీ, పురుషులకు వేరు వేరుగా మరుగుదొడ్లు ఉండే విధంగా చర్యలు తీసుకుంటారు.

### ఇండోర్ శిక్షణ కేంద్రాలలో ఇవి పక్కాగా ఉండాలి..

డిజిటల్ బోర్డు, ఇతర బోర్డులు

నాణ్యమైన అడియో సిస్టమ్

అందరికి కుర్చీలు

స్త్రీ, పురుషులకు వేరు వేరుగా మరుగుదొడ్ల సౌకర్యం

### అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ

నగర పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించే శిక్షణ కేంద్రాలలో అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీతో శిక్షణ ఇప్పిస్తాం. శిక్షణకు వచ్చే వారికి కేవలం శిక్షణ ఇవ్వడమే కాదు, ఎప్పటికప్పుడు వారి ప్రతిభను గుర్తించేందుకు మాక్ టెస్ట్‌లు నిర్వహిస్తాం. ఈ పరీక్షలతో ఎవరికి ఎక్కడ మార్కులు తగ్గుతున్నాయనే విషయం తెలుస్తుంది. పరీక్షలు నిర్వహించి వారికి ఆత్మవిశ్వాసం పెంపొందిస్తూ ఫైనల్ పరీక్షలకు సిద్ధం చేస్తాం. ఇక్కడ శిక్షణ తీసుకున్న వారు అందరు ఉద్యోగాలు సాధించాలనే లక్ష్యంతో శిక్షణ కేంద్రాలు కొనసాగుతాయి. హైదరాబాద్‌లోని నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలి. %--% నగర పోలీస్ కమిషనర్, సీవీ ఆనంద్

# కరీం'నగరం'.. అభివృద్ధి మయం

నగరానికి పక్కనే మానేరు డ్యాం గతంలో వేసవి వచ్చిందంటే తాగునీటి కోసం తిప్పలు పడాల్సి వచ్చేది. అయితే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన మిషన్ భగీరథలో భాగంగా నగరపాలక సంస్థ చేపట్టిన పనులతో ప్రస్తుతం నగరంలో ఏడాదిన్నరగా ప్రతి రోజూ మంచినీటి సరఫరా చేస్తున్నారు. అర్బన్ మిషన్ భగీరథలో భాగంగా రాష్ట్రంలోనే ఏ నగరంలో లేని విధంగా రూ.110 కోట్ల వ్యయంతో బ్యాలెన్సింగ్ రిజర్వాయర్లను నిర్మించి నగరంలో అన్ని ప్రాంతాల్లో సమయపాలనకు అనుగుణంగా నీటి సరఫరా అందిస్తున్నారు. ఇక బల్దియాలో విలీనమైన తొమ్మిది గ్రామాల్లోనూ ప్రతి రోజూ నీటి సరఫరా అందించేందుకు ఇప్పటికే రూ.6 కోట్లతో పైపులైన్ పనులు సాగిస్తున్నారు. ఈ వేసవిలోగా పనులు పూర్తి చేసి రోజు నీటి సరఫరా అందించే దిశగా ముందుకు సాగుతున్నారు. నిత్యం నీటి సరఫరాచేయడమే కాదు.. సక్సెస్ ఫుల్‌గా కొనసాగిస్తున్న ఏకైక కార్పొరేషన్‌గా పేరు సంపాదించుకుంది.

### సఫాయి మిత్రలో రెండో స్థానం..

నగరంలో పారిశుధ్య పనుల నిర్వహణ విషయంలో మేయర్ సునీల్‌రావు, పాలకవర్గం, అధికారులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. స్వచ్ఛ సర్వేక్షణ్‌లో మెరుగైన ఫలితాలను సాధిస్తూ దక్షిణ భారతదేశంలోనే ఒక మంచి గుర్తింపు సాధించింది. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన సఫాయిమిత్ర సురక్షా ఛాలెంజ్ పోటీల్లో దేశంలోనే రెండో స్థానంలో నిలిచి తన సత్తాను చాటింది. వీటితో పాటుగా రాష్ట్ర ప్రభుత్వం అందించిన పట్టణ ప్రగతి నిధుల నుంచి నగరంలో మోడ్రన్ పబ్లిక్ టాయిలెట్స్‌ను నిర్మించారు. నగరంలోని 18 ప్రాంతాల్లోనూ నూతన టాయిలెట్స్‌ను నిర్మించి, దశాబ్దాలుగా ఎదుర్కొంటున్న సమస్యకు విముక్తి కల్పించారు. ఎప్పటికప్పుడు ఈ టాయ్‌లెట్స్ పరిశుభ్రంగా ఉంచేలా పారిశుధ్య, ఇంజినీరింగ్ అధికారులకు పర్యవేక్షణ బాధ్యతలు అప్పగించారు.

### మౌలిక సదుపాయాల కల్పన

బల్దియా ఆధ్వర్యంలో ప్రజారోగ్యం కోసం నిధులు కేటాయించి పనులు సాగిస్తున్నారు. ఇప్పటికే 30 ప్రాంతాల్లో పట్టణ ప్రగతి నిధులతో ఓపెన్ జిమ్స్ ఏర్పాటు చేయగా, 18 ప్రాంతాల్లో వాకింగ్ ట్రాక్స్ అభివృద్ధి చేస్తున్నారు. మరోవైపు 30 పార్కులను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఇప్పటికే 15 పార్కులకు పైగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేగా, మిగిలిన వాటిని కూడా రెండు నెలల్లోనే పూర్తి చేసే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. ప్రతి వీధిలోనూ మంచినీటి పైపులైన్‌తోపాటు డ్రైనేజీలు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాట్లను వేగవంతం చేశారు. నగరంలోని అన్ని ప్రధాన చౌరస్తాలను సుందరీకరణలో భాగంగా ఇప్పటికే ఆరు చౌరస్తాలను అభివృద్ధి



చేయగా, మరికొన్ని పనులు సాగుతున్నాయి. అలాగే హరితహారంలో ప్రధాన రోడ్ల డివైడర్లల్లో నాటిన మొక్కలను సంరక్షించి రోడ్లను సుందరంగా తీర్చిదిద్దారు. అలాగే నగరంలోని మానేరు డ్యాం కట్ట వెంట నాటిన ప్రతి మొక్కనూ సంరక్షించే దిశగా పకడ్బందీ చర్యలు చేపట్టారు.

### శరవేగంగా స్మార్ట్ పనులు

నగరానికి స్మార్ట్‌సిటీ మంజూరైన ఆరంభంలో అభివృద్ధి పనులు ఆలస్యం కాగా గత రెండేళ్లలో శరవేగంగా ముందుకు సాగుతున్నాయి. స్మార్ట్‌సిటీ మొదటి విడుతలో రూ.350 కోట్లతో అభివృద్ధి పనులు ప్రారంభించగా, ఈ రెండేళ్లల్లోనూ సుమారు రూ.250 కోట్లకు సంబంధించి పనులు పూర్తి చేయించారు. మిగిలిన పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసే దిశగా ప్రక్రియ సాగుతోంది. అలాగే, స్మార్ట్‌లో భాగంగా మోడ్రన్ కాలనీగా తీర్చిదిద్దేందుకు హౌసింగ్‌బోర్డు కాలనీలో చేపట్టిన అభివృద్ధి పనుల్లో ఇప్పటికే 80 శాతానికిపైగా పూర్తయ్యాయి. వీటితో పాటు ప్రస్తుతం రాష్ట్ర మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ప్రారంభం కానున్న రూ.615 కోట్ల పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు.

### మంత్రి కేటీఆర్ సహకారంతో ముందుకు

స్థానిక మంత్రి గంగుల కమలాకర్‌తో పాటుగా మంత్రి కేటీఆర్ అందిస్తున్న సహకారంతో నగరాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తున్నాం. వచ్చే ఒకటి రెండేళ్లలో నగరం యావత్తు సుందర మయంగా మారుతుంది. దశాబ్దకాలంగా పెండింగ్‌లో ఉన్న అనేక సమస్యలను పరిష్కరించడమే కాకుండా అధికారుల పనితీరులోనూ విప్లవాత్మక మార్పులు తెస్తున్నాం. మంత్రి కేటీఆర్ ఆదేశాల మేరకు అన్ని వర్గాల ప్రజలకు ఎక్కడా ఇబ్బందులు లేకుండా అధికారులను అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకుంటాం. మేయర్‌గా విజయవంతంగా ముందుకు వెళ్లడానికి తెలంగాణ ప్రభుత్వంతో పాటు రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, పాలకవర్గం సహకారం అందిస్తున్నది. -వై సునీల్‌రావు, మేయర్

# మార్కెట్ కమిటీలకు.. మంచి రోజులు

భద్రాద్రి కొత్తగూడెం : మార్కెట్ యార్డులకు మంచి రోజులొచ్చాయి. గతంలో ఏడాది వరకు ఉండే కమిటీల పదవీ కాలాన్ని తొలుత ఆరు నెలలు, తర్వాత మరో ఆరు నెలలు పొడిగించేవారు. దీంతో ప్రతి రెండేళ్లకోసారి కొత్త కమిటీని ఎన్నుకునేవారు. ఈ సారి కమిటీల పదవీ కాలాన్ని మూడేళ్లకు పెంచడంతో కమిటీలకు పూర్వవైభవం రానుంది. దీంతోపాటు 14 మంది ఉన్న సభ్యుల సంఖ్యను 18కి పెంచారు. రాజకీయంగా పదవులు ఇవ్వడంతోపాటు ఎక్కువమంది రైతులను కమిటీలోకి తీసుకొని వారికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చే అవకాశం ఉంది. ఉమ్మడి జిల్లాలో ఖమ్మంలోనే పెద్ద వ్యవసాయ మార్కెట్ ఉంది. తా జాగా కొత్తగూడెంలోనూ అదే తరహాలో మార్కెట్‌ను నిర్వహించాలనుకున్న ప్రభుత్వం.. ఇక్కడ కూడా డైలీ మా ర్కెట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. ఇప్పటి వరకు సెస్‌ల రూపంలోనే ఆదాయం వచ్చే కమిటీల యార్డుల్లో మిర్చి, అపరాలు, పత్తి కొనుగోలు చేయాలని నిర్ణయించింది. కొత్తగా ఏర్పడిన భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వ్యవసాయ మార్కెట్ కమిటీలు ఆరు ఉన్నాయి. ఒక్కో మార్కెట్ కమిటీలో 14 మంది డైరెక్టర్లు ఉన్నారు. ఇం దులో ఎనిమిది మంది స్థానిక నాయకులు, ఇద్దరు ట్రేడర్లు, ఒక చైర్మన్, ఒక మార్కెట్ కమిటీ సెక్రటరీ, ఎఫ్‌ఏసీఎస్ చైర్మన్, డైరెక్టర్‌గా గ్రామం అయితే సర్పంచ్, మున్సిపాలిటీ అయితే మున్సిపల్ చైరన్, చైర్‌పర్సన్లను ప్రభుత్వం నియమిస్తుంది. ఎన్నికైన పాలకవర్గంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, మహిళలకు రిజర్వేషన్లు వర్తిస్తాయి. ప్రస్తుతం పాలకవర్గం రెండేళ్లపాటు కొనసాగుతుండగా.. ఈ గడువును మరో ఏడాది పొడిగించారు. అదే విధంగా ఒక్కో పాలకవర్గంలో ప్రస్తుతం 14 మంది సభ్యులుండగా.. మరో నలుగురిని నామినేట్ చేసుకునే అవకాశం కల్పించారు. దీనిపై అసెంబ్లీలో మంత్రి బిల్లు ప్రవేశపెట్టడం, దానిని ఆమోదించడం కూడా జరిగిపోయాయి. ఈ నిర్ణయంపై రైతులు సర్వత్రా హర్షం వ్యక్తం చేస్తున్నారు.

### ప్రభుత్వ నిర్ణయం సంతోషకరం..

రైతుల సంక్షేమం, వారి ప్రయోజనాల కోసమే ముఖ్యమంత్రి కేసీఆర్ కృషి చేస్తున్నారు. రైతులకు వెన్నుదన్నుగా ఉండే వ్యవసాయ మార్కెట్లను బలోపేతం చేసేందుకు మార్కెట్ పాలకవర్గాల పదవీకాల గడువును రెండేళ్ల నుంచి మూడేళ్ల వరకు పెంచడం సంతోషంగా ఉంది. దీనివల్ల పదవిలో ఉన్న వారు రైతులకు మరింత సేవ చేసే వీలు కలుగుతుంది. ప్రస్తుత పాలకవర్గంలో 14 మంది సభ్యులుండగా ఆ సంఖ్యను 18కి పెంచడం వల్ల మార్కెట్ కమిటీల్లో మరికొందరికీ పదవులు వస్తాయి.

%--%భూక్యా రాంబాబు, ఏఎంసీ చైర్మన్, కొత్తగూడెం

# వస్త్రం.. నాణ్యత మారితేనే ప్రయోజనం

సిరిసిల్ల : ప్రభుత్వ వస్త్రోత్పత్తుల ఆర్డర్లు ఈ నెల ముగుస్తాయి. మళ్లీ ఏకరూప దుస్తుల ఆర్డర్లు వరకు వేచిచూడాలి. ఈ లోపు జిల్లా పరిశ్రమలోని మరమగ్గాల ఆధునికీకరణకు అవకాశం ఉంది. చేనేత దినోత్సవంలో మరమగ్గాల ఆధునికీకరణ, కొత్త పరిశ్రమలపై ఆసక్తి ఉన్నవారి నుంచి దరఖాస్తులు స్వీకరించాలని ప్రభుత్వం ప్రకటించింది. కానీ దాని అమలుకు సంబంధించిన కార్యాచరణ ప్రణాళికను విడుదల చేయలేదు. రాష్ట్రంలో మరమగ్గాల వస్త్రోత్పత్తుల్లో సిరిసిల్లలోనే యాభై శాతంపైన ఉంటాయి. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న ఈ చర్యతో జిల్లాలోనే ఎక్కువ ప్రయోజనం కలగనుంది.

జిల్లాలో 30 వేలకు పైగా మరమగ్గాలున్నాయి. ఇవన్నీ పాతవే. వస్త్రోత్పత్తి రంగంలో వస్తున్న మార్పులను ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటున్న తమిళనాడు, గుజరాత్, మహారాష్ట్రలోని వస్త్రోత్పత్తి పరిశ్రమలోని మరమగ్గాలను ఆధునికీకరించుకుంటూ మారుతున్న కాలానికి అనుగుణంగా వస్త్రాలు తయారు చేస్తూ పోటీ రంగంలో ముందంజలో నిలుస్తున్నారు. ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు వారికి వెన్నుదన్నుగా నిలుస్తుండటం, యజమానులు, కార్మికుల్లో చొరవ కారణంగా మార్కెటింగ్‌లో వస్త్రోత్పత్తి రంగాన్ని ఆయా రాష్ట్రాలు శాసిస్తున్నాయి.



మన దగ్గర ఇవన్నీ లోపించాయి. పరిశ్రమ సంక్షోభంలో కూరుకుపోకుండా ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువైన సంక్షేమ పథకాల వస్త్రోత్పత్తుల ఆర్డర్లతో తాత్కాలిక ఉపశమనం కలిగిస్తుంది. శాశ్వత మార్పునకు ప్రయత్నాలు జరగాలి.

నవీకరణతో...

ప్రభుత్వ ప్రకటనతో జిల్లా పరిశ్రమలోని ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు పలువురు ముందుకొచ్చారు. వాటిలో సిరిసిల్ల పట్టణంలో నలుగురు రాపియర్ మగ్గాల ఏర్పాటుకు, ఒకరు ఎయిర్‌జెట్ మగ్గాలు, ప్రింటింగ్, డైయింగ్, ప్రాసెసింగ్‌తోపాటు గార్మెంట్ యూనిట్లకు జిల్లా చేనేత, జౌళిశాఖకు తమ డీపీఆర్‌ను సమర్పించారు. దీనికి ప్రభుత్వం అందించే ప్రోత్సాహం ఎంత? బ్యాంకులు, సొంత పూచీకత్తు తదితర అంశాలేవీ లేవు. మరమగ్గాల ఆధునికీకరణ, కొత్త యూనిట్ల స్థానకు చేనేత, జౌళిశాఖ నుంచి ప్రణాళికలు రాలేదు.

మన దగ్గర ఒక్కొక్కరికి కనీసం ఎనిమిది మర మగ్గాలుంటాయి. ఇళ్లలో, చిన్న షెడ్లలో ఎనిమిది నుంచి నలభై, వంద, రెండు వందల మగ్గాలు నడిపే వారూ ఉన్నారు. ఇవన్నీ పురాతనమైనవి. తంగళ్లపల్లి మండలం మండెపల్లి టెక్స్‌టైల్ పార్కులోనివి రాపియర్ మగ్గాలు. ప్రస్తుతం వీటన్నింటిపైనా పాలిస్టర్ వస్త్రాలు మాత్రమే ఉత్పత్తి జరుగుతోంది. అండర్‌పిక్‌లో డాబీ, జకార్డు ఉన్న మగ్గాలు, ఎయిర్, వాటర్ జెట్ మగ్గాలు కావాలి. ఇలాంటి మరమగ్గాలు విస్తరిస్తే ఇతర రాష్ట్రాల్లో ఉత్పత్తి అవుతున్న దుస్తులకు దీటుగా నాణ్యత వచ్చే అవకాశం ఉంది. ప్రైవేటు ఆర్డర్లు పెరుగుతాయి. ఫలితంగా స్థానికంగా వస్త్రోత్పత్తుల మార్కెటింగ్ విస్తరిస్తుంది. దీంతో యజమానులు పెట్టుబడికి తగిన ప్రతిఫలం, కార్మికులకు చేతినిండా పని దొరికే అవకాశం ఉంటుంది.

ఆసక్తి చూపుతున్నారు

ప్రభుత్వ ప్రకటనతో కొందరు ముందుకొచ్చి తమ డీపీఆర్‌ను సమర్పించారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాం. ప్రభుత్వం మరమగ్గాల ఆధునికీకరణ, కొత్త పరిశ్రమల స్థాపనకు ప్రణాళికలు రూపొందించాల్సి ఉంది. అప్పుడు ఔత్సాహికుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. త్వరలోనే ప్రకటన వచ్చే అవకాశం ఉంది.సాగర్, సహాయ సంచాలకుడు, చేనేత, జౌళిశాఖ సిరిసిల్ల

# మహిళా సాధికారత దిశగా అడుగులు

మిర్యాలగూడ : చట్ట సభల్లో మహిళలకు ప్రాతినిధ్యం పెంచేలా ఎన్నో ఏళ్లుగా ఊరిస్తున్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఎట్టకేలకు కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టింది. దీనిపై మహిళలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ చట్టానికి ఆమోదం లభిస్తే.. శాసనసభ, లోక్‌సభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు అమలు కానున్నాయి. దీంతో సామాజిక, రాజకీయ తదితర రంగాల్లో అనాదిగా వెనుకబడి ఉన్న అతివలు.. పురుషులతో సమానంగా అన్ని రంగాల్లో రాణించే అవకాశాలు ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్ల కారణంగా పలువురు ప్రజాప్రతినిధులుగా ఎన్నికైనప్పటికీ.. వారి స్థానాల్లో భర్తలు, ఇతర పురుష కుటుంబ సభ్యులు అధికారం చెలాయిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి అయితే..చట్టసభల్లో అతివలు అడుగుపెట్టడం వల్ల మహిళా సాధికారత పెరుగుతుందని పలువురు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్రంగా రూపొందిస్తేనే అమలు

మహిళా బిల్లును గతంలో పలు ప్రభుత్వాలు ప్రవేశ పెట్టినప్పటికీ..వాటికి పార్లమెంటులో ఆమోదం లభించలేదు. దీనికి ప్రధాన కారణం.. చట్టంలో ఉన్న లోపాలేనని పలువురు వ్యాఖ్యానిస్తున్నారు. బిల్లును సమగ్రంగా రూపొందిస్తేనే రిజర్వేషన్ల అమలుకు ఆటంకాలు కలగవని..ఇందుకు అఖిల పక్ష నాయకులు, మేధావుల సలహాలు, సూచనలు పరిగణనలోకి తీసుకోవాలని పలువురు రాజకీయ నాయకులు సూచిస్తున్నారు.

ఉమ్మడి జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో వారే అధికం

ఉమ్మడి జిల్లాలో మొత్తం 12 నియోజకవర్గాలకు ఆరింట స్త్రీ ఓటర్లే అధికంగా ఉన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వస్తే మహిళలు అధికంగా ఉన్న నియోజకవర్గాలను వారికే కేటాయించే అవకాశాలు ఉన్నాయి. ఇటీవల విడుదల చేసిన ఓటరు ముసాయిదా జాబితా ప్రకారం ఉమ్మడి జిల్లాలో మొత్తం ఓటర్లు 27,46,402 మంది ఉండగా.. మహిళలు 13,78,452 మంది, పురుషులు 13,67,795 మంది, ఇతరులు 155 మంది ఉన్నారు. హుజూర్‌నగర్‌లో అత్యధికంగా 1,20,720 మంది మహిళా ఓటర్లు ఉండగా..తర్వాత స్థానాల్లో నల్గొండలో 1,17,097, కోదాడలో 1,17,062, సూర్యాపేటలో 1,14,910, నాగార్జునసాగర్‌లో 1,12,839, మిర్యాలగూడలో 1,10,629 మంది ఉన్నారు. ప్రస్తుత సమావేశాల్లో బిల్లు ఆమోదం పొందినా నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే రిజర్వేషన్లు అమలు కానున్నట్లు సమాచారం. దీంతో రానున్న ఎన్నికల్లో కాకుండా.. తదుపరి వచ్చే ఎన్నికల్లో రిజర్వేషన్లు అమలు కానున్నట్లు విశ్లేషణలు చెబుతున్నాయి.

మహిళా బిల్లును స్వాగతిస్తున్నాంకేసా అభ్యుదయ, మహిళా కన్వీనర్, సత్యసాయి సేవాసంస్థ, మిర్యాలగూడ

చట్టసభల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పించే బిల్లును కేంద్రం పార్లమెంటులో ప్రవేశపెట్టడం శుభపరిణామం. మహిళా సాధికారతకు ఈ బిల్లు ఉపయోగపడుతుంది. ఈ బిల్లుకు ఆమోద ముద్ర పడితే చట్ట సభల్లో మహిళల సంఖ్య పెరిగి..వారి సమస్యల పరిష్కారానికి అడుగులు పడతాయి. దీంతో మహిళలపై జరుగుతున్న దాడులకు సైతం అడ్డుకట్ట పడే అవకాశం ఏర్పడుతుంది. ప్రస్తుతం సమాజంలో మహిళలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారు. వాటి పరిష్కారానికి మహిళలే కృషి చేసే అవకాశం ఏర్పడుతుంది.

# పల్లెలకు అంతర్జాలం.. ఇంకెంతకాలం!



చెన్నారావుపేట: పల్లెలకు అంతర్జాల సేవలు అందుబాటులోకి తెస్తామని ప్రభుత్వం ఐదేళ్ల కిందట చెప్పింది. ప్రజలకు పంచాయతీ ద్వారా సత్వర సేవలు అందిస్తామంది. ఇప్పటి వరకు అది సాకారం కాలేదు. ఇంటింటికి నల్లా ద్వారా తాగునీరు ఇవ్వడానికి చేపట్టిన మిషన్ భగీరథ పనులతో పాటే అప్పట్లో గ్రామాలకు కేబుల్ తీగలు వేశారు. ఆ తరవాత దాని గురించి పట్టించుకోవడం మానేశారు. దీంతో పల్లెలకు అంతర్జాల సేవలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్లు మారింది.

మూడేళ్ల కిందటే కేబుల్ లైన్..జిల్లాలోని 11 మండలాల్లో 323 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామానికి డిజిటల్ సేవలు అందించడం కోసం ప్రభుత్వం ఎల్ అండ్ టీ సంస్థ ద్వారా ఫైబర్ లైన్ కోసం తీగలు వేశారు. మూడేళ్ల కిందట మండల పరిషత్ కార్యాలయాల్లో డిజిటల్ బోర్డులు ఏర్పాటు చేసి, అక్కడి నుంచి గ్రామ పంచాయతీ కార్యాలయాలకు అనుసంధానం పనులు చేశారు. విద్యుత్తు సమస్య కారణంగా సేవలకు అంతరాయం లేకుండా పంచాయతీ కార్యాలయాలపై సౌర పలకలను బిగించారు. అంతటితోనే పనులు ఆపేయడంతో ఆ పరికరాలు పాడవుతున్నాయి.

ఎన్నో ప్రయోజనాలు

గ్రామాలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే ప్రజలకు ఎంతో సౌకర్యంగా ఉంటుంది. ప్రతి చిన్నపనికి మండల కేంద్రాలకు పరుగులు పెట్టాల్సిన అవసరం ఉండదు. పల్లెల్లోనే ఆన్‌లైన్ ద్వారా వివిధ రకాల ధ్రువపత్రాలకు దరఖాస్తు చేసుకొని, ఇక్కడి నుంచే పొందవచ్చు. సమయం కూడా ఎంతో ఆదా అవుతుంది. ముఖ్యంగా విద్యార్థులు ఉన్నత చదువులు, ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకోవడానికి వివిధ ధ్రువపత్రాల కోసం దరఖాస్తు చేసుకొని మండల కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరుగుతున్నారు. గ్రామాల నుంచి అంతదూరం పోవడానికి సమయంతో పాటు, ఆర్థికంగా కూడా భారంగా మారుతోంది. గ్రామాలకు డిజిటల్ సేవలు అందుబాటులోకి వస్తే ఈ ఇబ్బందులు తప్పుతాయి.

గ్రామాల్లో రోజువారీగా జరుగుతున్న పనులను ఉన్నతాధికారులు ఉన్నచోటు నుంచే పర్యవేక్షణ చేయవచ్చు. దీనికి వీలుగా పల్లెప్రగతి యాప్ కూడా రూపొందించారు. గ్రామంలో పారిశుద్ధ్య పనులను యాప్‌లో నమోదు చేయాలి. పంచాయతీలకు సంబంధించిన వివరాలను కార్యదర్శులు ఆన్‌లైన్‌లో నిత్యం నమోదు చేయటానికి అంతర్జాల సేవలు ఎంతో అవసరం. వీధిదీపాల నిర్వహణ, పంచాయతీ దస్త్రాలు, ఇతర పత్రాల జారీ తదితర సేవలు ప్రజలకు అందుబాటులోకి వస్తాయని ఆశించారు. లక్ష్యం నెరవేరకపోవడంతో మండల పరిషత్ కార్యాలయాలకే సేవలు పరిమితమయ్యాయి.

# క్రీడా ప్రాంగణాలకు కొత్త శోభ




ములుగు : క్రీడాకారులను ప్రోత్సహించాలని రాష్ట్ర ప్రభుత్వం సంకల్పించి పల్లె క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులను వెచ్చించి మైదానాలను తీర్చిదిద్దింది. లక్ష్యానికి అనుగుణంగా ఆసక్తిని పెంచేలా స్పోర్ట్స్ కిట్ల పంపిణీపై దృష్టి సారించింది. వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, వ్యాయామం చేసేందుకు అవసరమైన పరికరాలను మండలాలకు సరఫరా చేసి కొత్త శోభను తీసుకొచ్చింది.జిల్లా వ్యాప్తంగా తొమ్మిది మండలాల పరిధిలో రెవెన్యూ, అటవీ శాఖలకు చెందిన స్థలాలను సేకరించి క్రీడా ప్రాంగణాలను అధికారులు ఏర్పాటు చేశారు. ఉపాధి హామీ నిధుల కింద ఒక్కో ప్రాంగణానికి రూ.4 నుంచి రూ.5 లక్షలు వ్యయం చేసేలా ప్రభుత్వం ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈజీఎస్ అధికారులతో పాటు, పంచాయతీ కార్యదర్శులను సన్నద్ధం చేసి గతేడాది జూన్‌లోనే జిల్లాలో మొత్తం 351 ప్రాంగణాలను తయారు చేశారు. స్థలాల కొరత కారణంగా రెండు, మూడు ప్రాంగణాలను ఒకే చోట ఏర్పాటు చేశారు.

మండలాలకు చేరిన కిట్లు

ప్రతీ ప్రాంగణానికి స్పోర్ట్స్ కిట్లను అందించేందుకు ప్రభుత్వం ప్రణాళిక సిద్ధం చేసింది. రాష్ట్ర క్రీడా ప్రాధికారిక సంస్థ(సాట్స్) ఆధ్వర్యంలో 'కేసీఆర్ స్పోర్ట్స్ కిట్'లను సరఫరా చేసింది. గ్రామీణ క్రీడాకారులకు ఉపయుక్తంగా ఉండేలా పలు రకాల క్రీడా పరికరాలు, టీ–షర్టులను కిట్ రూపంలో జిల్లాకు 383 కిట్లను అందించారు. మండలాల్లో ఏర్పాటైన ప్రాంగణాల గణాంకాల ఆధారంగా ఎంపీడీవో కార్యాలయాలకు కిట్లను చేర్చారు. అదనంగా జిల్లా కేంద్రంలో 30 కిట్లను నిల్వ చేశారు. ప్రత్యేక కార్యక్రమం ద్వారా రాష్ట్ర వ్యాప్తంగా ఒకే విడతలో వీటిని అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిసింది.

అందించే పరికరాలు..

ఒక్కో క్రీడా ప్రాంగణానికి ఈ పరికరాలతో కూడిన కిట్లను అందించనున్నారు. క్రికెట్ కిట్‌లో బ్యాట్లు, బ్యాటింగ్ గ్లౌజ్‌లు రెండు జతలు, కీపింగ్ గ్లౌజ్ ఒక జత, లెగ్ ప్యాడ్ రెండు జతలు, వికెట్ కీపింగ్ లెగ్ గార్డ్, ప్యాడ్ ఒక జత, స్టంప్స్ సెట్ 2, అబ్‌డామినల్ గార్డులు రెండు జతలు, ప్రాక్టీస్ బాల్స్ 6, ఆర్మ్ గార్డ్2, ప్యాడ్లు 4, కిట్ బ్యాగ్ ఒకటి, జిమ్ పరికరాలు డంబెల్స్ 2.5, 5.0, 7.5 కేజీల బరువుతో మూడు సెట్లు, వాలీబాల్ పరికరాలు సింథటిక్ వాలీబాల్ ఒకటి, నెట్ ఒకటి, సైకిల్‌పంపు, బిగ్‌సైజ్(ఫుట్ పంపు) ఒకటి గాలికొట్టేందుకు, టీ–షర్టులు సుమారు 70 నుంచి 75 వరకు సైజుల వారీగా, మెజరింగ్ టేప్ ఒకటి, డిస్కస్ త్రో 1, 2 కేజీల బరువుతో రెండు, టెన్నికాయిట్ రింగ్ 6, స్కిప్పింగ్ రోప్‌లు 4, ఆట వస్తువులు భద్రపరచుకునేందుకు ఓ బ్యాగ్ ఇవ్వనున్నారు.

క్రీడాకారులకు ఉపయోగం– ఆకుతోట సంపత్, అబ్బాపురం, ములుగు

మా గ్రామంలో ప్రభుత్వం క్రీడా ప్రాంగణాన్ని ఏర్పాటు చేసింది. ఎలాంటి పరికరాలు ఇవ్వకపోవడంతో.. తామే స్వచ్ఛందంగా సామగ్రిని కొనుగోలు చేసుకున్నాం. ప్రస్తుతం అన్ని రకాల క్రీడలకు పరికరాలు అందించడంతో ఆటలకు ఉపయోగకరంగా ఉంటుంది.

నిర్వహణతోనే ప్రయోజనం– హన్మంత్, వాలీబాల్ క్రీడాకారుడు, వెంకటాపురం

పరికరాలపై అజమాయిషీ ఉంటేనే ప్రయోజనం. పలు ప్రాంగణాల్లో చెట్లు మొలిచి అధ్వానంగా ఉన్నాయి. వాటిపై ప్రభుత్వం దృష్టి సారించాలి. పరికరాలను ఉపయోగించేందుకు క్షేత్రస్థాయిలో ప్రత్యేకమైన కమిటీలను నియమించి ప్రభుత్వ పర్యవేక్షణ అవసరం.ఆదేశాలు రాగానే పంపిణీ..– వెంకయ్య, డీపీవో, ములుగుక్రీడా సామగ్రి కిట్లను రాష్ట్ర క్రీడాప్రాధికారిక సంస్థ సరఫరా చేసింది. ప్రత్యేక వాహనాల్లో మండలాలకు చేర్చాం. పంపిణీకి ప్రభుత్వం నుంచి ఆదేశాలు రావాల్సి ఉంది. ఇప్పటికే ప్రాంగణాలను క్రీడలకు అనుగుణంగా తీర్చిదిద్దాం.

# కొరత.. కలత

భూపాలపల్లి : భూగర్భ గనుల్లో పరికరాల కొరతతో సింగరేణి కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బొగ్గు ఉత్పత్తికి ముఖ్యమైనవి అవసరం మేరకు సరఫరా కాకపోవడంతో కార్మికులు ఉన్న వాటితోనే సర్దుకుంటూ విధులు నిర్వహిస్తున్నారు. రూ.కోట్లు వెచ్చించి సంస్థ కొనుగోలు చేసిన యంత్రాలకు సంబంధించిన విడి భాగాలు సైతం అందుబాటులో ఉండటం లేదు. చిన్నచిన్న పరికరాలు కూడా సరఫరా లేక బొగ్గు ఉత్పత్తికి విఘాతం ఏర్పడుతోంది.

నాణ్యత లేకపోవడంతో..గనుల నుంచి బొగ్గును వెలికితీసే క్రమంలో పేలుళ్ల కోసం డ్రిల్ రాడ్లు, డ్రిల్ బిట్లతో బొగ్గు పొరలకు రంధ్రాలు చేస్తారు. డ్రిల్ బిట్లు నాణ్యమైనవి లేకపోవడంతో పని స్థలాల్లో కోల్ కట్టర్, సపోర్టు మెన్ కార్మికులు ఇబ్బంది పడుతున్నారు. గతంలో సరఫరా చేసిన డ్రిల్ బిట్లతో కార్మికులు ఎక్కువ రోజులు పని చేసేవారు. ఇప్పుడు వస్తున్న వాటిలో నాణ్యత లేకపోవడంతో రోజూ వినియోగించే వాటికంటే ఎక్కువ వాడుతున్నారని కార్మిక సంఘాల నాయకులు ఆరోపిస్తున్నారు. వీటితో బండ పొరలను తొలిచే సమయంలో కార్మికులు చాలా కష్టపడుతున్నారు.

రక్షణలోనూ నిర్లక్ష్యం..

కార్మికుల రక్షణకు సంబంధించిన పరికరాలు, సామగ్రి సరఫరా చేయడంలోనూ సంస్థ నిర్లక్ష్యం వహిస్తోంది. కార్మికులకు అందజేస్తున్న బూట్లలో నాణ్యత ఉండటం లేదని కార్మికులు ఆరోపిస్తున్నారు. ఆరు మాసాలకు ఒక్కసారి వీటిని ఇస్తున్నా ఆ లోపే ఇవి చిరిగిపోయి, వాటి కింది భాగం అరిగిపోతోంది. సాక్సులు కార్మికులందరికీ అందడం లేదు. వర్షాకాలంలో వానకు తడవకుండా, చలికాలంలో చలి నుంచి రక్షణకు అందించాల్సిన దుస్తులు కొన్నేళ్లుగా సరఫరా చేయడం



లేదు. భూగర్భ గనుల్లో పనిచేసేవారికి శుద్ధి చేసిన తాగునీటి సరఫరా లేక కార్మికులు అందుబాటులో ఉన్న నీటినే తాగుతూ అనారోగ్య సమస్యలకు గురవుతున్నారు.

యంత్రాల విడిభాగాల సరఫరా లేక

సింగరేణి సంస్థలో బొగ్గు ఉత్పత్తి, ఉత్పాదకత పెంచేందుకు యాజమాన్యం భారీ యంత్రాలను కొనుగోలు చేస్తోంది. తక్కువ సమయంలో తక్కువ ఖర్చుతో ఎక్కువ బొగ్గు ఉత్పత్తి సాధించేందుకు ఉపయోగపడుతున్నాయి. ఉపరితల గనులు, భూగర్భ గనుల్లో వినియోగిస్తున్న యంత్రాలకు సంబంధించిన విడి భాగాల సరఫరా సక్రమంగా లేకపోవడంతో ఇవి చాలా కాలం వృథాగా నిలిచిపోతున్నాయి. గనుల్లో ఉపయోగించే ఎస్‌డీయల్ యంత్రాల విడిభాగాల కొరతతో పాత వాటినే మరమ్మతులు చేసి నడిపిస్తున్నారు.

# పల్లె.. పురస్కారాలతో విలసిల్లే..

భువనగిరి : వర్షపు నీటిని ఒడిసి పడుతూ.. భూగర్భ జలాలు పెంచుకునే పనులను ప్రభుత్వం చేపట్టింది. నివాస గృహాల్లో అవసరాలకు వినియోగించిన నీరంతా రోడ్లపై పారకుండా ఇంటింటికీ ఇంకుడుగుంతలు నిర్మించాలంటూ అధికారులు అవగాహన కల్పించారు. ఈ ఏడాది జూన్ నుంచి ప్రతి పంచాయతీలో సామూహిక ఇంకుడు గుంతలు నిర్మించేందుకు ముందుకొచ్చారు. ప్రతి గ్రామంలో కనీసం అయిదు చొప్పున నిర్మాణాలు చేపట్టేందుకు సన్నద్ధమయ్యారు. ముఖ్యంగా జిల్లా స్థాయిలో స్వచ్ఛ పురస్కారాలు అందుకునే దిశగా ఆయా పంచాయతీలను ఎంపిక చేస్తూ ఇంకుడు గుంతలు, శౌచాలయాల నిర్మాణాలపై అధికారులు పలు దఫాలుగా అవగాహన కల్పించారు. నిర్దేశించిన లక్ష్యం చేరుకునేందుకు జిల్లా, మండల స్థాయి అధికారులు 100 రోజులు కష్టపడుతూ గ్రామాల్లో నిర్మాణాలను పూర్తి చేయడంతో జిల్లా స్థాయిలో 15 పంచాయతీలు 'సచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్–2023' అవార్డులు అందుకోవడం గమనార్హం.

చేపట్టిన పనులు ఇలా..

ప్రభుత్వం పచ్చదనంతో పాటు జల సంరక్షణ, పారిశుద్ధ్య పనులకు ప్రాధాన్యం ఇస్తుంది. పురస్కారాలు అందుకునే దిశగా పనులు చేపట్టేందుకు అధికారులు ప్రత్యేక ప్రణాళిక అమలు చేశారు. ఎంపిక చేసిన గ్రామాల్లో వ్యక్తిగత శౌచాలయాల నిర్మాణాలు, వినియోగం, ఇంటింటికీ భగీరథ నీటి సరఫరా, గ్రామంలో మెరుగైన పారిశుద్ధ్యం, హరితహారంలో నాటిన మొక్కల సంరక్షణ, వంద శాతం పన్నుల వసూళ్లు తదితర అంశాలను పురస్కారాలు సాధించిన గ్రామాల్లో పరిగణలోకి తీసుకున్నట్లు సంబంధిత అధికారులు వివరించారు. ఇంటి అవసరాలకు వినియోగిస్తూ నీళ్లు భూమిలోకి ఇంకేందుకు వ్యక్తిగత ఇంకుడు గుంతలను నిర్మించుకుంటే రూ.6 వేలు ఉపాధిహామీ పథకం ద్వారా చెల్లిస్తున్నారు. అంతేగాకుండా గ్రామాల్లో సామూహిక ఇంకుడుగుంతల నిర్మాణాలు చేపడితే రూ.12 వేలను చెల్లించనున్నారు. నిర్మించిన ప్రతి ఇంకుడు గుంతల్లోకి వృథా నీటిని మళ్లిస్తే భూగర్భ జలాలు పెరగడమే కాకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంటాయని అధికారులు పేర్కొంటున్నారు. ఆ దిశగా ఆయా గ్రామాలను సమాయత్త పరిచేందుకు అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో ముందుకు సాగిన విషయం తెలిసిందే.

'రేణికుంట'కు మూడు పర్యాయాలు ఉత్తమ పురస్కారం..

సుమారు 530కి పైగా నివాస గృహాలు కలిగిన ఈ రేణికుంట ప్రభుత్వ పథకాల సద్వినియోగంతో పాటు దాతల సహకారంతో సదుపాయాల కల్పనలో ముందుకు సాగుతుంది. ముఖ్యంగా సర్పంచి బూర్గు భాగ్యమ్మ ప్రత్యేక శ్రద్ధతో పాటు దాతల సహకారంతో తడి, పొడి చెత్తడబ్బాల ఏర్పాటు, ట్రీగార్డ్స్, పూర్తిస్థాయిలో అంతర్గత మురుగు కాల్వల నిర్మాణం, అద్దాల మేడను తలపించేలా గ్రామ పంచాయతీ భవనం నిర్మాణం చేపట్టారు. 'రేణికుంట'కు మూడు పర్యాయాలుగా ఉత్తమ పురస్కారం రావడం విశేషం.దాతలు, ప్రభుత్వం సహకారంతో..బూర్గు భాగ్యమ్మ, సర్పంచి, రేణికుంట

నాలుగున్నరేళ్లుగా గ్రామంలో అనేక అభివృద్ధి పనులు జరిగాయి. ముఖ్యంగా ప్రభుత్వ సహకారం, దాతల ఔదార్యంతో గ్రామంలో వసతులు సమకూరుతున్నాయి. మూడు పర్యాయాలు ఉత్తమంగా ప్రభుత్వం గుర్తించడం చాలా సంతోషం కలుగుతుంది. దీంతో రానున్న రోజుల్లో మరింత బాధ్యతగా ముందుకు సాగుతాము.

# విస్తరిస్తున్న.. పాపాలు

భువనగిరి : స్వచ్ఛమైన పాలు దొరకడం కష్టమవుతోంది. నిత్యం అందరికీ అవసరమైన పాలకు ఉన్న డిమాండ్‌ను ఆసరా చేసుకుని కొందరు అక్రమాలకు పాల్పడుతున్నారు. పాలను కల్తీ చేయడం, రసాయనాలతో కృత్రిమంగా తయారుచేయడం, పరిశుభ్రత పాటించకుండా ప్యాకింగ్ చేయడం వంటి వాటి వల్ల ప్రజలు, చిన్నారుల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు. రాజధానికి సమీపంలో ఉన్న ఉమ్మడి జిల్లా మండలాలకు చెందిన కొందరు కల్తీపాలను తయారు చేసి విక్రయిస్తున్నారు. అప్పుడప్పుడు పోలీసుల దాడుల్లో పట్టబడుతున్నా.. అక్రమాలకు చెక్‌పడటంలేదు. ఈ నేపథ్యంలో ప్యాకెట్ పాలైనా నాణ్యతతో ఉంటాయన్న నమ్మకం ప్రశ్నార్థకంగా మారింది. ఎక్కడ కొనుగోలు చేసిన పాలు వాడాలో తెలియక వినియోగదారుల్లో అయోమయ పరిస్థితులు నెలకొన్నాయి. హైదరాబాద్– విజయవాడ జాతీయ రహదారి వెంట నకిరేకల్ శివారులో ఇటీవల ఓ పాలు, పాల పదార్థాల ఉత్పత్తి పరిశ్రమపై ఆహార భద్రత, రెవెన్యూ, పోలీసు అధికారులు తనిఖీలు నిర్వహించారు. అనుమతులు లేవని, ప్రమాణాలు పాటించడం లేదని దానిని సీజ్ చేసిన వ్యవహారం చర్చనీయంగా మారింది.

జాతీయ రహదారి వెంట భారీ స్థాయిలో పాలు, పాల పదార్థాల ఉత్పత్తి పరిశ్రమను అనుమతులు లేకుండా ఏర్పాటు చేసి దాదాపు ఆరు నెలలుగా బహిరంగ మార్కెట్‌లో విక్రయిస్తున్నారు. అధికారులు సకాలంలో గుర్తించి చర్యలు తీసుకోలేదన్న విమర్శలున్నాయి. పరిశుభ్రత పాటించకుండా పాలు, పెరుగు, ఇతర ఉత్పత్తులను ప్యాకింగ్ చేసి హైదరాబాద్‌తో పాటు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా విక్రయిస్తున్నట్లు అధికారుల విచారణలో బయటపడింది. నకిరేకల్ వద్ద పరిశ్రమ ఏర్పాటు చేసి ఇక్కడి ఉత్పత్తుల ప్యాకెట్లపై ఇతర ప్రాంతాలకు చెందిన కంపెనీ పేరు, వివరాలు ముద్రించి విక్రయాలకు పాల్పడుతున్న అంశాలను అధికారులు గుర్తించారు.

కొందరు చిరు వ్యాపారులు నిత్యం విక్రయించే పాలు, కొన్ని సంస్థలు మార్కెట్ చేసే పాలు, పెరుగు, ఇతర పాల పదార్థాల ప్యాకెట్ల నాణ్యతా ప్రశ్నార్థకం కావడంతో వినియోగదారులు, చిన్నారులు అనారోగ్యం బారిన పడుతున్నారు.ఉమ్మడి జిలాల్లో శివారు మండలాల్లో కల్తీ, కృత్రిమ పాల దందా గుట్టుగా సాగుతోంది. ధనార్జనే ధ్యేయంగా భావిస్తున్న అక్రమార్కులు ప్రజల ఆరోగ్యానికి ముప్పు తెస్తున్నారు. రాజధాని శివారులో ఉన్న పోచంపల్లి, బీబీనగర్, భువనగిరి, చౌటుప్పల్, ఆలేరు, వలిగొండ, తుర్కపల్లి, బొమ్మలరామారం తదితర మండలాల నుంచి నిత్యం వందల సంఖ్యలో వ్యాపారులు హైదరాబాద్, జిల్లాలో పాలవిక్రయాలు చేస్తున్నారు. వీరిలో కొందరు అక్రమాలకు పాల్పడుతూ రసాయనాలతో కృత్రిమ పాలను తయారుచేస్తున్నారు. గడిచిన జనవరి నుంచి ఇప్పటి వరకు 15 మంది వరకు కృత్రిమ పాల తయారీదారులపై పోలీసులు కేసులు నమోదు చేయడం గమనార్హం. కృత్రిమ పాల తయారీలో హైడ్రోజన్‌పెరాక్సైడ్, అమ్మోనియా సల్ఫేట్, యూరియా, ఫార్మాలిన్, మెలామిన్, నూనెలు, డిటర్జెంట్ల వంటి హానికరమైన రసాయనాలు వాడుతున్నట్లు పోలీసుల దర్యాప్తుల్లో వెలుగు చూస్తున్నాయి.

అవయవాలపై దుష్ప్రభావం

డా.రాపోలు రఘునందన్, ఐఎంఏ అధ్యక్షుడు, నకిరేకల్

పాలు చెడిపోకుండా ఎక్కువ రోజులు నిల్వ ఉండేందుకు వాడుతున్న రసాయనాల వల్ల శరీర అవయవాలపై దుష్ప్రభావాన్ని చూపుతాయి. దీర్ఘకాలంలో కేన్సర్లు వంటి వాటికి కారణమవుతాయి. కృత్రిమ పాల తయారీలో వాడే ఫార్మాలిన్ వంటి రసాయనం వల్ల కిడ్నీలు, కంటి చూపు దెబ్బతింటాయి. పరిశుభ్రత పాటించకుండా ప్యాక్‌చేసిన పాల వినియోగం వల్ల పిల్లలు, పెద్దలు డయేరియా బారిన పడతారు.

నమూనాలు సేకరిస్తున్నాం

జ్యోతిర్మయి, ఆహార భద్రత తనిఖీ జోనల్ కంట్రోలర్

పార్లర్లు, ఇతర దుకాణాలు, పాలు, పాల పదార్థాల ఉత్పత్తి పరిశ్రమల్లో తరచు తనిఖీలు నిర్వహిస్తున్నాం. నమూనాలు సేకరించి పరీక్షలకు పంపుతున్నాం. లోపాలు తేలితే నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నాం. పాలు, ఇతర పాల పదార్థాల ప్యాకెట్ల కొనుగోలు సమయంలో తయారీ, గడువు తదితర వివరాలను వినియోగదారులు పరిశీలించాలి. అనుమానం వస్తే ఫిర్యాదు చేయొచ్చు.

# ఏడు దశాబ్దాల్లో అయిదుగురే!

కరీంనగర్ : ఆకాశంలో సగం.. అంటూ మహిళలను పొగిడినా వారికి ఉమ్మడి కరీంనగర్ నుంచి చట్టసభ సభ్యులుగా అందిన అవకాశాలు తక్కువే.. స్థానిక సంస్థల్లో కల్పించిన రిజర్వేషన్లతో ఎంతో మంది అతివలు ప్రతినిధులుగా ఎన్నికయ్యారు.. పాలనలో తమదైన ముద్ర చాటారు.. శాసనసభ, లోక్‌సభల వరకు వచ్చేసరికి ప్రతిభ ఉన్నా అవకాశాలు అందక ఉసూరుమన్నారు.. ఇకపై ఆ వెలితి తీరనుంది.. స్థానిక పాలనలోనే కాదు.. చట్టాల రూపకల్పనలోనూ వారి ప్రాతినిధ్యం పెరిగేలా తీపి కబురు అందింది.. చట్టసభల్లో అతివలకు 33 శాతం రిజర్వేషన్ అమలుకు కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకోవడంతోపాటు బిల్లు దిశగా అడుగులు పడుతుండటంతో నారీ లోకం హర్షం వ్యక్తం చేస్తోంది..

ఉమ్మడి కరీంనగర్ జిల్లా నుంచి చట్టసభల్లో ప్రాతినిధ్యం వహించి 'అధ్యక్షా..' అని పిలిచిన నారీమణులు ఇద్దరు. 1952 నుంచి ఏడు దశాబ్దాల్లో శాసనసభకు వెళ్లింది కేవలం నలుగురు మాత్రమే. ఒకరు ఉప ఎన్నికల ద్వారా అవకాశాన్ని పొందితే.. ఇద్దరు ఎస్సీ రిజర్వేషన్ ద్వారా వచ్చిన అవకాశాన్ని సద్వినియోగపర్చుకున్నారు. ఒకరు మాత్రం తొలి ద్విసభ్య నియోజకవర్గానికి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గం నుంచి ఎంపీగా సుగుణకుమారి 1998లో గెలిచారు. 1999లో జరిగిన ఉప ఎన్నికల్లోనూ ఆమె సత్తా చాటి పార్లమెంటులో అడుగుపెట్టారు.

సగానికి పైగా ఓటర్లు..

ఉమ్మడి జిల్లాలోని 12 నియోజకవర్గాల్లో దాదాపు 28 లక్షలకు చేరువగా (27,99,862) ఓటర్లున్నారు. గత నెల 21వ తేదీన వెల్లడించిన ముసాయిదా జాబితా ప్రకారం ఇందులో 14 లక్షల పైచిలుకు మహిళా ఓటర్లుండటం గమనార్హం. వచ్చే నెల 4న వెలువడే తుది జాబితాలో అతివల సంఖ్య ఏ నియోజకవర్గంలో ఎంత ఉందనే స్పష్టత రానుంది. ఇప్పటివరకైతే అయిదారు నియోజకవర్గాల్లో వీరి ఓట్ల సంఖ్య పురుషులకన్నా అధికంగా ఉంది. 2014, 2018 సంవత్సరాల్లో జరిగిన ఎన్నికల్లో అక్కడక్కడా తామున్నామనేలా వీరు నామినేషన్లు వేసి పోటీకి ఉత్సాహం చూపించారు. కొందరు ఉపసంహరించుకోగా మరికొందరు బరిలో నిలిచినా విజయ తీరం అందుకోలేకపోయారు. చాలా నియోజకవర్గాల్లో మహిళలు చట్టసభలకు పోటీ చేసే సాహసం చేయడం లేదు. నియోజకవర్గాలు ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు కనీసం మహిళలు పోటీకి నిలబడని స్థానాలు కూడా ఉన్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు ఆమోదం పొందితే వారి ఓట్ల శాతం ఆధారంగా కొత్త నియోజకవర్గాల పునర్విభజనను బట్టి నాలుగు జిల్లాల పరిధిలో నాలుగు లేదా అయిదు స్థానాలు వీరికి కేటాయిస్తారు.

ఆరేళ్ల తరవాతే..

2026 తరువాత నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియ చేపట్టనున్నారు. 2029 ఎన్నికల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ అవకాశాన్ని అందుకోనున్నారు. ఒకసారి అమల్లోకి వచ్చిన రిజర్వేషన్ ఆ స్థానంలో 15 ఏళ్ల పాటు అమలులో ఉంటుంది. ఈ కోటాలోనే ఎస్సీ ఎస్టీ మహిళలకు మూడోవంతు సీట్లను కేటాయిస్తారు. నారీశక్తి వందన్ అధినియమ్ పేరిట లోక్ సభలో ప్రవేశపెట్టిన బిల్లు ఆమోదం పొందడమిక లాంఛనప్రాయమే అన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

# మధ్యాహ్న భోజనం.. బకాయిల భారం

కరీంనగర్ : తమకు రావాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించకపోవడంతో మధ్యాహ్న భోజన పథకం కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నెలల తరబడి నిధులు కేటాయించకపోవడంతో ఆర్థికంగా భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లాలో 511 ప్రాథమిక పాఠశాలలు, 85 ప్రాథమికోన్నత పాఠశాలలు, 214 ఉన్నత పాఠశాలలు ఉండగా దాదాపు 65 వేలు మంది విద్యార్థులు చదువుతున్నారు. ఆరునెలలుగా బిల్లులు రాకపోగా, ఇటీవల ప్రభుత్వం ఏప్రిల్, జూన్ నెలలకు సంబంధించిన కొంత మొత్తం నిధులు విడుదల చేసినప్పటికీ సీఆర్పీలతో పాటు కంప్యూటర్ ఆపరేటర్లు సమ్మెలో ఉండడంతో బిల్లులు చేయక చెల్లింపులు కావడం లేదని తెలుస్తోంది. ఇందులో ఎనిమిదో తరగతి వరకు రూ.45.84 లక్షలు, తొమ్మిది, పది తరగతులకు రూ.92.27 లక్షలు విడుదలయ్యాయి. అయితే వాటిని కూడా చెల్లించకపోవడంతో పాటు పలు డిమాండ్ల పరిష్కారానికి మధ్యాహ్న భోజన నిర్వాహకులు ఈ నెల 28 నుంచి నిరవధిక సమ్మెకు దిగుతున్నట్లు జిల్లా విద్యాశాఖ అధికారికి నోటీసులు అందించారు.

పెరిగిన ధరలు.. అందని బిల్లులు

ప్రస్తుతం పాఠశాల విద్యార్థులకు ఒకటి నుంచి అయిదో తరగతి వరకు రూ.5.45, ఆరు నుంచి ఎనిమిది వరకు రూ.8.17, తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు రోజుకు ఒక్కొక్కరికి రూ.10.67 ప్రభుత్వం చెల్లిస్తోంది. నిత్యావసర వస్తువుల ధరలు ఆకాశన్నంటుతుండగా, మధ్యాహ్న భోజనం అందించడం భారంగా మారింది. దీనికి తోడుగా ప్రభుత్వం రాగిజావ అందించాలని ఆదేశించడంతో అదనంగా పని చేయాల్సి వస్తోంది. దసరా నుంచి 'సీఎం అల్పాహార పథకం' ప్రారంభిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. దీనివల్ల పని ఒత్తిడి పెరగడమే కాకుండా బకాయిలు అందక అవస్థలు పడాల్సి వస్తోందని ఆవేదన చెందుతున్నారు. ఆరు నెలల నుంచి బిల్లులు చెల్లించకపోవడంతో అప్పు చేసి వంట వండాల్సి వస్తోందని చెబుతున్నారు. ఒకటో తరగతి నుంచి ఎనిమిది వరకు గుడ్డుకు అదనంగా రూ.5 చెల్లిస్తుండగా తొమ్మిది, పదో తరగతి విద్యార్థులకు అదనంగా రావడం లేదని, మార్కెట్‌లో పెరిగిన ధరలతో విద్యార్థులకు పూర్తి స్థాయిలో అందించడం ఇబ్బందిగా మారిందని వాపోతున్నారు.

ప్రకటించి ఏడాది..

జిల్లా వ్యాప్తంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులు దాదాపు 1800 మంది ఉండగా వారికి ప్రతి నెలా చెల్లించాల్సిన గౌరవ వేతనాలు సమయానికి రావట్లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రభుత్వం గతేడాది మార్చిలో రూ.వేయి నుంచి రూ.3వేలు పెంచుతున్నట్లు ప్రకటించింది. ఏడాది దాటినప్పటికీ ఇప్పటికీ అందకపోగా గతంలో అందించే వేతనం కూడా రాకపోవడంతో ఎదురు చూపులు తప్పడం లేదు.

బిల్లులు రావాల్సి ఉందివాసం భీమయ్య, మండల విద్యాధికారి

కొంత కాలంగా మధ్యాహ్న భోజన నిర్వాహకులకు సంబంధించిన బకాయిలు రావాల్సి ఉండగా, ఆయా బిల్లులు చేసి ప్రభుత్వానికి నివేదించాం. ఇటీవల కొంత మొత్తం వచ్చినప్పటకీ సిబ్బంది సమ్మె కారణంగా కొంత ఆలస్యమవుతోంది. నిధులు రాగానే నిర్వాహకుల ఖాతాల్లో జమ చేసేందుకు సిద్ధంగా ఉన్నాం.

అప్పుల పాలవుతున్నాంఆరు నెలల నుంచి మాకు బిల్లులు రావడం లేదు. కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటూ బిల్లులు చెల్లించడంలో ఆలస్యం చేస్తున్నారు. పిల్లలను పస్తులుంచలేక కష్టమైనా అప్పులు చేసి భోజనం వండుతున్నాం. గౌరవ వేతనాలు సైతం సమయానికి రావడం లేదు. చాలా ఇబ్బందులు పడుతున్నాం. నెలనెలా బిల్లులు చెల్లిస్తే ఆర్థిక భారం తగ్గుతుంది. ముత్యాల గౌరవ్వ, మధ్యాహ్న భోజన సంఘం జిల్లా నాయకురాలు

# నిధులు చాలక.. అవసరాలు తీరక..!



ఇల్లెందు : టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. ఆరు పడకలున్నాయి. 75వేల మంది జనాభాకు ఇదొక్కటే పీహెచ్‌సీ. చీపుళ్లు, పినాయిల్ కోసమే ప్రతినెలా రూ.2,500 చొప్పున ఏడాదికి రూ.30వేలు, స్టేషనరీలో భాగంగా రిజిస్టర్లు, ఓపీ, ఏ-1 షీట్స్ ఇలా సంవత్సరానికి రూ.25 నుంచి రూ.30వేలు, ప్రతి ఆరు నెలలకోసారి డెలివరీ ప్లేట్స్ మార్పిడికి రూ.20వేలపైనే ఖర్చవుతోంది. టేకులపల్లి మండలం సులానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రమిది. ఆరు పడకలున్నాయి. 75వేల మంది జనాభాకు ఇదొక్కటే పీహెచ్‌సీ. చీపుళ్లు, పినాయిల్ కోసమే ప్రతినెలా రూ.2,500 చొప్పున ఏడాదికి రూ.30వేలు, స్టేషనరీలో భాగంగా రిజిస్టర్లు, ఓపీ, ఏ-1 షీట్స్ ఇలా సంవత్సరానికి రూ.25 నుంచి రూ.30వేలు, ప్రతి ఆరు నెలలకోసారి డెలివరీ ప్లేట్స్ మార్పిడికి రూ.20వేలపైనే ఖర్చవుతోంది. అత్యవసర వైద్యం, ఆసుపత్రి పరిధిలో జరిగే సభలు, సమావేశాల ఖర్చులు అదనం. దవాఖానాలో పరికరాలు మొరాయిస్తే అత్యవసరంగా మరమ్మతులు చేయించాల్సి ఉంటుంది. మొత్తంగా పీహెచ్‌సీ కనీస నిర్వహణకు ప్రతినెలా సుమారు రూ.25-30వేల వరకు ఖర్చవుతోంది. కానీ అరకొర నిధులతోనే వైద్యాధికారులు నెట్టుకొస్తున్నారు.

అత్తెసరు నిధులతో ప్రభుత్వ ఆసుపత్రుల నిర్వహణ భారంగా మారుతోంది. కొన్నిచోట్ల స్థానిక వైద్యాధికారులు తమ జేబుల్లోంచి ఖర్చు పెట్టాల్సిన పరిస్థితి దాపురిస్తోందనే వాదనలు వ్యక్తమవుతున్నాయి. ఏటా సర్కారు విడుదల చేస్తున్న హెచ్‌డీఎస్ (హాస్పిటల్ డెవలప్‌మెంట్ సొసైటీ) నిధులతో విద్యుత్తు, మరుగుదొడ్ల మరమ్మతులు, పినాయిల్, అత్యవసర వైద్యం, ర్యాపిడ్ డయాగ్నోస్టిక్ టెస్ట్ (ఆర్‌డీటీ) కిట్లు, స్టాఫ్ నర్స్ వద్ద రూ.5వేల అత్యవసర పైకం, స్టేషనరీ ఇలా తదితర సౌకర్యాలను సమకూర్చుకోవాల్సి ఉంటుంది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన నిధులు భద్రాద్రి జిల్లాలోని పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీ, సీహెచ్‌సీ ఖాతాల్లో జమయ్యాయి. ఖమ్మం జిల్లాలో నిధుల విడుదలకు ప్రతిపాదనలను అధికారులు పంపించారు. అరకొరగా మంజూరవుతున్న నిధులను ఏడాది మొత్తం వాడుకోవాల్సి ఉండటంతో కొసరి కొసరిగా ఖర్చు చేస్తున్నారు.

ఉభయ జిల్లాల్లో..భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలకు రూ.1.31లక్షల చొప్పున రూ.37.99లక్షలు, అశ్వారావుపేట, ఇల్లెందు, బూర్గంపాడు, చర్లలోని ఒక్కో సీహెచ్‌సీకి రూ.2.50 లక్షల చొప్పున రూ.10లక్షలు, పాతకొత్తగూడెం, గుడిపాడు, శేఖరంబంజర, సఫాయిబస్తీ, రామవరంలోని యూపీహెచ్‌ఎసీలకు రూ.1.75లక్షల చొప్పున రూ.8.75లక్షలు హెచ్‌డీఎస్ నిధులు జమయ్యాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఖమ్మం జిల్లాలో ఒక్కో పీహెచ్‌సీకి రూ.1.69 లక్షల చొప్పున హెచ్‌డీఎస్ నిధులు మంజూరుచేయాలని కోరుతూ ప్రతిపాదనలు పంపించామని అధికారులు చెబుతున్నారు.సమావేశాల ఊసేదీ..?నిబంధనల ప్రకారం ప్రతినెలా మూడో ఆసుపత్రిలో జన ఆరోగ్య సమితి సమావేశం నిర్వహించాలి. సలహా సంఘానికి ఛైర్మన్‌గా ఎంపీపీ, సభ్యులుగా ఆసుపత్రి వైద్యాధికారి, స్థానిక సర్పంచి, ఇద్దరు ఎంపీటీసీ సభ్యులు, మరో ఇద్దరు మహిళా ప్రజాప్రతినిధులు ఉంటారు.ఆసుపత్రుల బలోపేతం కోసం ఏర్పాటైన సలహాసంఘం, జన ఆరోగ్య సమితి(జాస్) సమావేశాలు ఉభయ జిల్లాల్లో ఎక్కడా జరగటం లేదనే వాదనలు వినిపిస్తున్నాయి. ఆసుపత్రుల అభివృద్ధి, కనీస సౌకర్యాల కోసం సలహా సంఘం సమావేశమై తీర్మానాలు చేసుకుని నిధులు వెచ్చించాల్సి ఉంటుంది.

2022-23 హెచ్‌డీఎస్ నిధులను ఆసుపత్రుల ఖాతాల్లో జమచేశాం. భానుచందర్, డిస్ట్రిక్ అకౌంట్స్ మేనేజర్, భద్రాద్రి కొత్తగూడెం

# సర్కారు బడులపై సమ్మెట..!



కొత్తగూడెం : పాఠశాలల స్థాయి, ఎంఈఓ, డీఈఓ కార్యాలయాల్లో వివిధ కార్యక్రమాల అమలులో ప్రధాన భూమిక పోషిస్తున్న సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగుల సమ్మెతో విద్యాశాఖలో కష్టాలు మొదలయ్యాయి. తమ సర్వీసును క్రమబద్ధీకరించాలని, తక్షణమే మినిమం టైమ్ స్కేల్ వర్తింపజేయాలని, ఆరోగ్య భద్రత కల్పించాలని, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగా అన్ని వసతులు సమకూర్చాలనే డిమాండ్‌తో రెండు వారాలకు పైగా సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులు నిరవధిక సమ్మె కొనసాగిస్తున్నారు. ఓవైపు ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతుల ప్రక్రియ శరవేగంగా సాగుతోంది. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అభ్యంతరాల సంఖ్య భారీగా పెరిగింది. పాఠశాల స్థాయిలో మధ్యాహ్న భోజన హాజరు, నెలవారీగా విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా బియ్యం సరఫరా, బడిబయట పిల్లల గుర్తింపు, మధ్యాహ్న భోజన అమలుతీరు పరిశీలన, ఆధార్ నమోదు, ఇలా వివిధ బాధ్యతలు నిర్వర్తించాల్సింది సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులే. ఎస్‌ఎంసీలు, ప్రధానోపాధ్యాయుల సమావేశాల నివేదిక రుపొందించటం వీరి ప్రధాన విధి. మొత్తంగా విద్యా సంబంధ కార్యక్రమాల అమలులో ప్రేరకులుగా వ్యవహరించాల్సి ఉంటుంది.

ఉభయ జిల్లాల్లో రోజూ పాఠశాల స్థాయి నుంచి డీఈఓ కార్యాలయం వరకు నిర్వహించే కార్యకలాపాల్లో సమగ్ర శిక్షా ఉద్యోగులు కీలకం. జిల్లా స్థాయిలో అసిస్టెంట్ ప్రోగ్రాం ఆఫీసర్, సిస్టం అనలిస్ట్, డేటా ఎంట్రీ ఆపరేటర్, మండల విద్యాశాఖ కార్యాలయాల్లో ఎంఐఎస్ సమన్వయకర్తలు, కంప్యూటర్ సిబ్బంది, స్కూల్ కాంప్లెక్స్ పరిధిలో క్లస్టర్ రిసోర్స్ పర్సన్లుగా వేర్వేరు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తున్నారు. వీరు సమ్మెబాట పట్టడంతో కొన్నిచోట్ల ఎంఈఓ కార్యాలయాలకు తాళాలు పడుతున్నాయి. ఎంఈఓలు మాత్రమే విధులు నిర్వర్తిస్తున్నారు. పాఠశాల, ఉపాధ్యాయుల సమాచారం సమగ్రంగా సేకరించడం ఇబ్బందిగా మారింది. సెప్టెంబర్ నెలకు సంబంధించిన బియ్యం పాఠశాలలకు ఇంకా చేరలేదు. ప్రస్తుతం ఆగస్టు నెల బియ్యం వినియోగిస్తున్నారు. కొన్నిరోజుల్లో బియ్యం నిల్వలు ఖాళీ అయ్యే అవకాశాలున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం అమలుచేస్తున్న మన ఊరు- మన బడి, తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య, తదితర కార్యక్రమాలపై సమ్మె ప్రభావం పడుతోంది. ముఖ గుర్తింపు హాజరు అమలుకు నోచుకోవటం లేదు. ఒక్కో కాంప్లెక్స్ పరిధిలో పదుల సంఖ్యలో పాఠశాలలుంటాయి. ఇంత ప్రాముఖ్యం గల ఉద్యోగులు నిరవధిక సమ్మెకు దిగడంతో అరకొర సిబ్బందితో ఆయా కార్యాలయాలు నెట్టుకొస్తున్నాయి.

సమగ్ర శిక్షా ఒప్పంద ఉద్యోగులు సమ్మెకు దిగటంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ప్రత్యామ్నాయంగా పాఠశాలల్లో కంప్యూటర్ నైపుణ్యాలు కలిగిన ఉపాధ్యాయుల సహకారం తీసుకుంటున్నాం. కొన్ని రకాల కార్యకలాపాలకు ఆటంకాలు తప్పటం లేదు. అయినా అందుబాటులో ఉన్న వనరులతోనే వీలైనంత వరకు చక్కదిద్దుతున్నాం. సోమశేఖర శర్మ, డీఈఓ, ఖమ్మం

# అలంకారప్రాయంగా రైతు వేదికలు..!

బచ్చన్నపేట : రైతు వేదికలు అలంకార ప్రాయంగా మారాయి. రాష్ట్ర వ్యాప్తంగా రైతులకు, వ్యవసాయదారులకు సస్యరక్షణ చర్యల కోసం కావాల్సిన సలహాలు, సూచనలు అందించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం 2021లో రైతు వేదికలు ఏర్పాటు చేసింది. విత్తనాలను విత్తుకునే పద్ధతులు, ఎలా కాపాడుకోవాలో తెలియజెప్పే శాస్త్రీయ, సాంక్షేతిక విషయాలు, ప్రాముణ్యం, సంరక్షణ, తదితర విషయాలపై ఎప్పటికప్పుడు రైతులు సమావేశమయ్యేందుకు వేదికలను నిర్మించింది. కానీ వీటి నిర్వహణను పట్టించుకోవడంలో విఫలం అయింది.

ఆరంభ శూరత్వం

జిల్లాలో 62కు పైగా వేదికలను లక్షలు వెచ్చించి నిర్మించింది. 6 - 10 గుంటల స్థలాల్లో ప్రభుత్వ నిర్మించింది. ఒక్కో మండలంలో నాలుగైదు గ్రామాల రైతులకు అనుగుణంగా ఉండే ప్రాంతాలను గుర్తించి క్లస్టర్‌స్థాయిలో ఏర్పాటుచేశారు. మొదట్లో వ్యవసాయదారులు, రైతులతో నెలకు రెండు మూడు సార్లు సభలు, సమావేశాలను నిర్వహించి ఉత్సాహం చూపించారు. నెలకు రూ.10 వేల చొప్పున వేదికల నిర్వహణకు దాదాపు 10 నెలలు నిధులు విడుదలయ్యాయి. ఆ తర్వాత నిర్వహణ నిధుల విడుదలలో జాప్యం జరుగుతోంది. పక్షం రోజులకోసారి రైతు వేదికలో వ్యవసాయంలో ఆధునికీరణ, కందులు, పెసర, మొక్కజోన్న, వరి ఇతర అపరాల పంటలు, వాటిలో చీడపీడల నివారణకు చేపట్టాల్సిన చర్యలపై అవగాహన కల్పిస్తారు.



పిచికారీ చేయాల్సిన రసాయానాలు, గడ్డిజాతి నిర్మూలన మందులు, హైబ్రిడ్ జాతుల రకాలకు సోకిన రోగాలను తట్టుకునేలా చేపట్టాల్సిన చర్యల కోసం సమీక్షల్లో అధికారులు సూచనలు చేయాల్సి ఉంటుంది. వేదిక పర్యవేక్షణ బాధ్యతల కోసం ప్రభుత్వం సిబ్బందిని నియమించకపోవడంతో ప్రతి నెల గౌరవ వేతనంగా రూ. 4 - 6 వేల వరకు ఓ వ్యక్తికి ఇచ్చి నిర్వహణ చూసేలా ఏర్పాటు చేశారు. కానీ సంవత్సరం నుంచి ఒక రూపాయి కూడా రాలేదని ఓ వ్యవసాయశాఖ అధికారి తెలిపారు.

# పర్యావరణానికి రక్ష.. వ్యర్థాల నిర్మూలన

పెద్దపల్లి : పేరుకుపోతున్న వ్యర్థాలతో పర్యావరణానికి పెనుముప్పు వాటిల్లుతోంది. పెరుగుతున్న పట్టణీకరణతో పారిశుద్ధ్య నిర్వహణ స్థానిక సంస్థలకు సవాల్‌గా మారుతోంది. ఈ క్రమంలో చెత్త నుంచి సేంద్రియ ఎరువును తయారు చేసేలా రకరకాల ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా ఘన వ్యర్థాల నిర్వహణలో కీలకమైన బయోమైనింగ్ విధానం అమలుకు పురపాలక శాఖ శ్రీకారం చుట్టింది. కొండల్లా పేరుకుపోతున్న చెత్తను ప్రాసెస్ చేసి, వ్యర్థాల సమస్యలకు పరిష్కారం చూపే దిశగా కార్యాచరణ వేగవంతం చేసింది. కేంద్ర కాలుష్య నియంత్రణ మండలి నిర్దేశించిన ప్రమాణాలు, జాతీయ హరిత ట్రైబ్యునల్ మార్గదర్శకాల ప్రకారం ఘన వ్యర్థాల నిర్వహణకు బయోమైనింగ్ ప్రక్రియను అనుసరించనున్నారు. పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని 5 ఎకరాల స్థలంలో దాదాపు రూ.3.5 కోట్లతో యూనిట్ ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం ప్రాథమిక దశలో ఉండగా త్వరలోనే నిర్మాణ ప్రక్రియ ఊపందుకోనుంది. త్వరలో జిల్లాలో పర్యటించనున్న మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా ఈ యూనిట్‌ను ప్రారంభింపజేసేలా యంత్రాంగం సమాయత్తమవుతోంది.

ఆధునిక సాంకేతికత వినియోగం

జిల్లావ్యాప్తంగా పేరుకుపోయిన ఘన వ్యర్థాలను శుద్ధి చేయడం, ప్రతి రోజూ ఉత్పత్తి అయ్యే వ్యర్థాలను ప్రాసెస్ చేయడంతో పాటు నిర్దేశిత ప్రమాణాల మేరకు రీసైక్లింగ్ చేస్తారు. ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారయ్యే ఎరువును ఉక్కు తదితర పరిశ్రమల్లో బొగ్గుకు ప్రత్యామ్నాయంగా వినియోగిస్తారు. ఇండోర్, ముంబయి, విశాఖ నగరాల తరహాలో సాంకేతికత వినియోగంలోకి రానుంది. తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి 8 గ్రేడ్‌లుగా విభజించి సేంద్రియ ఎరువులు తయారు



చేస్తారు. చెత్తలో అంతర్భాగంగా ఉన్న మెగ్నీషియం, జింక్, కాల్షియం వంటి ధాతువులను వేరు చేసి సేంద్రియ ఎరువుగా మారుస్తారు.

ఆ పట్టణాల్లో స్థలం కొరత

స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా ప్రభుత్వం ప్రత్యేకంగా బయో మైనింగ్ ప్రాసెసింగ్ యూనిట్లను కేటాయిస్తోంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన చెత్తను, వ్యర్థాలను ప్రత్యేకంగా వేరు చేసేలా డంపింగ్ యార్డులో భారీ యంత్రాల ఏర్పాటుకు ప్రాసెసింగ్ యూనిట్లు ఏర్పాటు చేయనున్నారు. జిల్లావ్యాప్తంగా ప్రతిరోజు దాదాపు 30 టన్నుల వ్యర్థాలు వెలువడుతున్నాయి. నియోజకవర్గానికి ఒక యూనిట్ చొప్పున జిల్లాలో మూడు యూనిట్లు ఏర్పాటు చేస్తుండగా పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లో మాత్రమే 5 ఎకరాల స్థలం లభించింది. రామగుండం, సుల్తానాబాద్ ప్రాంతాల్లో స్థలం లభించడం లేదు. మంథని మండలం రచ్చపల్లి ప్రాంతంలో సింగరేణి ఆధ్వర్యంలో బయోమైనింగ్ యూనిట్ ఏర్పాటుకు సూత్రప్రాయంగా అంగీకారం కుదిరింది.

పెరగనున్న భూసారం.. జలచరాల వృద్ధి

జిల్లావ్యాప్తంగా రైతులు ఏటా 25 వేల మెట్రిక్ టన్నుల మేర యూరియా, ఇతర ఎరువులు ఉపయోగిస్తున్నారు.

మోతాదుకు మించి యూరియా, డీఏపీ ఎరువుల వాడకంతో క్రమంగా భూసారం తగ్గుతోంది. పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతన్నాయి.ఈ విధానంతో రసాయన రహిత సాగు విధానం పెరిగి భూసార వృద్ధితో పాటు దీర్ఘకాలిక వ్యాధుల ముప్పు తగ్గనుంది.

బయోమైనింగ్ ద్వారా ఉత్పత్తి చేసిన ఎరువులను పొలాల్లో చల్లడం వల్ల భూసారం పెరిగి పోషకాలు సమృద్ధిగా లభించే పంట చేతికందుతుంది.ప్లాస్టిక్ వ్యర్థాలతో తయారయ్యే ఎరువులను స్టీల్, ఇతరత్రా పరిశ్రమల్లో బొగ్గుకు బదులుగా ఇంధనంగా వాడవచ్చు.

చేపల చెరువుల్లోని అడుగు భాగంలో అమ్మోనియా గాఢతను స్థిరీకరించి జలచరాల మనుగడకు భరోసా కల్పించేందుకు భవిష్యత్తులో ఈ ఎరువును ఉపయోగించనున్నారు.

స్వచ్ఛత సాకారం

పెద్దపల్లి మండలం రాఘవాపూర్‌లోని 5 ఎకరాల స్థలంలో బయోమైనింగ్ ఏర్పాటు చేస్తున్నాం. రామగుండం, సుల్తానాబాద్ ప్రాంతాల్లో స్థలం కోసం అన్వేషిస్తున్నాం. ఇప్పటికే స్వచ్ఛ సర్వేక్షణ్‌లో జాతీయ స్థాయిలో సత్తా చాటుతున్న జిల్లాకు ఈ యూనిట్ ఏర్పాటు మరింత అనుకూలంగా మారింది.అరుణశ్రీ, అదనపు కలెక్టర్

# అరకొర వైద్యం.. దక్కని న్యాయం

గంగాధర : రాష్ట్రవ్యాప్తంగా 42 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను మంజూరు చేస్తూ వైద్య ఆరోగ్య శాఖ ఉత్తర్వులు జారీ చేసిన జాబితాలో గంగాధర మండలం గర్శకుర్తి గ్రామానికి ఈసారి కూడా మొండిచేయి కనిపించింది. మినీ సిరిసిల్లగా పేరొందిన కార్మిక క్షేత్రం గర్షకుర్తి గ్రామంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం (పీహెచ్‌సీ) ఏర్పాటు చేయాలని 20 ఏళ్లుగా ప్రతిపాదన దశలోనే ఉంది. ప్రభుత్వాలు మారినా ఆసుపత్రి మాత్రం ఏర్పాటు కాక పేదలకు వైద్యసేవలు అందడం లేదు. ఈ గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయాలని కూడా ప్రతిపాదన ఉంది. ఈ మేరకు ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. గతంలో కరీంనగర్ పార్లమెంట్ ఉప ఎన్నికల ప్రచార సమయంలో ఇక్కడ పర్యటించిన సీఎం కేసీఆర్ కూడా మండల కేంద్రంగా ఏర్పాటు చేస్తామని అప్పట్లో హామీ ఇచ్చినా నెరవేరలేదు. రెండు ఎకరాల స్థలమున్నా..మండలంలో 33 గ్రామ పంచాయతీలతో పాటు 10 అనుబంధ గ్రామాలకు గంగాధరలో ఉన్న పీహెచ్‌సీయే దిక్కు. గర్షకుర్తి జనాభా దాదాపు 9 వేలు ఉండగా చేనేత, బీడీ కార్మికులు నిత్యం చేసే పనులతో వ్యాధులకు గురవుతున్నారు. వీరికి స్థానికంగా ఉన్న ఆరోగ్య ఉప కేంద్రంలో వైద్యసేవలు అందక జిల్లా కేంద్రానికి పరుగులు తీస్తున్నారు. గర్శకుర్తికి సమీపంలోని ఒద్యారం, ఆచంపల్లి, చిన్నఆచంపల్లి, కాసారం, తాడిజెర్రి, రంగారావుపల్లి, ఉప్పరమల్యాల గ్రామాల్లో దాదాపు 20 వేల జనాభా ఉండగా అందుబాటులో పీహెచ్‌సీ ఉంటే వైద్యసేవలు అందే అవకాశం ఉండేది. పీహెచ్‌సీ కోసం స్థానికంగా రెండెకరాల ప్రభుత్వ స్థలాన్ని కూడా కేటాయించారు.

# వసతి గృహాలు.. సమస్యలకు నిలయాలు

జనగామ : కాకతీయ విశ్వవిద్యాలయం క్యాంపస్‌లోని వసతిగృహాల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. ఎవరూ పట్టించుకోకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఎలుకలు, పందికొక్కులు, కుక్కలు రాజ్యమేలుతున్నాయి. మూడు రోజుల క్రితం పద్మాక్షి మహిళా వసతిగృహంలో నిద్రిస్తున్న ఇద్దరు పీజీ విద్యార్థినులను ఎలుకలు కొరికాయి. ఈ విషయం బయటకు రావడంతో విద్యార్థినుల్లో ఆందోళన నెలకొంది. గణపతి, దేవ హాస్టళ్లల్లో పరిస్థితులు కూడా అధ్వానంగా ఉన్నాయి.

కొరవడిన చిత్తశుద్ధి

క్యాంపస్‌లో 14 హాస్టళ్లు ఉన్నాయి. వీటిల్లో 3034 మంది ఉంటున్నారు. మూడు ప్రత్యేక మెస్‌లను ఏర్పాటు చేశారు. వీటి నిర్వహణపై అధికారులకు చిత్తశుద్ధి కొరవడింది. కేర్ టేకర్లు గానీ, అధికారులు గానీ పట్టించుకున్న దాఖలా లు లేవు. భవనాల చుట్టూ అపరిశుభ్ర వాతావరణం నెలకొంది. ఎక్కడ చూసినా చెత్తాచెదారమే. ఇవి ఎలుకలు, పందికొక్కులకు ఆవసాలుగా మారాయి. తరచూ గదుల్లో వెళ్తున్నారు. ఇక భోజన విషయానికి వస్తే విద్యార్థులకు నిత్యం సమస్యలే. అన్నంలో బొద్దింకలు వస్తుంటాయి. నీటిని మరిపించే మజ్జిగ, సాంబారు. నాణ్యమైన భోజనాన్ని అందించకపోవడంతో పలుమార్లు



విద్యార్థులు ఆందోళనలు చేశారు. అయినా వర్సిటీ ఉన్నతాధికారులు స్పందించడం లేదు.

లెక్కకు మించి వసతి

లెక్కకు మించి విద్యార్థులు ప్రవేశాలు పొందడంతో వసతి కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. పీజీ, ఇంజినీరింగ్, ఫార్మసీ, వృత్తి విద్యా కోర్సుల్లో ఈసారి మహిళా విద్యార్థులు 75 శాతం మంది ప్రవేశాలు పొందారు. వారికి వసతి కల్పించడం అధికారులకు తలకు మించిన భారంగా మారింది. ప్రస్తుతం ఉన్న పద్మాక్షి హాస్టల్ 1200 మందికి మాత్రమే సరిపోతుంది. కానీ 1600 మందికి వసతి కల్పించారు. దీంతో ఇబ్బందులు తప్పడం లేదు. 200 మంది కోసం ప్రత్యేకంగా కొత్త భవనాన్ని నిర్మిస్తున్నారు.

లోపించిన జవాబుదారీతనం

వసతిగృహాల నిర్వహణ కోసం 184 మంది ఉద్యోగులను నియమించారు. ఇందులో కేవలం 23 మంది మాత్రమే రెగ్యులర్. మిగతా వారందరూ తాత్కాలిక ఉద్యోగులే. 62 మంది లంసమ్, 51 మంది దినసరి వేతన, 36 మంది క్యాజువల్ సిబ్బంది, ఇద్దరు టైం స్కేల్ విధులు నిర్వహిస్తున్నారు. యువతులు తమ సమస్యలను సిబ్బంది దృష్టికి తీసుకువెళ్లినా సరిగా స్పందించడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రతి హాస్టల్‌కు ఒక సంచాలకుడు, ఒక కేర్ టేకర్ అందుబాటులో ఉండాలి. వారు పత్తాలేరని పలువురు చెబుతున్నారు. సంచాలకులకు సమస్యల గురించి వివరించినా పట్టింపులేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పరిష్కారానికి కృషి చేస్తున్నాం-డాక్టర్ బి.మంజుల, వసతిగృహాల సంచాలకులు

సమస్యల పరిష్కారం కోసం ఎప్పటికప్పుడు కృషి చేస్తూనే ఉన్నాం. కొత్తగా వసతిగృహాలు నిర్మిస్తున్నాం. ప్రస్తుతం పద్మాక్షిలో సమస్యలు నెలకొన్నాయి. వాటిని అధిగమించడానికి చర్యలు తీసుకుంటున్నాం.

# పొగ బారుతున్న భోజనం

జనగామ : గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో భోజనం పొగబారుతోంది. గిరిజన సంక్షేమ శాఖ నిర్లక్ష్యం వల్ల అడవి బిడ్డలు అనారోగ్యం పాలవుతున్నారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా చాలా పాఠశాలల్లో నేటికీ కట్టెల పొయ్యిలపైనే వంట చేస్తున్నారు. వంట షెడ్లు, గ్యాస్ పొయ్యిలు అందుబాటులో లేక వంట కార్మికులు, విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. 2022-23 విద్యా సంవత్సరానికి గాను గిరిజన సంక్షేమ శాఖ పరిధిలోని 56 ఆశ్రమ ఉన్నత పాఠశాలలు, 30 వసతి గృహాలు, 8 ప్రాథమికోన్నత, 221 ప్రాథమిక పాఠశాలలు, 2 ఆశ్రమ జూనియర్ కళాశాలల్లో బాలురు 12,157, బాలికలు 12,971 మంది, 26 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో 10,528 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తరగతులు నిర్వహిస్తున్నారు. ఏదైనా అల్పాహారం వండాలన్నా కట్టెల పొయ్యిలే దిక్కుగా మారాయి.

అనారోగ్యానికి దారి తీస్తుందిలా..

కట్టెల పొయ్యిపై వంట చేస్తే భోజనం పొగబారడం, శుభ్రత ఉ



ండకపోవడం లాంటి సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇలాంటి వంటకాలను తినడం వల్ల జీర్ణకోశ సంబంధిత వ్యాధులకు గురయ్యే అవకాశాలుంటాయని, వంట మనుషులకు, ఆ వంట షెడ్డు సమీపంలోని వారికి పొగ వ్యాపించి శ్వాసకోశ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంటుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

ఆసక్తి చూపని అధికారులు!

అధికారులు, ఉద్యోగులు కుమ్మక్కై తప్పుడు రికార్డులతో అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలున్నాయి. వంట గ్యాసు పొయ్యిలపై వండితే అక్రమానికి అవకాశం తక్కువ. ఎన్ని సిలిండర్లు వాడారనేది తెలుస్తుంది. వంట చెరకుపై వండితే అందుకు ఆస్కారం ఉండదు. గతంలో గిరిజన సంక్షేమ శాఖలోని వసతి గృహాలు, ఆశ్రమ పాఠశాలలకు వంట గ్యాసు మీదే వండేలా ఏర్పాట్లు చేశారు. కానీ అది అమలుకు నోచుకోలేదు. అధికారులు దీనిపై ఆసక్తి చూపకపోవడంలో ఆంతర్యమేంటనే సందేహాలు గిరిజనులు వ్యక్తం చేస్తున్నారు.

# ఇంటాబయట విజయబావుటా



ఖమ్మం : ఓర్పునకు పర్యాయ పదం నేలతల్లి. ఆ రూపాన్ని స్త్రీకి ప్రతిరూపంగా భావిస్తాం. కాలం మార్పులకు శ్రీకారం చుట్టినా, ఆధునిక జీవనం అన్నింట్లో మహిళలకు అవకాశాలిచ్చినా వారు అనుకున్నది, ఆశించింది సాధించాలంటే అదనపు భారం మోయాల్సిందే. బాధ్యతల ఒత్తిడితో కుంగిపోకుండా, పోటీ ప్రపంచంలో నిలబడగలమా లేదా అని సంశయించకుండా, ఫలితాలకై సంకోచించకుండా ఓర్పు అనే సహజ కవచాలను ఆయుధంగా చేసుకుని మగువలు నెగ్గుకొస్తున్నారు. ప్రభుత్వ కొలువుల్లో కొలువుదీరటమే కాదు. ఉద్యోగ జీవితంలోనూ నిలబడగలుగుతున్నారు. సమస్యలపై కలబడగలుగుతున్నారు.. అంతేనా.. పురుషులకు ప్రభావం చూపి అందరికంటే మిన్న అన్న 'గుర్తింపు'నూ సొంతం చేసుకుంటున్నారు.

శక్తి స్వరూపిణి

నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళా విజేతల స్ఫూర్తిదాయక కథనాల సమాహారం.

చింతకాని మండలం నాగులవంచ ప్రధాన రహదారి వెంట గుడారంలో గర్వోలే ఉష, వెంకట్ దంపతులు నాలుగేళ్లుగా ముగ్గురు పిల్లలతో జీవనం సాగిస్తున్నారు. వీరిది మహారాష్ట్రలోని నాంథేడ్ సమీప కంథార్ గ్రామం. వెంకట్ కొలిమి వద్ద ఇనుప ఉపకరణాలను వేడిచేస్తుండగా.. అతని భార్య పెద్ద సమ్మెట సుత్తి(గన్ను)తో సమ్మెటదెబ్బ వేస్తూ భర్తకు చేదోడుగా నిలుస్తున్నారు. మగవారికి ఏమాత్రం తీసిబోనంటూ గన్నుతో సమ్మెట వేస్తూ కుటుంబ బాధ్యతల్లో అండగా ఉంటూ మహిళా శక్తిని చాటుతోంది ఉష.

దూరవిద్యతో లక్ష్యం చేరువైంది..

ఏన్కూరు మండలం తూతక లింగన్నపేటకు చెందిన నామా బుల్లెయ్య, ధనలక్ష్మీ పెద్ద కూతురు శిరీష. చిన్ననాటి నుంచి చదువు పట్ల ఆసక్తిగా ఉండేది. గురుకుల విద్యాలయంలో ప్రవేశానికి అర్హత పరీక్ష రాసి వైరాలో ఐదోతరగతి సీటు సాధించింది. ఏడో తరగతిలో ఆరోగ్యం సరిగా లేకపోవడంతో తల్లిదండ్రులు ఇంటికి తీసుకొచ్చారు. అప్పటికే వివాహం చేయాలనుకున్నారు. ఆ కుటుంబ పరిస్థితి తెలుసుకున్న స్థానిక ప్రైవేటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు తల్లిదండ్రులకు నచ్చజెప్పి పదో తరగతి వరకు చదివించారు. ఆ తర్వాత తల్లిదండ్రులు పెళ్లి చేశారు. ఇద్దరు పిల్లలకు జన్మనిచ్చిన శిరీష ఆగిన తన చదువును కొనసాగించాలని భావించారు. భర్త సిరిపురపు రామారావు, సోదరుడు నామా వెంకటేశ్వర్లు ప్రోత్సాహంతో దూరవిద్య ద్వారా డిగ్రీ పూర్తి చేశారు. బీఎడ్ గుంటూరులోని సెయింట్ జోసఫ్ కళాశాలలో పూర్తి చేశారు. ఖమ్మంలో ప్రైవేటు ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూనే రెండేళ్ల తర్వాత కేంద్రీయ విద్యాలయంలో తాత్కాలిక ఉద్యోగం సంపాదించారు. తొలి ప్రయత్నంలోనే మహాత్మా జ్యోతిబాపులే గురుకుల విద్యాలయాల్లో టీజీటీ, పీజీటీ పోస్టులకు ఎంపికయ్యారు. పీజీటీగా దుమ్ముగూడెంలో పనిచేసి పదోన్నతిపై ప్రస్తుతం ఆదిలాబాద్‌లో అధ్యాపకురాలిగా పనిచేస్తున్నారు.

అమ్మ పాల సాక్షిగా..!

అసమానతల విషపు నాగులు బుసలు కొడుతుంటే..<br>
కన్నీటి నెత్తుటి గాయాలు సలపరం పెడుతుంటే..<br>
చట్టాలు ధగాకోర్ల చుట్టాలై ఉరి తాళ్లు బిగిస్తుంటే..<br>
జనిస్తున్న దుఃఖాన్ని అదిమిపెట్టి<br>
ఉప్పొంగే ఉద్వేగం జ్వాలై రాగ<br>
చేయూతనివ్వని సమాజానికి<br>
ఎరుపెక్కిన శక్తివై<br>
విషపు నాగులను తెగ నరికి<br>
పుడమి తల్లికి రుధిరాభిషేకమై<br>
గతిస్తున్న న్యాయానికి గమ్యం చూపి<br>
ఎగురవేయి ఆత్మ స్థైర్యపు బావుటా<br>
అమ్మ పాల సాక్షిగా..!

తాళ్లూరి రాధ, కవయిత్రి, ఖమ్మం

విధి నిర్వహణలో ధీర

ఖమ్మానికి చెందిన అచ్యుతనేని హిమసింధు(29) పదో తరగతి వరకు అశ్వాపురంలోని పాఠశాల, ఇంటర్ విజయవాడ, బీటెక్(సివిల్) దిల్లీలో పూర్తి చేశారు. 2015లో బీటెక్ పూర్తి చేసిన ఆమె రెండేళ్లు హైదరాబాద్‌లో ప్రైవేటు కంపెనీలో ఉద్యోగం చేసి 2018లో టీఎస్‌పీఎస్సీ పోటీ పరీక్షల్లో విజయం సాధించారు. మిషన్ భగీరథ పథకంలో ప్రభుత్వ ఉద్యోగం పొందారు. తల్లాడ మండల ఏఈఈగా చేస్తున్నారు. రాజమండ్రికి చెందిన విద్యా వాత్సాయన్ అనే మెరైన్ ఇంజినీర్‌ను 2021లో వివాహం చేసుకున్నారు. ఆయన ముంబయి నుంచి దుబయి వెళ్లే ఓడలో విధులు నిర్వర్తిస్తుంటారు. హిమసింధు, విద్యా వాత్సాయన్ దంపతులకు 2022లో బాబు జన్మించాడు. హిమసింధు తల్లి కొవిడ్ సోకిన తర్వాత వచ్చే పలు సమస్యలతో మృతి చెందారు. తండ్రితో కలిసి ఖమ్మంలో నివసిస్తున్న హిమసింధు రోజూ తల్లాడ మండలంలో విధులు నిర్వహిస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో తాగునీటి సరఫరా సహా ఇతర నిర్మాణ పనులను ఆమె పర్యవేక్షించాల్సి ఉంటుంది. క్షేత్రస్థాయిలో పని చేసే ఇంజినీరింగ్ అధికారికి సమయ పాలన ఉండదు. దీంతో 8 నెలల చంటి బాబుతో ఆమె ఇబ్బంది పడుతుండగా రాజమండ్రిలోని అత్తామామలు బాబును తీసుకెళ్లారు. తోటి కోడలు ఆమె పాపతో పాటు చూసుకుంటోంది. దీంతో ఏకాగ్రతతో విధులకు హాజరవుతున్నట్లు హిమసింధు తెలిపారు. హిమసింధు ఉద్యోగ బాధ్యతలు నిబద్ధతతో కచ్చితంగా నిర్వహిస్తారని మిషన్ భగీరథ ఈఈలు పుష్పలత, వాణిశ్రీ ప్రశంసించారు.

చంటి బిడ్డ, భర్తతో హిమసింధు

తీరని విద్యా దాహం..

మిషన్ భగీరథ ఇంట్రా విభాగం ఖమ్మం ఈఈ(కార్యనిర్వాహక ఇంజినీర్)గా పని చేస్తున్న పుష్పలత పదో తరగతి వరకు ఖమ్మంలోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో చదివారు. తర్వాత సివిల్ ఇంజినీరింగ్‌లో డిప్లొమా కోర్సు మూడేళ్లు మెదక్‌లో పూర్తి చేశారు. ఏపీపీఎస్సీ ద్వారా ఎంపికై 1998లో కరీంనగర్ జిల్లా మంథనిలో పంచాయతీరాజ్ శాఖలో ఏఈఈగా ఉద్యోగం ప్రారంభించారు. 2000లో బదిలీపై ఖమ్మం వచ్చారు. ఉద్యోగం చేస్తూనే (ఇన్ సర్వీస్) హైదరాబాద్‌లోని జేఎన్‌టీయూలో 1999-2001లో సివిల్ ఇంజినీరింగ్‌లో బీటెక్ డిగ్రీ పూర్తి చేశారు. ఏడాదికి 15 రోజులు కళాశాలలో తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఆ 15 రోజులు ఉద్యోగానికి సెలవు పెడతారు. పరీక్షల సమయంలో ఒకరోజు ఉద్యోగ విధులు ఖమ్మంలో నిర్వహించి, మరుసటి రోజు హైదరాబాద్‌లో పరీక్షకు హాజరవుతూ బీటెక్ ఉత్తీర్ణులయ్యారు. ప్రస్తుతం ఖమ్మంలో మిషన్ భగీరథ ఈఈగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

మళ్లీ చదవాలనే తపన

కుమార్తె ఇంటర్ ఉత్తీర్ణత పొంది నీట్ పరీక్షకు హైదరాబాద్‌లో లాంగ్ టర్మ్ కోచింగ్ తీసుకుంటోంది. ఇదే సమయంలో తల్లి పుష్పలత మళ్లీ తాను ఎందుకు చదవకూడదని అనుకున్నారు. అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో ఎమ్మెస్సీ సైకాలజీ(మానసిక శాస్త్రం)లో 2022 అక్టోబరులో చేరారు. ప్రస్తుతం రెండో సంవత్సరం పుస్తకాలు చదువుతూ సెలవురోజుల్లో కళాశాలలో నిర్వహించే తరగతులకు హాజరవుతున్నారు.

మిషన్ భగీరథను నడిపించే నాయికలు

26 మంది ఇంజినీర్లు మహిళలే

ఖమ్మం జిల్లాలో ఇంటింటికీ తాగునీరు అందించే మిషన్ భగీరథ పథకంలో మహిళా ఇంజినీర్లే ఎక్కువ మంది పని చేస్తున్నారు. ఖమ్మం సర్కిల్ కార్యాలయం సహా డివిజన్, కార్యాలయాల్లో, క్షేత్రస్థాయిలోనూ మహిళా ఇంజినీర్లే ఈ పథకాన్ని నడిపిస్తున్నారు. వీరందరినీ నడిపే జిల్లాస్థాయి ఇంజినీరింగ్ అధికారులు సైతం మహిళలే కావటం విశేషం. జిల్లావ్యాప్తంగా 26 మంది మహిళా ఇంజినీర్లు పని చేస్తున్నారు. మిషన్ భగీరథ ఇంట్రా విభాగం ఖమ్మం డివిజన్ ఈఈ పుష్పలత, గ్రిడ్ విభాగం ఖమ్మం డివిజన్ ఈఈ వాణిశ్రీ నేతృత్వంలో, మహిళా ఇంజినీరింగ్ అధికారుల పర్యవేక్షణలో పథకం విజయవంతంగా నడుస్తోంది. సర్కిల్, డివిజన్ కార్యాలయాలు, క్షేత్రస్థాయిలో ఇంజినీరింగ్ అధికారులతో పాటు ఇతర విభాగాల్లో వేర్వేరు కేటగిరీల్లో మొత్తం 81 మంది ఉద్యోగులు ఉండగా వారిలో 41 మంది మహిళలే కావడం విశేషం. మిషన్ భగీరథ పథకంలో 50 శాతానికి మించి మహిళలు విధులు నిర్వహిస్తున్నారు.

వాణిశ్రీ, ఈఈ, గ్రిడ్ డివిజన్, ఖమ్మంనైతిక, మానసిక బలాల్లో నిస్సందేహంగా మహిళలే శక్తిమంతులు" మహాత్మా గాంధీ

# పన్ను బకాయిలు రూ.59కోట్లు

కొత్తగూడెం : పురపాలక సంస్థలకు ప్రధాన ఆదాయ వనరు పన్నులు మాత్రమే. ప్రతి ఆర్థిక సంవత్సరం ఆస్తిపన్ను వసూలుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందించి అమలు చేస్తున్నారు. తాజాగా '2022-23' సంవత్సరానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని ఏడు పురపాలక సంఘాలు, ఒక నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 1,56,882 అసెస్‌మెంట్లు గుర్తించారు. వీటి నుంచి వసూలు కావాల్సిన ఆస్తి పన్ను విలువ రూ.93.35 కోట్లు. కానీ ఈ నెల 4 నాటికి బిల్ కలెక్టర్లు వసూలు చేసింది రూ.34.2 కోట్లు మాత్రమే. నెలాఖరుతో వార్షిక ఏడాది ముగియనుంది. వసూలు కావాల్సిన లక్ష్యం రూ. రూ.59.15 కోట్లు మిగిలిఉంది.

కార్యాచరణ ఇలా.. గడువు సమీపిస్తున్న నేపథ్యంలో పురపాలకాల అధికారులు మొండి బకాయిదారుల(టాప్ డిఫాల్టర్స్) జాబితా రూపొందించారు. వారీగా బిల్ కలెక్టర్లు సందర్శించేలా కార్యచరణ రూపొందించారు. రెండు, మూడు సందర్శనల అనంతరం రెడ్ నోటీసు జారీ చేస్తున్నారు. అయినా స్పందించకుంటే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టనున్నట్లు అధికారులు చెబుతున్నారు. యజమానులు నేరుగా కానీ, క్యూఆర్ కోడ్, పురపాలక వెబ్‌సైట్,



సిటిజన్ బడ్డీ యాప్‌లు, '90002 53342' నంబరు సాయంతో బిల్‌డెస్క్ ద్వారా చెల్లింపులు చేసే వెసులుబాటు ఉందన్నారు. 'ఆస్తి పన్నులో రాయితీ పథకం వస్తుందని చాలామంది వాయిదా వేస్తున్నారు. ప్రస్తుతం ఆ అవకాశం లేదు. ప్రజలు ఆస్తి, నీటి పన్నులు చెల్లించాలని' పాల్వంచ పురపాలక కమిషనర్ సీహెచ్ శ్రీకాంత్ అన్నారు.

# అవాంతరాలను అధిగమిస్తూ యూరియా ఉత్పత్తి

గోదావరిఖని : తరచూ సాంకేతిక అవరోధాలు ఎదుర్కొంటున్నప్పటికీ రైతన్నలు ఎదుర్కొంటున్న యూరియా కొరత నివారణలో రామగుండం ఎరువుల కర్మాగారం ప్రధాన భూమిక పోషిస్తోంది. వార్షిక మరమ్మతుల పేరిట కర్మాగారంలో యూరియా ఉత్పత్తికి అవరోధాలు ఏర్పడుతుండటంతో నిర్దేశించిన వార్షిక లక్ష్యాన్ని చేరుకోలేకపోయినా మిగతా రోజుల్లో 100 శాతం ఉత్పత్తి సామర్థ్యంతో ఆరు రాష్ట్రాల్లోని రైతులకు యూరియా సరఫరా చేయడంలో ప్రధాన భూమిక పోషిస్తోంది. రామగుండం ఎరువుల కర్మాగారం వార్షిక ఉత్పత్తి లక్ష్యం 12.7 లక్షల మెట్రిక్ టన్నుల కాగా మరో 24 రోజుల్లో వార్షిక సంవత్సరం ముగియనుంది. ఈ నేపథ్యంలో నాటికి 7.54 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా ఉత్పత్తి జరిగింది. ఎరువుల కర్మాగారానికి నిర్దేశించిన ఉత్పత్తి లక్ష్యంలో ఇది కేవలం 59.37 శాతమే అయినప్పటికీ ఉత్పత్తి చేసిన యూరియాను ఎప్పటికప్పుడు ఆయా రాష్ట్రాలకు సరఫరా చేస్తున్నట్లు యాజమాన్యం పేర్కొంటోంది. వార్షిక సంవత్సరంలో సుమారు మూడున్నర నెలలకు పైగా ఉత్పత్తికి అవరోధాలు ఎదురవుతు



ండగా మిగతా కాలంలో 100 శాతం సామర్థ్యంతో యూరియా ఉత్పత్తిపై అధికారులు ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. కర్మాగారంలో ఏర్పడుతున్న సాంకేతిక ఇబ్బందులను అధిగమించేలా నిపుణులైన ఇంజినీరింగ్ అధికారులతో ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణను పటిష్ఠం చేసినట్లయితే పూర్తిస్థాయిలో ఉత్పత్తి లక్ష్యం సాధించే అవకాశం ఉంది.

7.54 లక్షల మెట్రిక్ టన్నుల సరఫరా2022-23 ఆర్థిక సంవత్సరంలో నాటికి రామగుండం ఎరువుల కర్మాగారం ద్వారా తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, తమిళనాడు రాష్ట్రాలకు 7,54,771 మెట్రిక్ టన్నుల యూరియాను రోడ్డు, రైల్వేమార్గం ద్వారా సరఫరా చేసింది. దీంతో ఆయా రాష్ట్రాల్లో యూరియా కోసం అన్నదాతలు ఎదుర్కొంటున్న సమస్య కొంత వరకు తీర్చినట్లయిందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

# అతివకు సర్కారు కానుక

పెద్దపల్లి : అంతర్జాతీయ మహిళా దినోత్సవ కానుకగా ప్రభుత్వం స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణం విడుదల చేసింది. గడిచిన నాలుగేళ్లుగా పేరుకుపోయిన బకాయి సొమ్ములో రెండేళ్లకు సంబంధించి మోక్షం లభించింది. మరో రెండేళ్ల బకాయిలు రావాల్సి ఉంది. వడ్డీ వ్యాపారుల బెడద నుంచి రక్షించి, మహిళలపై ఆర్థిక భారం తగ్గించేందుకు ప్రభుత్వం 'వడ్డీ లేని రుణం'(వీఎల్ఆర్) ప్రవేశపెట్టింది. బ్యాంకు నుంచి పొందిన రుణాలను వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించినప్పటికీ ప్రోత్సాహకం కరవైంది. గడిచిన నాలుగేళ్లలో వడ్డీ పైసా జమ కాలేదు. స్వయం సమృద్ధి రుణాలు పొందిన మహిళలకు ఆర్థిక కష్టాలు తప్పడం లేదు. ఎట్టకేలకు ఆయా సంఘాల ఖాతాల్లో నేరుగా జమ చేసేందుకు అధికార యంత్రాంగం సన్నాహాలు చేస్తోంది.

మహిళలకు ఆర్థిక దన్ను

గ్రామీణ ప్రాంతాల్లోని స్వశక్తి సంఘాల మహిళలు కిరాణాలు, కంగన్‌హాళ్లు, పిండి గిర్నిలు, హోటళ్లు, కుట్టు శిక్షణ కేంద్రాలు, బ్యూటీషియన్లు ఏర్పాటు చేస్తూ ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకుంటున్నారు. నెల వారీగా చేసిన పొదుపు కొలమానంగా బ్యాంకర్లు లింకేజీ రుణాలు మంజూరు చేస్తున్నారు. కిస్తీలు తిరిగి చెల్లించడానికి ఆర్థిక కష్టాలు ఎదుర్కొంటున్న అతివలకు మరింత ప్రోత్సాహం అందించేందుకు 2012 జనవరి 1న వడ్డీ రహిత రుణ పథకాన్ని అందుబాటులోకి తెచ్చారు. అప్పటి నుంచి మహిళలు అసలు, వడ్డీ కలిపి ముందుగా చెల్లిస్తే తర్వాత సంఘాల ఖాతాల్లో వడ్డీ సొమ్ము నేరుగా జమ అవుతోంది.

ఏటా రూ.250 కోట్లకు పైగా రుణాలు

జిల్లాలో 10 వేల స్వశక్తి సంఘాలుండగా సుమారు 1.10 లక్షల మంది సభ్యులుగా కొనసాగుతున్నారు. ఏటా రూ.250 కోట్లకు పైగా బ్యాంకు లింకేజీ రుణాలు పంపిణీ చేస్తున్నారు. కిస్తీల చెల్లింపులో మహిళలకు బ్యాంకర్ల నుంచి ఒత్తిడి పెరుగుతోంది. ఉపాధిహామీ, వ్యవసాయ కూలీ పనులకు వెళ్తూ కిస్తీల చెల్లింపులో సభ్యులు ముందుంటున్నారు. నెలనెలా నిర్వహించే సమావేశాల్లో సహచరుల ముందు అవమానంగా ఉంటుందన్న భయంతోనూ వాయిదాలు చెల్లిస్తూ, ఆదర్శంగా నిలుస్తున్నారు. బకాయిల చెల్లింపు నిలిచిపోవడంతో కొన్ని సంఘాల మనుగడ ప్రశ్నార్థకంగా మారింది.

రూ.15.99 కోట్లు విడుదల

జిల్లాలో గత నాలుగేళ్లకు సంబంధించి రూ.66.3 కోట్ల వడ్డీ బకాయిలు విడుదల కావాల్సి ఉంది. ఇందులో 2018-19లో రూ.4.34 కోట్లు, 2019-20లో రూ.11.64 కోట్లు కలిపి మొత్తం రూ.15.99 కోట్లు మంజూరయ్యాయి. 2020-21 సంవత్సరానికి రూ.20.82 కోట్లు, 2021-22కి సంబంధించి రూ.25.64 కోట్లు రావాల్సి ఉంది. ఈ ఏడాది వార్షిక రుణ లక్ష్య ప్రగతి చివరి దశకు చేరింది. మిగిలిన బకాయిలు విడుదల చేస్తే మహిళలకు ఆర్థికంగా చేయూత లభిస్తుంది.



# చంద్రబాబు క్వాష్ పిటిషన్ కొట్టివేత

అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్ కేసులో అరెస్టయిన తెదేపా అధినేత చంద్రబాబు హైకోర్టులో దాఖలు చేసిన క్వాష్ పిటిషన్‌ను హైకోర్టు కొట్టివేసింది. తనపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్, దాని ఆధారంగా ఏసీబీ కోర్టు జారీ చేసిన రిమాండ్ ఉత్తర్వులను సవాలు చేస్తూ చంద్రబాబు క్వాష్ పిటిషన్‌ను దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈనెల 19న ఈ పిటిషన్‌పై చంద్రబాబు తరఫున సుప్రీంకోర్టు న్యాయవాదులు హరీశ్ సాల్వే, సిద్ధార్థ లూథ్రా వాదనలు వినిపించారు. సీఐడీ తరఫున సుప్రీంకోర్టు న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదించారు. ఇరుపక్షాల వాదనలు విన్న హైకోర్టు.. నేడు తీర్పు వెలువరిస్తూ చంద్రబాబు అభ్యర్థనను తోసిపుచ్చింది.

జైలులో ఉంచి తనను మానసిక క్షోభకు గురిచేస్తున్నారని తెదేపా అధినేత చంద్రబాబు ఏసీబీ కోర్టు న్యాయమూర్తికి తెలిపారు.

# బాలకృష్ణ ఇప్పటికైనా మేలుకో.. ఇదే నా సలహా: మంత్రి అంబటి




అమరావతి: టీడీపీ ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మీసం తిప్పాల్సింది అసెంబ్లీ కాదు.. టీడీపీ పార్టీలో అని హితవు పలికారు మంత్రి అంబటి రాంబాబు. అసెంబ్లీలో మీసం తిప్పితే ఉపయోగంలేదని ఎద్దేవా చేశారు. చంద్రబాబు అవినీతిపై ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నామని ఆయన స్పష్టం చేశారు.

**టీడీపీ ఉద్దేశం చర్చ కాదు.. రచ్చ..** కాగా, మంత్రి అంబటి రెండోరోజు అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతూ.. చంద్రబాబు అరెస్ట్‌పై సరైన ఫార్మాట్‌లో రాకుండా టీడీపీ నేతలు గందరగోళం సృష్టించారు. చంద్రబాబు అవినీతిపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంది. టీడీపీ ఉద్దేశం చర్చ కాదు.. రచ్చ. శాసనసభలో గందరగోళం సృష్టించాలనే ప్రయత్నం చేయాలనేదే టీడీపీ ఉద్దేశం. చంద్రబాబు అవినీతిపై ఎప్పుడైనా ఎక్కడైనా చర్చించేందుకు సిద్ధంగా ఉన్నాం. ఈరోజైనా సరైన ఫార్మాట్‌లో చర్చకు రావాలని కోరుతున్నాం. చిత్తశుద్ధి ఉంటే రండి చర్చిద్దాం. మీ వాదనలను మీరు వినిపించండి.. మా వాదనలు మేం వినిపిస్తాం. చంద్రబాబు అవినీతి చేయలేదని మీకు నమ్మకం ఉంటే.. చంద్రబాబు తప్పు చేయలేదని మీరు నిజంగా నమ్మితే చర్చలో పాల్గొనండి, పారిపోవద్దు.

**బాలకృష్ణ ఇదే సరైన సమయం..** గతంలో ఎప్పుడూ లేనంతగా నిన్న బాలకృష్ణ యాక్టివ్‌గా ఉన్నాడు. స్పీకర్ పోడియం వద్దకు వెళ్లి మీసం తిప్పాడు. మీసం మీ పార్టీలో తిప్పండి బాలకృష్ణ. అసెంబ్లీలో మీసం తిప్పితే ఉపయోగం లేదు. మీ తండ్రికి వెన్నుపోటు పొడిచిన సందర్భాన్ని గుర్తు తెచ్చుకుని అక్కడ మీసం తిప్పండి. జన్మనిచ్చిన తండ్రికి, క్లిష్ట సమయంలో అండగా నిలవలేదనే అపవాదు మీ మీద, మీ అన్నదమ్ముల మీద ఉంది. ఆ అపవాదును తొలగించుకునే అవకాశం వచ్చింది. మీ బావ జైల్లో.. అల్లుడు ఢిల్లీలో ఉన్నారు. ఇదే మీకు సరైన సమయం. పోయిన పగ్గాలు తీసుకోండి.. నందమూరి వంశాన్ని నిరూపించుకోండి.. పార్టీని బ్రతికించుకోండి. పార్టీని సర్వనాశనం చేసుకునే పరిస్థితి తెచ్చుకోకండి. మీకు నేను సలహా మాత్రమే ఇస్తున్నాను. పాటిస్తే పాటించు.. పాటించకపోతే అథపాతాళానికి పోతారు.

**దమ్ముంటే చర్చకు రండి..**మీకు మీ నాయకుడు తప్పు చేయలేదనే నమ్మకం ఉంటే కమాన్ చర్చలో పాల్గొనండి. ప్రజలే నిర్ణయిస్తారు.. ఎవరు తప్పుచేశారో. ట్రెజరీ బెంచ్ సిద్ధంగా ఉంది చర్చకు రండి. చంద్రబాబును అరెస్ట్ చేశారు కాబట్టి ఏదో ఒకటి చేయాలనే ఆలోచనతోనే టీడీపీ నేతలు ఉన్నారు. నేను లేచి నిలబడకపోతే స్పీకర్ మీద దాడి చేసేవారు. పేపర్ లో వార్తల కోసం టీడీపీ వ్యవహరించినట్లుగా అనిపిస్తోంది. ఈరోజు కూడా ఇష్టానుసారంగా వ్యవహరిస్తే స్పీకర్ కచ్చితంగా చర్యలు తీసుకుంటారు అని అన్నారు.

# ఏపీ అసెంబ్లీలో స్కిల్ డెవలప్‌మెంట్ వ్యవహారంపై స్వల్పకాలిక చర్చ



అమరావతి: స్కిల్ డెవలప్‌మెంట్‌లో జరిగిన అవకతవకలు, అవినీతి నిరూపణకు సంబంధించి తీసుకున్న చర్యలపై ఏపీ అసెంబ్లీలో స్వల్పకాలిక చర్చ చేపట్టారు. సభలో మాజీ మంత్రి కన్నబాబు మాట్లాడుతూ... 2014లో చంద్రబాబు అధికారంలోకి రావడంతోనే తన తాబేదార్లుకు దోచిపెట్టాలని చూశారని ఆరోపించారు. స్కిల్ కేసులో చంద్రబాబు చేసింది అదే అని అన్నారు. సీమెన్స్ సెంటర్ ఫర్ ఎక్సలెన్స్ స్కిల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌తో పాటు డిజైన్ టెక్‌ను దీనిలో ఇన్వాల్వ్ చేశారన్నారు. తెలంగాణకు చెందిన ఇల్లెందుల రమేష్ 2014 జులైలో అప్రోచ్ అయ్యారని తెలిపారు. తరువాత చంద్రబాబు సన్నిహితుడు గంటా సుబ్బారావుతో యుద్ధ ప్రాతిపదికన ఈ ప్రాజెక్టుకు రూపకల్పన చేశారన్నారు. స్కిల్ డెవలప్‌మెంట్ ఆడిటర్‌గా టీడీపీ ఆడిటర్‌ను నియమించారని.. యుద్ధ ప్రాతిపదికన జీవోలు ఇచ్చి హైయర్ ఎడ్యుకేషన్ అక్కడి నుంచి అచ్చన్న శాఖకు బదిలీ చేశారని చెప్పారు. ఈ ఎంవోయూ కూడా ఓ బోగస్ అని... అపర్ణ అనే ఒక ఐఏఎస్‌ను కూడా ఇక్కడ నియమించారన్నారు. సుమన్ బోస్, కల్వేకర్, ముకుల్ అగర్వాల్ వీరు ముగ్గురు డిలైట్‌లో కలిసి పనిచేశారన్నారు. స్కిల్లర్ అనే డొల్ల కంపెనీని కూడా వెంటనే సృష్టించారన్నారు. బడ్జెట్‌ను ఆగమేఘాల మీద డబ్బులు రిలీజ్ చేశారని.. ఆర్థిక శాఖ అడ్డు చెప్పినా వినలేదని చెప్పుకొచ్చారు. డిసెంబర్ 5 నుంచి మార్చిలోపు రూ.371 కోట్లు రిలీజ్ చేశారన్నారు. ఈ నిధులు సిమెన్స్‌కు కాకుండా డొల్ల కంపెనీలకు రిలీజ్ చేశారని తెలియజేశారు. ముందు డిజైటన్ టెక్‌కు అక్కడి నుంచి షెల్ కంపెనీకి పంపారన్నారు. తరువాత పీవీఎస్పీకి రూ.271 కోట్లు రిలీజ్ చేశారన్నారు. అక్కడి నుంచి 12 డొల్ల కంపెనీలకు పంపారని కన్నబాబు వెల్లడించారు.

# జగన్ అరెస్టు సమయంలో ఆ నేతలు ఏమన్నారో అందరికీ తెలుసు..




విజయనగరం: లక్ష కోట్ల రూపాయలు జగన్మోహన్ రెడ్డి దిగమింగారని విచారించి అనాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ అరెస్ట్ చేసిందని, అప్పటి పీసీసీ అధ్యక్షుడు బొత్స సత్యనారాయణ, మంత్రి ధర్మాన తదితరులు జగన్ అరెస్ట్ సమయంలో ఏమన్నారో అందరికీ తెలుసునని టీడీపీ సీనియర్ నేత, మాజీ కేంద్రమంత్రి అశోక్ గజపతి రాజు అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం ఆయన విజయనగరంలో మీడియాతో మాట్లాడుతూ జగన్‌ను అరెస్ట్ చేసినప్పుడు ఉన్న బొత్స, ధర్మానను ఇప్పుడు సీఎం జగన్ ప్రోత్సహిస్తున్నారని, టీడీపీ నేతలను హింసిస్తున్నారని అన్నారు. అన్నీ ఆధారాలు నిర్ధారణ అయిన తరువాతే జగన్‌ను అప్పుడు అరెస్టు చేశారన్నారు. ఇప్పుడు చంద్రబాబు అరెస్ట్ తీరు ఏ చట్టమో ఎవరికీ అర్థం కావటం లేదని.. దైవ దర్శనంకు వెళతామంటే అరెస్ట్ చేస్తారా..? ఇదెక్కడి చట్టమని అశోక్ గజపతిరాజు తీవ్ర స్థాయిలో విమర్శించారు. కాగా చంద్రబాబు కోసం ఢిల్లీ హజ్రత్ నిజాముద్దీన్ దర్గాలో ప్రార్థనలు చేస్తున్నారు. బాబు జైలు నుంచి బయటకు రావాలని కోరుతూ కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్ బాషా ప్రార్థనలు చేశారు. దర్గాపైన చాదర్ సమర్పించి దువా చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ చంద్రబాబు అక్రమ కేసుల నుంచి విముక్తి పొంది ఏపీ సీఎం కావాలని ప్రార్థించానన్నారు. నారా లోకేశ్‌కు కూడా మనోధైర్యం కల్పించి ముందుకు సాగాలని కోరుకున్నానని అత్తార్ చాంద్ బాషా స్పష్టం చేశారు.



# భారతీయ వైద్య విద్యార్థులకు గుడ్‌న్యూస్

దిల్లీ: భారతీయ వైద్య విద్యార్థులు ఇకపై విదేశాల్లో కూడా ప్రాక్టీస్ చేయొచ్చని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ తెలిపింది.

ఈ మేరకు వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ నుంచి జాతీయ వైద్యమండలి వచ్చే 10 ఏళ్ల కాలానికి గుర్తింపు లభించినట్లు ఒక ప్రకటనలో తెలిపింది. దీంతో భారత్‌లో వైద్య విద్య అభ్యసించిన వారు అమెరికా, కెనడా, ఆస్ట్రేలియాతో పాటు న్యూజిలాండ్‌లలో పీజీ కోర్సుల్లో చేరడంతో పాటు ప్రాక్టీస్ చేయొచ్చని వెల్లడించింది. 2024 నుంచి భారతీయ వైద్య విద్యార్థులు విదేశాల్లో విద్య, ప్రాక్టీస్ కోసం దరఖాస్తు చేసుకోవచ్చని ప్రకటించింది. ప్రస్తుతం దేశంలో ఉన్న, రాబోయే పదేళ్లలో ఏర్పాటయ్యే వైద్య కళాశాలలు డబ్ల్యూఎఫ్ఎమ్ఈ గుర్తింపు పొందుతాయని కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖ ఒక ప్రకటనలో పేర్కొంది. ప్రస్తుతం దేశంలో 706 వైద్య కళాశాలలు ఉన్న విషయం తెలిసిందే. "ఈ వెసులుబాటుతో భారతీయ వైద్య కళాశాలలకు, నిపుణులకు అంతర్జాతీయంగా గుర్తింపు లభిస్తుంది. విదేశాల్లోని వైద్య విద్యాసంస్థలకు భారత్‌లోని కళాశాల మధ్య సంబంధాలు మెరుగుపడతాయి. వైద్య విద్యలో సరికొత్త ఆవిష్కరణలకు ఇది తోడ్పాటునందిస్తుంది. భారత్‌లో అందించే వైద్య విద్య అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉందనేందుకు డబ్ల్యూఎఫ్ఎమ్ఈ గుర్తింపు నిదర్శనం. దీని వల్ల భారతీయ వైద్య విద్యార్థులు ప్రపంచంలో ఎక్కడైనా తమ కెరీర్‌ను కొనసాగించవచ్చు. అంతేకాకుండా, విదేశీ విద్యార్థులను భారత వైద్య కళాశాలలు ఆకర్షిస్తాయి" అని ఎన్ఎమ్‌సీ ప్రతినిధి డాక్టర్ యోగేందర్ మాలిక్ తెలిపారు. అంతర్జాతీయంగా అత్యున్నతస్థాయి ప్రమాణాలతో వైద్య విద్యను అందించేందుకు డబ్ల్యూఎఫ్ఎమ్ఈ కృషి చేస్తోంది. డబ్ల్యూఎఫ్ఎమ్ఈ గుర్తింపు ప్రక్రియ కోసం ప్రతి వైద్య కళాశాల నుంచి 60 వేల డాలర్లు రుసుము వసూలు చేస్తోంది.

దీంతో దేశంలోని 706 వైద్య కళాశాలలు డబ్ల్యూఎఫ్ఎమ్ఈ గుర్తింపు కోసం మొత్తంగా సుమారు 4,23,60,000 డాలర్లు ఖర్చు కానుంది.



# రూ.కోటిన్నర కరెన్సీతో విఘ్నేశ్వరుడికి అలంకరణ

**ఎన్టీఆర్ జిల్లా నందిగామలో గణేష్ నవరాత్రులు ఘనంగా జరుగుతున్నాయి. వాసవి మార్కెట్ గణపతి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో వినాయకుడిని రూ.1.51 కోట్ల కరెన్సీ నోట్లతో ధనపతిగా అలంకరణ చేశారు. 41వ వార్షికోత్సవంలో భాగంగా రూ.500, రూ.200, రూ.50 కొత్త కరెన్సీ నోట్లతో స్వామి వారి విగ్రహం, మండపాన్ని అలంకరణ చేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు ఏచూరి రాము జెడ్డు పెద్దిరాజు, విట్టల్, తదితరులు పాల్గొన్నారు.**



# అమెరికా స్వరం మారుతోందా..?

ఖలిస్థాన్ టైగర్ ఫోర్స్ చీఫ్ హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో అమెరికా స్వరం మెల్లిగా మారుతోంది. తాజాగా అమెరికా జాతీయ భద్రతా సలహాదారు జాక్ సలీవాన్ గురువారం విలేకర్లతో మాట్లాడుతూ భారత్‌కు ప్రత్యేక మినహాయింపులు ఏమీ లేవని వ్యాఖ్యానించారు. "దౌత్యవేత్తలతో ప్రైవేటుగా ఏం సంభాషణ జరిగిందో వెల్లడించను. కానీ, ఈ విషయంలో మేము భారత్‌లోని అత్యున్నత స్థాయి దౌత్యవేత్తలతో టచ్‌లో ఉన్నాం.. ఇక ముందు కూడా ఉంటాం. ఇది అమెరికాకు ఆందోళనకరం.. మేము తీవ్రంగా పరిగణించే విషయం. నిరంతరం దీనిపై సంప్రదింపులు చేస్తాం. ఈ విషయంలో భారత్‌కు ప్రత్యేకమైన మినహాయింపు లేదు" అని పేర్కొన్నారు.

**కెనడాతో అభిప్రాయభేదాలు లేవు: అమెరికా :** భారత్‌తో సంబంధాలు బలోపేతం చేసుకొనే క్రమంలో కెనడా వైపు బలంగా మాట్లాడటంలేదనే వాదనను అమెరికా ఎన్ఎస్ఏ సలీవాన్ తోసిపుచ్చారు. కెనడా ఆరోపణలను బైడెన్ కార్యవర్గం తీవ్రంగా పరిగణించిందని పేర్కొన్నారు. "మేము కెనడాతో నిరంతరం టచ్‌లో ఉన్నాం. ఇటువంటి పనులకు ఎటువంటి ప్రత్యేక మినహాయింపు ఉండదు. ఏ దేశానికైనా ఇదే వర్తిస్తుంది. ప్రాథమిక సూత్రాలకు మేం కట్టుబడి ఉంటాం. అక్కడి లా ఎన్‌ఫోర్స్‌మెంట్, దౌత్య కార్యక్రమాలను జాగ్రత్తగా పరిశీలిస్తున్నాం. కెనడాతో ఎటువంటి అభిప్రాయభేదాలు లేవు" అని సలీవాన్ వెల్లడించారు.

**జీ20లోనే బైడెన్ ప్రస్తావించారు: ఫైనాన్షియల్ టైమ్స్ –** జీ20లోనే.. నిజ్జర్ హత్యపై అమెరికా అధ్యక్షుడు జోబైడెన్ ప్రస్తావించారని బ్రిటన్ పత్రిక ఫైనాన్షియల్ టైమ్స్ కథనం వెలువరించింది. ముఖ్యంగా ఆంగ్లో సాక్సన్ దేశాల సమూహమైన 'ఫైవ్ ఐస్' గ్రూప్‌లోని పలు సభ్యదేశాలు కూడా అదే సమయంలో తమ ఆందోళనను వ్యక్తం చేసినట్లు పేర్కొంది. అప్పట్లో నిజ్జర్ విషయాన్ని ప్రధాని మోదీ వద్ద నేరుగా ప్రస్తావించాలని ఫైవ్ఐస్ సభ్యదేశాలను కెనడా కోరింది. దీంతో బైడెన్, ఇతర దేశాధినేతలు జోక్యం చేసుకోవాల్సి వచ్చిందని ఈ వ్యవహారంతో సంబంధం ఉన్న వ్యక్తులు వెల్లడించినట్లు ఆ పత్రిక పేర్కొంది. దీనిపై శ్వేతసౌధం మౌనం వహిస్తోంది. వాస్తవానికి జీ20 సదస్సు సందర్భంగా కెనడా–భారత్ ప్రధానుల మధ్య చర్చలు జరిగాయి. ఇవి ముగిసిన వెంటనే కెనడాలోని ఖలిస్థాన్ కార్యకలాపాలపై ఆందోళన వ్యక్తం చేస్తూ భారత్ ప్రకటన వెలువరించింది.

**హ్యూమన్, సిగ్నల్ ఇంటెలిజెన్స్ ఆధారాలను సేకరించిందా..** ఖలిస్థాన్ ఉగ్రవాది హర్‌దీప్ సింగ్ నిజ్జర్ హత్య కేసులో కెనడా ప్రభుత్వం మానవ, సిగ్నల్ ఇంటెలిజెన్స్ సమాచారాన్ని సేకరించిందని అక్కడి పత్రిక సీబీఎస్ న్యూస్ కథనం ప్రచురించింది. ప్రభుత్వ వర్గాల నుంచి వచ్చిన సమాచారం ఆధారంగానే ఈ కథనం వెలువరించినట్లు చెబుతోంది. తమ ప్రభుత్వం వద్ద ఉన్న ఇంటెలిజెన్స్‌లో కెనడాలోని భారత దౌత్య అధికారులు స్వయంగా పాల్గొన్న సంభాషణలున్నాయని పేర్కొంది. ఈ ఇంటెలిజెన్స్ సమాచారం ఫైవ్ఐస్ బృందంలోని ఓ సభ్య దేశం నుంచి కెనడాకు వచ్చినట్లు తెలిపింది. ఆ తర్వాత కెనడా అధికారులు పలు మార్లు భారత్‌కు వచ్చి నిజ్జర్ హత్య కేసులో దర్యాప్తునకు సహకరించాలని కోరినట్లు వెల్లడించింది. మరోవైపు ప్రైవేటు సంభాషణల్లో భారతీయ అధికారులు ఎవరూ ఈ ఆరోపణలను బలంగా ఖండించకపోవడం కూడా న్యూదిల్లీ హస్తాన్ని సూచిస్తోందని సీబీఎస్ కథనంలో పేర్కొంది. ముఖ్యంగా భారత దౌత్యవేత్తలపై నిఘా వేసి ఈ ఇంటెలిజెన్స్‌ను సేకరించినట్లు కెనడా అధికారి వెల్లడించారని అసోసియేటెడ్ ప్రెస్ కథనంలో వెల్లడించింది.

**బలమైన కారణాలున్నాయి: ట్రూడో –** మరోవైపు నిజ్జర్ హత్యలో భారత్ హస్తం ఉందనడానికి బలమైన కారణాలున్నాయని కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో గురువారం అన్నారు.

ఆయన ఐరాసలోని కెనడా దౌత్య బృందంతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. కెనడా వ్యక్తిని.. కెనడా భూమిపై చంపడంలో భారత్ పాత్ర ఉందని వ్యాఖ్యానించారు.



# మోహినీ అవతారంలో దర్శనమిచ్చిన శ్రీనివాసుడు

**తిరుమల: శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు కన్నులపండువగా సాగుతున్నాయి. ఐదో రోజు శుక్రవారం ఉదయం మోహినీ అవతారంలో శ్రీమలయప్పస్వామి భక్తులకు అభయప్రదానం చేశారు. తిరుమాడ వీధుల్లో బంగారు తిరుచ్చిపై ఊరేగుతూ భక్తులకు వరాలు ప్రసాదించారు.**

# చంచల్‌గూడ జైలు నుంచి విడుదలైన వైఎస్ భాస్కర్ రెడ్డి



హైదరాబాద్ : వివేకా కేసులో అరెస్ట్ అయిన ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కర్ రెడ్డి నేడు చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. 12 రోజు ల పాటు భాస్కర్‌రెడ్డి కి ఎస్కార్ట్ బెయిల్ మంజూరైంది. భాస్కర్ రెడ్డి అనారోగ్యంగా ఉన్నట్టు కోర్టుకు చంచల్‌గూడ సూపరింటెండెంట్ రిపోర్ట్ ఇచ్చారు.

మెడికల్ ట్రీట్‌మెంట్ దృష్ట్యా భాస్కర్ రెడ్డికి సీబీఐ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. హైదరాబాద్‌లోనే చికిత్స పొందాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. హైదరాబాద్ విడిచి వెళ్లరాదని భాస్కర్ రెడ్డిని సీబీఐ కోర్టు ఆదేశించింది. అక్టోబర్ 3 న చంచల్‌గూడ జైలు సూపరింటెండెం ట్ ముందు సరెండర్ అవ్వాలని ఆదేశాలు జారీ చేసింది. కాగా.. జైలు నుంచి విడుదలైన వెంటనే భాస్కర్ రెడ్డిని చికిత్స నిమిత్తం గచ్చిబౌలి ఏఐజీ హాస్పిటల్‌కు తరలించారు.

# వివేకా హత్య కేసు.. విచారణ వాయిదా



హైదరాబాద్: మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్య కేసుపై సీబీఐ కోర్టులో విచారణ జరిగింది. విచారణకు వైకాపా ఎంపీ అవినాష్‌రెడ్డి, మిగతా నిందితులు హాజరయ్యారు. అనంతరం విచారణను న్యాయస్థానం వచ్చేనెల 4కి వాయిదా వేసింది. మరోవైపు ఇదే కేసులో ఎస్కార్ట్ బెయిల్ పొందిన నిందితుడు వైఎస్ భాస్కర్‌రెడ్డి చంచల్‌గూడ జైలు నుంచి విడుదలయ్యారు. అనారోగ్య కారణాల దృష్ట్యా ఆయనకు 12 రోజులపాటు సీబీఐ కోర్టు ఎస్కార్ట్ బెయిల్ మంజూరు చేసింది. జైలు నుంచి విడుదలైన అనంతరం గచ్చిబౌలిలోని ఏఐజీ ఆస్పత్రికి భాస్కర్‌రెడ్డి వెళ్లారు. హైదరాబాద్ విడిచి వెళ్లొద్దని ఆయన్ను న్యాయస్థానం ఆదేశించిన విషయం తెలిసిందే.

## డెవిల్ తో సంయుక్త రొమాంటిక్ సాంగ్..!

నందమూరి కళ్యాణ్ రామ్ హీరోగా తెరకెక్కుతున్న తాజా చిత్రం డెవిల్. కళ్యాణ్ రామ్ ప్రతిసారి విభిన్నమైన కథలతో వచ్చి ప్రేక్షకులను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తూ ఉంటారు. ఈ సారి డెవిల్ రూపంలో అలరించడానికి రెడీ అయ్యారు. ఈ సినిమాకి 'బ్రిటీష్ సీక్రెట్ ఏజెంట్' ట్యాగ్ లైన్ పెట్టడం విశేషం. ఈ సినిమాకి సంబంధించి కళ్యాణ్ రామ్ పుట్టిన రోజు సందర్భంగా ఓ టీజర్ విడుదల చేశారు. ఈ టీజర్ నందమూరి అభిమానులను విపరీతంగా ఆకట్టుకుంది. టీజర్ తో హైప్ క్రియేట్ చేశారు. ఆ తర్వాత రీసెంట్ గా ఈ మూవీలో హీరోయిన్ సంయుక్తా మేనన్ లుక్ విడుదల చేశారు. అందులో ఆమె పట్టుచీరలో చందమామలా కనిపించింది. అయితే, ఇప్పుడు హీరో, హీరోయిన్ల మధ్య ఓ రొమాంటిక్ సాంగ్ ని విడుదల చేశారు. 'మాయ చేశావే' అంటూ సాగే పాట ఇది. ఐకాన్ మ్యూజిక్ ఈ పాటను విడుదల చేయడం విశేషం. ఈ పాటను సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఇప్పటి వరకు సిద్ శ్రీరామ్ పాడిన పాటలన్నీ హిట్లే.




ఈ పాట కూడా అదేవిధంగా హిట్ అవుతుందని ఫ్యాన్స్ భావిస్తున్నారు. ఇది అద్భుతమైన మెలడీ సాంగ్ కావడం విశేషం. స్వాతంత్ర్యం రాకముందు బ్యాక్ డ్రాప్ లో ఈ సినిమా తెరకెక్కించగా, పాటలోనూ ఈ అంశాలు క్లియర్ గా కనపడుతున్నాయి. హీరో హీరోయిన్ల కాస్ట్యూమ్స్ దగ్గర నుంచి, మేకప్ లాంటి విషయంలోనూ ఈ జాగ్రత్తలు తీసుకున్నారు. ఇక ఈ పాట ఈ ఏడాది మ్యూజిక్ లవర్స్ ఫేవరేట్ సాంగ్ అవుతుందని మూవీ టీమ్ భావిస్తోంది.

బృంద మాస్టర్ ఈ పాటకు కొరియోగ్రఫీ చేశారు. హర్షవర్థన్ రామేశ్వర్ రెట్రో ట్రాక్ అందించారు. పాటకు తగినట్లు కళ్యాన్ రామ్, సంయుక్త తమ స్టెప్స్ తో అదరగొట్టారు. వీరి మధ్య కెమిస్ట్రీ ఈ మూవీ మరింత ప్లస్ కానుందని తెలుస్తోంది. ఇక, ఈ సినిమా నవంబర్ 24వ తేదీన ప్రేక్షకుల ముందుకు రానుంది. 'అభిషేక్ పిక్చర్స్' బ్యానర్‌పై అభిషేక్ నామా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఆయనే ఈ సినిమాకి దర్శకత్వం వహిస్తున్నారు. ఇప్పటి వరకు విడుదలైన గ్లింప్స్, పోస్టర్స్ సినిమాపై చాలా పాజిటివ్ రెస్పాన్స్ తెచ్చాయి. 1940 బ్యాక్‌డ్రాప్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాకి నిర్మాతలు భారీ బడ్జెట్‌తో ఖర్చు చేస్తున్నారు. అమిగోస్ తో ఫ్లాప్ ఎదుర్కొన్న కళ్యాన్ రామ్ ఈ సినిమాతో ఎలాంటి సక్సెస్ అందుకుంటాడో చూడాలి.

## నందిత శ్వేత లిప్ లాక్ లు ధారాళంగా!

ఎక్కడికి పోతావు చిన్నవాడ సినిమాతో టాలీవుడ్ కి ఎంట్రీ ఇచ్చిన కన్నడ బ్యూటీ నందిత శ్వేత సుపరిచితమే. ఆ తర్వాత శ్రీనివాసకళ్యాణం.బ్లఫ్ మాస్టర్ లాంటి చాలా చిత్రాలు చేసింది. కానీ ఏవి అమ్మడిని విజయ మార్గంలో నడించలేదు. అయినా అడపా దడపా సినిమాల్లో నటిస్తూ ఉనికిని చాటుకునే ప్రయత్నం చేస్తుంది. మరోవైపు టీవీ ప్రోగ్రామ్స్ కి హోస్ట్ గానూ పనిచేస్తూ టాలీవుడ్ కి రెగ్యులర్ గా టచ్ లో ఉంటుంది. అయితే కన్నడ బ్యూటీలు అందరి తరహాలోనే అమ్మడు తొలి నుంచి మడికట్టుకునే ఉంది. డీసెంట్ పాత్రలు తప్ప బోల్డ్ అటెంప్ట్ చేసింది లేదు. ఆ రకంగా కాస్త వెనుకబడి ఉంది ఇంతకాలం. అయితే ఇప్పుడా ఆలోచన మానుకున్నట్లు తెలుస్తోంది. తాజాగా నటిస్తోన్న హిడింబ సినిమాలో హద్దులు చెరిపేసిన



నటించినట్లు తెలుస్తోంది. ఇందులో అశ్విన్ బాబు హీరోగా నటిస్తున్నాడు. త్వరలో ప్రేక్షకుల ముందుకొస్తున్న నేపథ్యంలో నందిత సినిమా విశేషాలు పంచుకుంది. ఈ సందర్భంగా తన పాత్ర ఎలా ఉంటుందన్నది రివీల్ చేసింది. ఈ సినిమాలో రొమాంటిక్ సన్నివేశాల్లో నటించాను. ఇంతకాలం ఆ తరహా సన్నివేశాలకు దూరంగా ఉన్నాను. కానీ ఈ సినిమాలో స్టోరీ డిమాండ్ చేయడంతో ముద్దు సన్నివేశాల్లో నటించాను. నటిగా నాలో కొత్త కోణం ఈ సినిమాలో కనిపిస్తుంది. ఈ సినిమా కోసం బరువు కూడా బాగా తగ్గాల్సి వచ్చింది. అందుకోసం నేను చాలా కష్టపడాల్సి వచ్చింది. ఎందుకంటే నాకు ఫైబ్రోమయోల్జియా అనే కండర రుగ్మత ఉంది. దాని వల్ల ఎక్కువ డైట్ పాటిస్తూ భారీ వ్యాయామాలు చేయడం సాధ్యం కాదు. మితి మీరిన ఒత్తిడి.. సరిగ్గా నిద్రలేకపోవడం వంటి కారణాల వల్ల ఇది తీవ్రతరం అవుతుంది. కానీ ఈ సినిమా కోసం ఆ సవాళ్లు అన్నింటిని ఎదుర్కున్నాను. అనుకున్నట్లు వెయిట్ తగ్గాను. కానీ అది అలా ఉండిపోదు. మళ్లి పెరిగిపోవడానికి అవకాశం ఎక్కువగా ఉంటుంది అని తెలిపింది.




## ఒకేసారి 9 చిత్రాలు.. థియేటర్ల పరిస్థితేంటో?




చిత్ర పరిశ్రమకు సంక్రాంతి తర్వాత దసరా బిగ్గెస్ట్ సీజన్. ప్రతి విజయ దశమికి కనీసం రెండు పెద్ద సినమాలతో పాటు మరికొన్ని మీడియం రేంజ్ చిత్రాలు రిలీజ్ అవుతున్నాయి. అలాగే ఈ ఏడాది కూడా దసరా పండగ.. చిత్ర పరిశ్రమలో కొత్త ఊపు తీసుకురాబోతోంది. దీంతో పాటే థియేటర్ల సమస్యను కూడా తీసుకురాబోతుంది. దీని నుంచి తప్పించుకోవాలంటే ఏవైనా చిత్రాలు వాయిదా పడాల్సిందే. వివరాల్లోకి వెళితే.. ఇప్పటికే పలు తెలుగు చిత్రాలతో పాటు ఇతర భాషల సినిమాలు కూడా దసరా బెర్త్ ఖరారు చేసేసుకున్నాయి. వాటిలో తెలుగు నుంచి బాలకృష్ణ భగవంత్ కేసరి, రవితేజ టైగర్ నాగేశ్వరరావు, కోలీవుడ్ నుంచి దళపతి విజయ్ లియో, హిందీ నుంచి టైగర్ ష్రాఫ్ గణపత్, కంగనా రనౌత్ తేజస్, కన్నడ నుంచి శివ రాజ్‌కుమార్ ఘోస్ట్.. ఇంకా యారియన్ 2, కిల్లర్స్? ఆఫ్ ది ఫ్లవర్ మూన్? చిత్రాలు వస్తున్నాయి. ఇవన్నీ అక్టోబర్? 19కి ఓ రోజు అటు ఇటుగా వస్తున్నాయి. ఈ చిత్రాలన్నింటిలో తెలుగు, తమిళ బాక్సాఫీస్? ముందు భగవంత్ కేసరి, టైగర్ నాగేశ్వరరావు, లియోపై భారీ అంచనాలు ఉన్నాయి. అందుకే తెలుగులో బాలయ్య వర్సెస్? విజయ్? వర్సెస్? రవితేజగా పోటీ ఉండగా.. కోలీవుడ్?లో మాత్రం అంతా లియో హడావిడి మాత్రమే కనిపించేలా ఉంది. ఇక కన్నడలో ఘోస్ట్?, బాలీవుడ్?లో గణ్?పత్?కు మంచి హైప్? ఉంది. వీటితో పాటే రాబోయే ఇతర చిత్రాలను పరిశీలిస్తే.. అంతగా బజ్? ఏమీ లేదు. కానీ వాటికి కూడా థియేటర్లు కొన్నైనా దక్కుతాయి. కాబట్టి ఇన్ని బడా చోటా చిత్రాలు ఒకేసారి రావడం వల్ల థియేటర్ల సమస్య ఏర్పడే అవకాశం తప్పక ఉంటుంది. కాబట్టి వీటిలో ఏమైనా చిత్రాలు ఓ వారం వెనక్కి సెప్టెంబర్ 13 లేదా 15కు ప్రీ పోన్ చేసుకుంటే థియేటర్ల సమస్యను అధిగమించొచ్చు. కానీ ఆ పరిస్థితి కనపడట్లేదు. అందరూ దసరా పండక్కే రావాలని అనుకుంటున్నారు. చూడాలి మరి ఏం జరుగుతుందో..

## ఆండ్రియా సొగసులకు ఎవరైనా ఫిదా కావాల్సిందే..!



తమిళ హాట్ బ్యూటీ ల్లో ఆండ్రియా జెరెమియా ఒకరు. విభిన్న చిత్రాల్లో తన నటనతో ఆమె ఇప్పటికే చాలా మందిని మెస్మరైజ్ చేసేసింది.. తమిళ్ డబ్బింగ్ సినిమాలతో తెలుగు ప్రేక్షకులను అలరించింది ఆండ్రియా. ఇక్కడి ప్రేక్షకులకు కూడా చేరువయ్యారు. డైరెక్ట్ గా తెలుగులోనూ ఓ సినిమాలో నటించారు. నాగ చైతన్య తడాఖా సినిమాలో ఆమె తన నటతో ఆకట్టుకున్నారు. ఆండ్రియా మల్టీ టాలెంటెడ్. కేవలం నటించడమే కాదు ఆమెలో చాలా స్పెషల్ క్వాలిటీలు ఉన్నాయి. ఈ బ్యూటీ కేవలం నటిగానే కాదు సింగర్ గానూ తన ప్రతిభను చాటారు. రామ్ చరణ్ నటించిన ఎవడు సినిమాలో ఓయే ఓయే పాట పాడి అలరించింది. ఇక నాగచైతన్య దడ సినిమాలోని దీవాళీ దీపాన్ని పాట ఎంత ఫేమసో తెలిసిందే. ఈ బ్యూటీ అటు సినిమాల్లో నటిస్తూ.. ఇటు సింగర్ గా తన సత్తా చాటుకుంటోంది. సినిమాల్లో మాత్రమే కాదు అప్పుడప్పుడు మ్యూజిక్ షోలు కూడా చేస్తూ ఆకట్టుకుంటూ ఉంటుంది. ఆమె దాదాపు 15 సంవత్సరాల పాటు మ్యూజిక్ నేర్చుకోవడానికి క్లాసులకు వెళ్లిందట. అందుకే తాను ఈ విధంగా పాడగులుగుతున్నానంటూ గతంలో చెప్పడం విశేషం. ఆండ్రియా తమిళ సినీ పరిశ్రమలోకి ముందుగా సింగర్గా ఎంట్రీ ఇచ్చారు. 2005లో 'కందా నాల్ ముదల్' అనే తమిళ సినిమా ద్వారా సినిమా రంగంలోకి అడుగుపెట్టారు. ఆండ్రియా సోషల్ మీడియాలోనూ చాలా చురుకుగా ఉంటారు. ఎప్పటికప్పుడు తన ఫోటోలను షేర్ చేసి అలరిస్తూ ఉంటుంది. తాజాగా ఆమె కొన్ని ఫోటోలు షేర్ చేయగా అవి ఫ్యాన్స్ ని విపరీతంగా ఆకట్టుకుంటున్నాయి. రకరకాల డ్రెస్సులు ధరించి హాట్ షో చేసింది. అన్ని ఫోటోల్లోనూ ఆమె ఎక్కువగా థైస్ షో చేయడం విశేషం. ఈ ఫోటోల్లో ఆమె చాలా హాట్ గా కనిపిస్తోంది. ఆమె వయసు 40కి చేరువ అవుతున్నా కూడా గ్లామరస్ గా కనపడుతోంది. ఈ సంగతి పక్కన పెడితే ఆండ్రియా చాలా సార్లు వార్తల్లోకి ఎక్కిన సందర్భాల్లో ఉన్నాయి.తమిళ హీరోలు మ్యూజిక్ డైరెక్టర్లతో ఆమెకు లవ్ ఎఫైర్స్ ఉన్నాయని వార్తలు రావడం విశేషం. ముఖ్యంగా ధనుష్ ఫహాద్ ఫాజిల్ అనిరుధ్ రవిచందర్ వంటి వారితో ప్రేమాయణం నడిపిందని అప్పట్లో వార్తలు గుప్పుమన్నాయి. అనిరుధ్ తో అయితే ఏకంగా ఫోటోలు కూడా బయటకు లీక్ అవ్వడం విశేషం.

## పచ్చ కోకలో హంస హొయలు

జగపతిబాబు సహా పరిశ్రమ టాప్ హీరోల సరసన నటించిన హంసానందిని ఊహించని కొన్ని కారణాలతో పరిశ్రమ నుంచి దూరంగా ఉన్న సంగతి తెలిసిందే. అప్పట్లో క్యాన్సర్ కి చికిత్స పొంది కోలుకున్నానని ప్రకటించింది. ఆ తర్వాత ట్రావెల్ బ్లాగర్ గా తన జర్నీని సాగిస్తున్నట్టు తెలిపింది. ఇక నిరంతరం కుకింగ్ వీడియోలతో ఆదాయ ఆర్జన సాగిస్తూ కాలం గడిపింది. ఇప్పటికీ యూట్యూబర్ గా రాణిస్తున్న హంసాకు ఆదాయ పరమైన సమస్య



లేదు. ఇక సోషల్ మీడియాల్లో ఎంతో యాక్టివ్ గా ఉంటున్న హంసానందిని రెగ్యులర్ ఫోటోషూట్లను ఇన్ స్టాలో షేర్ చేస్తూ అభిమానులకు టచ్ లో ఉంటోంది. కేరళ- మున్నార్ టూరిజానికి బ్రాండ్ అంబాసిడర్ గా హంస పలు స్టోరీస్ కూడా చేసింది. స్వాన్ స్టోరీస్ పేరుతో ఈ అమ్మడు ఇటీవల ప్రతిదీ అభిమానులకు షేర్ చేస్తోంది. ఇదివరకూ వంటల కార్యక్రమాల్ని షేర్ చేయగా వైరల్ అయ్యాయి. మొత్తానికి హంస ప్రయత్నాలకు తెలుగు లోగిళ్లలో బోలెడంత అండ ఉంది. ఇటీవల ఎందుకనో ఈ అమ్మడు టాలీవుడ్ కి పూర్తిగా దూరమైపోయింది. ఇక హంస లేటెస్ట్ ఫోటో సిరీస్ లో శారీలో ట్రెడిషనల్ లుక్ తో కనిపించింది. పాక్షికంగా హంస అందాలను ఆ చిలుకాకుపచ్చ కోక ఎంతో పెంచిందని చెప్పాలి. టాలీవుడ్ నుంచి దూరమైన ఈ బ్యూటీ నటన విరమించు కున్నట్టేనా? అంటూ ప్రశ్నిస్తున్నారు కొందరు. అయితే అన్నిటికీ ధీటుగా సమాధానమిస్తూ నటిగా కంబ్యాక్ అవుతుందేమో చూడాలి. ఇలా పచ్చకోకలో అందమైన హంస హొయలు కవ్విస్తున్నాయ్ అంటూ అభిమానులు కామెంట్లు చేస్తున్నారు.

## టోన్డ్ లెగ్స్ రెడ్ హాట్ లుక్ తో కిల్లర్ బ్యూటీ

అందానికి అందం ప్రతిభతో యువతరం దృష్టిని ఆకర్షించింది కృతిశెట్టి. కన్నడ రంగం నుంచి వచ్చి టాలీవుడ్ లో క్రేజీ హీరోయిన్ గా వెలిగిపోతోంది. ఉప్పెన సినిమాతో తెరంగేట్రం చేసిన ఈ బ్యూటీ బ్యాక్ టు బ్యాక్ పలు భారీ చిత్రాల్లో అవకాశాలు అందుకుంది. ఆశించిన విజయాలు దక్కకపోయినా అవకాశాలకు అయితే కొదవేమీ లేదు. ఇక పరిశ్రమలో కేవలం నాలుగైదేళ్లలో సాధించింది కొంతే. అందుకే ఇప్పుడు తన కెరీర్ పరిధిని మరింతగా విస్తరించేందుకు, తనను తాను మెరుగులు దిద్దుకునేందుకు ఈ భామ ప్రయత్నిస్తోందట. ఇంతలోనే మరో ఏడాది పెద్దదైపోయింది. 21 సెప్టెంబర్ 2023..నాటికి కృతి శెట్టికి 19 ఏళ్లు నిండుతాయి. ఈ ప్రత్యేక సందర్భాన్ని పురస్కరించుకుని తన అభిమానుల కోసం స్పెషల్ ట్రీట్ ప్లాన్ చేసింది ఇలా. ఈ ఫోటోలలో ముదురు ఎరుపు రంగు హాల్టర్ టాప్ మినీ దుస్తులలో ఎంతో అందంగా కనిపించింది. డిజైనర్



లుక్ కి తగ్గట్టుగానే, ముదురు ఎరుపు రంగు లిప్‌స్టిక్ తో కిల్ చేసింది. ఇది కృతి అద్భుతమైన రూపానికి అదనపు ఆకర్షణను పెంచింది. కృతి ఎంతో ఇదిగా టోన్డ్ లెగ్స్ సౌందర్యాన్ని ప్రదర్శించింది. ఈ స్పెషల్ లుక్ తో పాటు, కృతి శెట్టి ఒక అందమైన సందేశాన్ని కూడా పోస్ట్ చేసింది.''నేను భూమిపై మరొక సంవత్సరం పూర్తి చేసుకుంటున్నాను. ఇదంతా కృతజ్ఞత మాత్రమే%ా% నేను కలిగి ఉన్నదంతా, నా కోసం నేను చేసినదంతా, నాకు ఇచ్చినదంతా... ఆనందం, ప్రేమ, ద్వేషం, బాధ... ఇవే నన్ను ఈ రోజు నన్ను నేనుగా మలిచినవి.. దీనికి చాలా కృతజ్ఞతలు... నా గొప్ప ప్రేరణ నా కుటుంబం..మీ అందరికీ కృతజ్ఞతలు... అడుగడుగునా నాకు మద్దతుగా నిలిచినందుకు ధన్యవాదాలు" అని రాసింది. ఈ కొద్దిపాటి ప్రయాణంలో తనతో ఉన్న కుటుంబం, మద్ధతుదారులకు తనదైన శైలిలో కృతి ధన్యవాదాలు తెలిపింది. బర్త్ డే బేబి కెరీర్ లో ఆశించిన పెద్ద విజయాలు దక్కాలని ఆకాంక్షిస్తూ పుట్టినరోజు శుభాకాంక్షలు.



# తెలంగాణకు మూడో వందేభారత్ ఎక్స్ ప్రెస్

## వర్చువల్ గా ప్రారంభించనున్న ప్రధాని మోడీ!!

హైదరాబాద్ : తెలంగాణా కు కేంద్రం గుడ్ న్యూస్ చెప్పింది. దేశంలో తెలంగాణా రాష్ట్రానికి ఇస్తున్న ప్రాధాన్యతను చెప్పే ప్రయత్నం చేస్తుంది కేంద్రంలోని బీజేపీ సర్కార్. తెలంగాణా రాష్ట్రానికి మూడో వందే భారత్ ఎక్స్ప్రెస్ త్వరలో ప్రారంభం కానున్నట్టు ప్రకటించింది . ఈ నెల 24 వ తేదీన భారత ప్రధాని నరేంద్ర మోడీ ఈ రైలును వర్చువల్ గా ప్రారంభించనున్నారు. కాచిగూడ బెంగళూరు మధ్య ఈ రైలు తిరగనుంది. కాచిగూడ నుండి ఈ కార్యక్రమంలో గవర్నర్ తమిళి సై, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తదుతరులు పాల్గొననున్నారు.మూడో వందేభారత్ రైలును ఆదివారం కాచిగూడ నుంచి బెంగళూరుకు జెండా ఊపి ప్రధాని ప్రారంభించనున్నారు. ఇదే రోజు వివిధ ప్రాంతాల నుంచి 9 వందేభారత్ రైళ్లను ప్రధాని నరేంద్ర మోదీ జెండా ఊపి ప్రారంభించనున్నారు. కాచిగూడ నుంచి బయలుదేరే వందే భారత్ రైలు బుధవారం మినహా వారంలోని అన్ని రోజుల్లో సగటున గంటకు 71.74 కిలోమీటర్ల వేగంతో 8.30 గంటల్లో 610 కిలోమీటర్లు ప్రయాణిస్తుంది. వందే భారత్ రైలు కాచిగూడ నుంచి ఉదయం 5.30 గంటలకు బయలుదేరి మధ్యాహ్నం 2.15 గంటలకు యశ్వంత్‌పూర్ చేరుకుంటుంది.

ఈ రైలుకు మహబూబ్‌నగర్, కర్నూలు సిటీ, అనంతపూర్‌లో హాల్ట్‌లు ఉంటాయి. తిరుగు ప్రయాణంలో రైలు యశ్వంత్‌పూర్‌లో మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభమై రాత్రి 11.15 గంటలకు కాచిగూడ చేరుకుంటుంది. మొదటి రోజు వందేభారత్ రైలు కాచిగూడలో మధ్యాహ్నం 12.30 గంటలకు ప్రారంభమవుతుంది. దేశంలో ఏ రాష్ట్రానికి లేనంతగా తెలంగాణ నుంచి మూడో వన్దే భారత్ ఎక్స్ ప్రెస్ ప్రారంభించబోతున్న నేపథ్యంలో ఈ వందే భారత్ ఎక్స్ ప్రెస్ వినాయక నవరాత్రుల కానుకగా చెబుతున్నారు. ఈ రైలు మొత్తం 12 జిల్లాల మీదుగా వెళుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్, రంగారెడ్డి, మహబూబ్నగర్, వనపర్తి, జోగులాంబ గద్వాల్ జిల్లా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కర్నూలు, నంద్యాల, అనంతపూర్, శ్రీ సత్య సాయి జిల్లాలు, కర్ణాటక రాష్ట్రంలోని చిక్ బళ్ళాపూర్, బెంగళూరు మీదుగా ప్రయాణం చేయనుంది.

# హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు జిల్లాల్లో వాన.. సింగరేణిలో నిలిచిన బొగ్గు ఉత్పత్తి

హైదరాబాద్: హైదరాబాద్ సహా రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో వర్షం కురుస్తున్నది. శుక్రవారం తెల్లవారుజాము నుంచి హైదరాబాద్‌లోని ఖైరతాబాద్, అమీర్‌పేట, పంజాగుట్ట, ఎస్‌ఆర్‌నగర్, సనత్ నగర్, బోరబండ, కాప్రా, ఈసీఐఎల్, మల్కాజిగిరి, ముషీరాబాద్, కూకట్‌పల్లి, హైదర్‌నగర్, ఆల్విన్ కాలనీ, మూసాపేట, ప్రగతి నగర్, నిజాంపేట, బాచుపల్లి, సైదాబాద్, మలక్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, ఉప్పల్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, కొండాపూర్‌లో వర్షం కురిసింది. పలు ప్రాంతాల్లో రహదారులు జలమయమయ్యాయి. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో ఎడతెరపి లేకుండా వర్షం కురుస్తున్నది. దీంతో సింగరేణి గనుల్లో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయింది. కేటీకే ఉపరితల గని-2, 3లో బొగ్గు ఉత్పత్తి ఆగిపోయింది. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీంతో పలు ప్రాంతాలకు వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. కే.సముద్రం మండలం అర్పణపల్లి బ్రిడ్జిపై వట్టివాగు ఉధృతంగా ప్రవహిస్తున్నది. దీంతో కే.సముద్రం నుంచి గూడూరుకు వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో భారీ వాన పడుతున్నది. రాగల రెండు రోజుల



పాటు రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురిసే అవకాశం ఉన్నదని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని పేర్కొంది. పలుచోట్ల ఉరుములు, మెరుపులతో వాన పడుతుందని చెప్పింది. ఈ మేరకు ఎల్లో అలర్ట్ జారీ చేసింది.

# మైనార్టీల సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్ : మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట : మైనార్టీల సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలించిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలోని పి.ఎస్.ఆర్ సెంటర్ వద్ద గల చిన మజీద్ సమీపంలో రూ. 80లక్షల వ్యయంతో నిర్మించనున్న మైనార్టీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో పరిపాలించిన పార్టీలు ముస్లింలను కేవలం ఓటుబ్యాంక్ గానే చూశాయి తప్పా వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా మైనార్టీల బతుకులు మారలేదు. వారి జీవితాల్లో వెలుగులు కానరాలేదన్న మంత్రి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముస్లిం సోదరుల జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. షాదీముబారక్, మైనారిటీ గురుకులాలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, ఇమామ్, మౌజన్‌కు గౌరవవేతనం, హజ్ యాత్రికులకు ఏర్పాట్లు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణలాంటి అనేక కార్యక్రమాలు మైనారిటీల ప్రగతికి మైలురాయిగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ, మౌలానా అత్తర్ సాబ్, గాయాజ్ బాయ్, ఆఫీజ్ ఖాలీల్ సాబ్, రియాజ్, కౌన్సిలర్లు తాహెర్ పాష, జహీర్, గండూరి రాధిక, షాదీ ఖానా చైర్మన్ సయ్యద్ సలీం, షాహద్ మౌలానా, అజీజ్, గౌస్ ఖాన్, తాహేర్, గౌస్, నజీర్, తదితరులు పాల్గొన్నారు.

# కిషన్ రెడ్డికి ఝులక్.. అంబర్ పేట బీజేపీలో కుదుపు

హైదరాబాద్ : బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డికి భారీ ఝులక్ తగిలింది. కిషన్ రెడ్డి సొంత నియోజకవర్గం అయిన అంబర్ పేట బీజేపీలో కుదుపు వచ్చింది. హైదరాబాద్ బీజేపీ నగర మాజీ అధ్యక్షుడు వెంకటరెడ్డి పార్టీకి రాజీనామా చేశారు. ఆ కాసేపటికే వెంకటరెడ్డి దంపతులు మంత్రి కేటీఆర్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కిషన్ రెడ్డికి ప్రధాన అనుచరుడిగా వెంకటరెడ్డి ఇంతకాలం ఉన్నారు. అయితే అంబరుపేట నుంచి పోటీచేసే అవకాశమివ్వాలని కిషన్ రెడ్డిని కోరారు. అయితే కిషన్ రెడ్డి మాత్రం ఎలాంటి సమాధానమూ ఇవ్వలేదు. నెలరోజులుగా కిషన్ రెడ్డి సమాధానం కోసం వెంకటరెడ్డి వెయిట్ చేసి.. చివరకు బీజేపీకి రాజీనామా చేసి బీఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు.



# మధుయాష్కీని టార్గెట్ చేస్తూ గోనె ప్రకాష్ తీవ్ర విమర్శలు

న్యూఢిల్లీ: కాంగ్రెస్ సీనియర్ నేత మాధుయాష్కీని టార్గెట్ చేస్తూ మాజీ ఎమ్మెల్యే గోనె ప్రకాష్ విమర్శలు గుప్పించారు. శుక్రవారం మీడియాతో మాట్లాడుతూ... మధుయాష్కీ మోసగాడన్నారు. మధుయాష్కీ, ఆయన కుటుంబ సభ్యులు తప్పుడు ధ్రువపత్రాలతో విదేశాల్లో ఉంటున్నారని తెలిపారు. న్యూయార్క్‌లో ఒక ఆటార్నీని మోసం చేసినందుకు న్యూయార్క్ కోర్టు లాయర్‌గా యాష్కీని నిషేధించిందని చెప్పారు. మధుయాష్కీ న్యూయార్క్‌లో అటార్నీ కాదన్నారు. మధుయాష్కీ అమెరికాలో అంట్లు తోమారేమో అంటూ వ్యాఖ్యలు చేశారు. దొంగ సర్టిఫికెట్లతో డిగ్రీలు సంపాదించారని ఆరోపించారు. కాకతీయ, గుల్బర్గా యూనివర్సిటీల నుంచి ఆర్టీఐ ద్వారా సమాచారం సేకరించానని తెలిపారు. గతంలోనే తనప ఆరోపణలపై యాష్కీ దాడి చేయించారని.. తాను చావుకు కూడా భయపడనని తెలిపారు. మధుయాష్కీపై హైకోర్టులో పోరాడుతున్నానని ఆయన అన్నారు. జాతీయ అధికార ప్రతినిధి హోదాలో ఒక్క అంశంపై కూడా మధుయాష్కీ మాట్లాడలేదన్నారు. ఎల్బీ నగర్‌లో మధుయాష్కీకి డిపాజిట్లు కూడా రావని.. ఆయన వల్ల కాంగ్రెస్ 10 సీట్లు కోల్పోతుందని అన్నారు. నిజామాబాద్‌లో ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు. కర్ణాటకలో తన వల్ల రెండు సార్లు కాంగ్రెస్ గెలిచిందని అంటున్న యాష్కీ నిజామాబాద్2లో ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీశారు. జంగయ్య అనే చాకలి వ్యక్తిని వంట మనిషిగా అమెరికా తీసుకువెళ్లి అక్కడ ఆయన గ్రీన్ కార్డును ఇతరులకి అమ్ముకున్న వ్యక్తి మధుయాష్కీ అంటూ విరుచుకుపడ్డారు. 20 ఏళ్ల పాటు అమెరికాలో ఉండి వచ్చారని.. మధుయాష్కీ వందల మందిని మోసం చేశారని ఆరోపించారు. మధుయాష్కీ జైలుకు పోవడం ఖాయమన్నారు. ఆయనను ఇంటర్ పోల్ వాళ్ళు పట్టుకుంటారని.. అమెరికాకు జీవితంలో పోలేరన్నారు. యాష్కీ కుటుంబ సభ్యులు జైలుకు వెళ్తారని.. ఇండియాకు తిరిగివస్తారని గోనె ప్రకాష్ వ్యాఖ్యలు చేశారు.



# ఉద్యోగం పోలీసు శాఖలో.. విధులు ఉగ్రవాదంలో..!

ఉద్యోగమేమో పోలీసు శాఖలో.. చేసేదేమో ఉగ్రవాదులకు సహకారం. ఇదేదో చిన్నా చితకా ఉద్యోగి వ్యవహారం కాదు.. ఏకంగా ఓ డీఎస్పీ నిర్వాకం. జమ్మూకశ్మీర్ పోలీసు శాఖలో డీఎస్పీగా పనిచేస్తున్న షేక్ ఆదిల్ ముస్తాక్.. ఉగ్ర ఆపరేటీవ్‌లకు సహకరిస్తున్నట్లు అధికారులు గుర్తించారు. అంతేకాదు.. అతడిపై దర్యాప్తు చేస్తున్న అధికారిని దీనిలో ఇరికించాలని యత్నించాడు. తాజాగా ముస్తాక్‌ను పోలీసులు అరెస్టు చేశారు. అతడిని శ్రీనగర్‌లోని న్యాయమూర్తి ఎదుట హాజరుపర్చి ఆరు రోజుల కస్టడీకి తీసుకొన్నారు.

**ఉగ్రవాదిని ఇంటరాగేట్ చేస్తే బయటపడింది..** జులైలో పోలీసులు ఓ ఉగ్రవాదిని అరెస్టు చేశారు. అతడి ఫోన్‌ను విశ్లేషించారు. అనంతరం సదరు ఉగ్రవాదిని విచారించగా.. డీఎస్పీ ఆదిల్ ముస్తాక్‌తో తాను నిరంతరం టచ్‌లో ఉన్నట్లు వెల్లడించాడు.

చట్టం కన్ను గప్పడంలో అతడు తనకు సాయం చేసినట్లు ఉగ్రవాది వెల్లడించాడు. టెలిగ్రామ్ యాప్ ద్వారా ముస్తాక్ ఉగ్రవాదితో మాట్లాడటం, మెసేజ్‌లు చేయడం వంటివి చేసినట్లు సీనియర్ అధికారులు గుర్తించారు. "డీఎస్పీకి ఉగ్రవాదికి మధ్య 40 ఫోన్‌కాల్ సంభాషణలు జరిగాయి. అరెస్టును తప్పించుకోవడం, న్యాయసాయం పొందడంపై డీఎస్పీ అతడికి సలహాలు ఇస్తున్నాడు" అని ఈ కేసును దర్యాప్తు చేస్తున్న సీనియర్ అధికారి వెల్లడించారు.

**దర్యాప్తు అధికారులనే ఇరికించేందుకు..** సదరు డీఎస్పీకి వ్యతిరేకంగా టెక్నికల్ సాక్ష్యాలతోపాటు నగదు ఎలా అతడి వద్దకు చేరిందనే అంశాలను కూడా సేకరించినట్లు దర్యాప్తు వర్గాలు వెల్లడించాయి. ఈ క్రమంలో ఉగ్ర నగదు సేకరణపై దర్యాప్తు చేస్తున్న అధికారినే కేసులో ఇరికించాలని ఆదిల్ యత్నించినట్లు పోలీసులు చెబుతున్నారు. ''ఈ ఏడాది ఫిబ్రవరిలో ఉగ్ర ఆరోపణలు ఎదుర్కొంటున్న ముగ్గురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.31 లక్షలు స్వాధీనం చేసుకొన్నారు. ఈ కేసులో ముజ్మిల్ జహూర్ అనే వ్యక్తి కీలకమని గుర్తించి వేట మొదలుపెట్టారు. మరో వైపు అరెస్టు అయిన వారిలో ఒక వ్యక్తి ఇన్వెస్టిగేషన్ ఆఫీసర్‌పై అవినీతి ఆరోపణలు చేసినట్లు ఆదిల్ ఓ ఫిర్యాదును సృష్టించాడు' అని దర్యాప్తు అధికారి పేర్కొన్నారు. లష్కరే తొయిబాకు నిధులు సేకరించే ముజ్మిల్ జహూర్‌తో డీఎస్పీ ఆదిల్‌కు సన్నిహిత సంబంధాలున్నాయి. అతడిని ఆదిల్ అరెస్టు నుంచి తప్పించినట్లు తెలిసింది. ఈ క్రమంలో ఉగ్రవాదుల నుంచి డీఎస్పీ రూ.5లక్షలు సొమ్ము తీసుకొన్నట్లు తేలింది. దర్యాప్తు అధికారులపైనే ఉగ్రవాదులు ఆరోపించినట్లు తప్పుడు ఫిర్యాదులను కూడా ఆదిల్ సృష్టించాడు. జులైలో ముజ్మిల్‌ను పోలీసులు అరెస్టు చేయటంతో అతడు విషయం వెలుగులోకి వచ్చింది.

అంతేకాదు.. జమ్మూకశ్మీర్‌లో బలవంతపు వసూళ్లు, బ్లాక్‌మెయిలింగ్‌కు పాల్పడినట్లు ఆదిల్‌పై ఆరోపణలు ఉన్నాయి. అతడి బాధితులు క్రమంగా పోలీసుల వద్దకు వచ్చి ఫిర్యాదులు చేస్తున్నారు. నిందితుడు ఆదిల్ ట్విటర్‌లో చాలా చురుగ్గా ఉన్నాడు. అతడికి ఏకంగా 44 వేల మంది ఫాలోవర్లు ఉండటం గమనార్హం.

# మైనంపల్లి మళ్లీ రూటు మారుస్తున్నారా?



హైదరాబాద్ : తెలంగాణలో వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో గెలిచి మరోసారి అధికారంలోకి రావాలని బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ భావిస్తున్నారు. ఈ క్రమంలో అన్ని పార్టీల కంటే ముందుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులను ప్రకటించారు. ఈ క్రమంలో మల్కాజిగిరి నుంచి సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావుకే సీటు లభించింది. అయితే మెదక్ నుంచి తన కుమారుడు రోహిత్ కు సీటు ఆశించిన మైనంపల్లికి నిరాశే ఎదురైంది. ఈ నేపథ్యంలో మైనంపల్లి హన్మంతరావు.. ఆర్థిక శాఖ మంత్రి హరీశ్ రావు లక్ష్యంగా చేసిన వ్యాఖ్యలు తీవ్ర కాక రేపాయి. హరీశ్ అంతం చూస్తానని... మెదక్ జిల్లాలో హరీశ్ ఆధిపత్యాన్ని అణగదొక్కుతానని మైనంపల్లి చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారానికి దారితీశాయి. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సహా కేసీఆర్ కుమార్తె ఎమ్మెల్సీ కవిత.. మైనంపల్లి వ్యాఖ్యలను ఖండించారు. బీఆర్ఎస్.. హరీశ్ రావుకు తోడుగా ఉంటుందని తేల్చిచెప్పారు. మరోవైపు మైనంపల్లి హన్మంతరావు తన కుమారుడికి కావాలని ఆశిస్తున్న మెదక్ సీటు సిట్టింగ్ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డికే దక్కింది. హరీశ్ రావుపై చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో మైనంపల్లిని పార్టీ నుంచి బహిష్కరిస్తారని చర్చ జరిగింది. అయితే ఇప్పటివరకు అలాంటిదేమీ జరగలేదు. మైనంపల్లి ఏం చేయబోతారో చూసి దానికనుగుణంగా ఎత్తులు వేయాలని కేసీఆర్ నిర్ణయించుకున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో మైనంపల్లి హన్మంతరావు సెప్టెంబర్ 17న కాంగ్రెస్ నేతల సమక్షంలో ఆ పార్టీలో చేరతారని వార్తలు వచ్చాయి. ఈసారి కాంగ్రెస్ అత్యున్నత విధాన నిర్ణాయక విభాగం.. సీడబ్ల్యూసీ సమావేశం హైదరాబాద్ లో నిర్వహించనున్న సంగతి తెలిసిందే. ఇందులో భాగంగా భారీ బహిరంగ సభను కూడా కాంగ్రెస్ పార్టీ నిర్వహించబోతోంది. ఈ కార్యక్రమంలోనే మైనంపల్లి హన్మంతరావుతోపాటు మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత తుమ్మల నాగేశ్వరరావు కూడా బీఆర్ఎస్ లో చేరతారని టాక్ నడిచింది. అయితే ప్రస్తుతం మైనంపల్లి హన్మంతరావు ప్రాతినిధ్యం వహిస్తున్న మల్కాజిగిరితోపాటు ఆయన తన కుమారుడికి ఆశిస్తున్న మెదక్ సీటును కూడా కాంగ్రెస్ పార్టీ ఇవ్వడానికి అంగీకరించలేదని సమాచారం. గతంలో రాజస్థాన్ లోని ఉదయ్ పూర్ లో తీసుకున్న డిక్లరేషన్ ప్రకారం కుటుంబంలో ఒకరికే సీటును కాంగ్రెస్ పార్టీ ఇవ్వనుందని అంటున్నారు. ఈ నేపథ్యంలో మైనంపల్లి హన్మంతరావు కూడా తన రూటు మార్చారని అంటున్నారు. కాంగ్రెస్ లో చేరినా రెండు సీట్లు దక్కే అవకాశం లేకపోవడంతో ఆయనకు మిగిలింది ఇక బీజేపీనే. అయితే బీజేపీలో రెండు సీట్లు ఆయన కుటుంబానికి దక్కినా గెలుపు మాత్రం ఇద్దరికీ కష్టమయ్యే అవకాశాలే ఎక్కువ ఉన్నాయని అంటున్నారు. అటు మల్కాజిగిరిలో కానీ, మైనంపల్లి కుమారుడు పోటీ చేయాలనుకుంటున్న మెదక్ లో కానీ బీజేపీ ప్రభావం అంతంత మాత్రమేనని చెబుతున్నారు. ఈ క్రమంలో తాజాగా తిరుమలకు వచ్చిన మైనంపల్లి హన్మంతరావు హాట్ కామెంట్స్ చేశారు. పది రోజుల తర్వాత తన నిర్ణయాన్ని ప్రకటిస్తానని తెలిపారు. దీంతో మైనంపల్లి పార్టీ మారే విషయంలో పునరాలోచనలో ఉన్నట్టు చెబుతున్నారు. మైనంపల్లి.. హరీష్ పై చేసిన వ్యాఖ్యలపై అప్పట్లో స్పందించిన కేసీఆర్.. పోటీ చేయాలనుకుంటే చేయొచ్చని లేదా చేయకపోయినా ఆయనిష్టమని వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మైనంపల్లి ముందు ఉన్న దారులు రెండే అంటున్నారు. కాంగ్రెస్ లో చేరడం లేదా బీజేపీలో చేరి అదృష్టాన్ని పరీక్షించుకోవడమేనని చెబుతున్నారు. మరి మైనంపల్లి ఏం చేస్తారో.




# సూరీడు, ముగ్గురు పోలీసులపై కేసు

హైదరాబాద్ : మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి మాజీ వ్యక్తిగత సహాయకుడు ఎర్రంరెడ్డి సూర్యనారాయణరెడ్డి అలియాస్ సూరీడుతో పాటు మరో ముగ్గురు పోలీసు అధికారులపై హైదరాబాద్ బంజారాహిల్స్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైంది. గతంలో తనపై దాడిచేసి, ఇబ్బంది పెట్టిన మామ సూరీడు, ముగ్గురు పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సూరీడి అల్లుడు సురేందర్‌రెడ్డి కోర్టును ఆశ్రయించడంతో.. కోర్టు ఆదేశం మేరకు వారిపై కేసు నమోదైంది. పోలీసుల కథనం ప్రకారం.. సూరీడి కుమార్తెను కడపకు చెందిన పోతిరెడ్డి సురేందర్‌రెడ్డికి ఇచ్చి గతంలో పెళ్లిచేశారు. తర్వాత భార్యాభర్తల మధ్య విభేదాలు తలెత్తడంతో సూరీడి కుమార్తె తన భర్తపై వరకట్న వేధింపుల కింద కేసు పెట్టారు. 2021 మార్చి 23న రాత్రి 7.30కు సురేందర్‌రెడ్డి క్రికెట్ ఆడిన తర్వాత కుమార్తెను చూడడానికి జూబ్లీహిల్స్‌లోని తన మామ ఇంటికి వెళ్లారు. అక్కడ మామా అల్లుళ్ల మధ్య గొడవ జరిగింది. అల్లుడిపై సూరీడు దాడిచేశారు. అదే సమయంలో అక్కడికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు సురేందర్‌రెడ్డిని అదుపులోకి తీసుకొని, ఆయన చేతిలోని క్రికెట్ బ్యాట్‌ను, ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకొని స్టేషన్‌కు తరలించారు. ఆ సమయంలో జూబ్లీహిల్స్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన రాజశేఖర్‌రెడ్డి, ఎస్సై నరేష్‌లు... ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్‌లో ఐజీగా పనిచేస్తున్న జి.పాలరాజుతో కలిసి తనను అక్రమంగా నిర్బంధించి, దాడికి పాల్పడ్డారని సురేందర్‌రెడ్డి ఆరోపించారు. తనను అక్రమంగా కస్టడీలోకి తీసుకొని, తనపై తప్పుడు కేసులు పెట్టిన సూర్యనారాయణరెడ్డి (సూరీడు), రాజశేఖర్‌రెడ్డి, నరేష్, పాలరాజులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ గత మంగళవారం సురేందర్‌రెడ్డి మూడో అదనపు చీఫ్ మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ దృష్టికి తీసుకెళ్లగా న్యాయమూర్తి ఆయన వాంగ్మూలాన్ని పరిశీలించి కేసు నమోదు చేయాలంటూ బంజారాహిల్స్ పోలీసులను ఆదేశించారు. ఈ మేరకు బంజారాహిల్స్ డివిజన్ ఏసీపీ సుబ్బయ్య నేతృత్వంలో పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. గతంలోనూ పాలరాజుపై సురేందర్‌రెడ్డి ఫిర్యాదు చేయగా, సైఫాబాద్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది.

# కేటీఆర్.. కుంభకర్ణుడి అసలైన వారసులు మీరే..

హైదరాబాద్: ప్రతిపక్షాలను సంక్రాంతి గంగిరెద్దులతో పోల్చిన మంత్రి కేటీఆర్‌కు వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు షర్మిలారెడ్డి గట్టి కౌంటర్ ఇచ్చారు. లోటస్‌పాండ్‌లో శుక్రవారం నాడు మీడియాతో షర్మిల మాట్లాడుతూ.. "సంక్రాంతి గంగిరెద్దులతో ప్రతిపక్షాలను పోల్చే చిన్న దొర కేటీఆర్.. ఎన్నికల ముందు నిద్ర లేచిన కుంభకర్ణుడి అసలైన వారసులే మీరే.ఓట్ల ముందే ప్రజలు గుర్తుకొస్తారు. మీరు నిద్రలేస్తారు.. పథకాలను నిద్ర లేపుతారు.కొత్త కొత్త స్కీంలంటూ పిట్ట కథలు చెప్తారు. మాయమాటలతో మాయాజాలం చేస్తారు. పప్పులుడకవని తెలిస్తే సెంటిమెంట్‌ను రాజేస్తారు.అభివృద్ధి తప్ప అన్ని విద్యలు ప్రదర్శిస్తారు. నమ్మి ఓట్లేసి గెలిపిస్తే మళ్లీ జనం వైపు కన్నెత్తి కూడా చూడరు. ప్రశ్నించే ప్రతిపక్షాలను అణగదొక్కడం, అరెస్టులు చేయడం ఇదే మీకు తెలిసిన విద్య. రెండుసార్లు ప్రజలు పట్టం కడితే పెట్టినవి పంగనామాలే తప్ప.. ఒక్క వర్గానికైనా మేలు జరగలేదు. 8 ఏళ్లలో కేవలం 30 వేల ఇళ్లు కట్టిన మీరే దేశానికి ఆదర్శం అయితే.. 5 ఏళ్లలో 42 లక్షల పక్కా ఇళ్లు కట్టించిన వైఎస్సార్ పాలనను ఏమనాలి?మహానేత కట్టించిన ఇళ్లల్లో ఒక్క శాతం కూడా కట్టించడం చేతకాని దద్దమ్మలు మీరు. దొంగ హామీలతో అధికారంలోకి వచ్చిన మోసగాళ్లు మీరు. పాలన చేతకాని అసమర్థులు మీరు. 2.90 లక్షల ఇళ్లు కడతామని చెప్పి లక్ష ఇళ్లు కూడా కట్టలేదు. స్కీముల పేరుతో స్కాంలు చేసి మీరు లక్ష కోట్లు కాజేశారు.

బంగారు తెలంగాణ అని చెప్పి 5 లక్షల కోట్ల రూపాయల అప్పుల కుప్పగా రాష్ట్రాన్ని మార్చారు. ఇన్నేళ్లుగా పథకాలను అటకెక్కించి, ఎన్నికలకు మూడు నెలల ముందు దుమ్ము దులిపి, నలుగురికి మమ అనిపించి.. మరిన్ని కొత్త పథకాలు అని చెప్తే నమ్మే రోజులు లేవు కేటీఆర్. మీ పథకాలు, మీరు అంతా ఒక బోగస్" అని వైఎస్ షర్మిల తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

Printed, Published and owned by VISHWANATH V, Printed at S A Printers D No 3 92 Shed No 2, Sy No 45 and 49, Sadashiv Nagar Narapally Village, Ghatkesar Mandal, Medchal - Malkajgiri District, Telangana - 501301. and Published from D.No. 5-87, Near Gandhi Statue, Aliyabad, Shamirpet (M) - 500 078, Medchal-Malkajgiri District, Telangana State.
Editor : VISHWANATH V, Rni Title Code No. TELTEL02115, Phone No. 8977598262, Email Id : reportervishwanath@gmail.com